

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డాక్టర్ ప్రణవ్ పండ్యా

సంపాదక మండలి
**కందర్ప రామచంద్ర రావు**
**ప్రొఫెసర్ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డాక్టర్ తుమ్మూరి**
**సి.వి. శ్యామల రావు**
**డి.వి.ఆర్. మూర్తి**

సంపుటి 9 - సంచిక 6

**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 90**
**3 సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**
**శాశ్వత చందా రూ॥ 1800**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD

సలహాలు, సూచనలకు :
శ్రీ అశ్విని సుబ్బారావు
040-23700722

## సంత్, సంస్కర్త, అమరవీరుడు

పరబ్రహ్మ యొక్క అవతార చేతన మూడు రూపాలలో కానవస్తుంది. సంత్, సంస్కర్త, అమరవీరుడు అనే రూపాలలో పరమాత్మ చేతన దిగివస్తుంది.

తన ఉపదేశాల ద్వారా కాక– తన శీలం ద్వారా, వ్యక్తిత్వం ద్వారా సంస్కారవంతమైన జీవితాన్ని గడపడం ఎలాగో నేర్పే వ్యక్తి– సంత్. అతడు తన వాసనలను అదుపు చేసుకుంటాడు. తనను తాను సంస్కరించుకుంటాడు. జీవితంలోని ప్రతి కణాన్నీ, ప్రతి క్షణాన్నీ సద్వినియోగపరుచుకునే సామర్థ్యాన్ని ఇతరులకు అలవరచుతాడు. మనఃస్థితిని అదుపుచేసే పరిశోధనాలయంగా, ఆలోచనలను సంస్కరించి ఆదర్శవాదంతో కూడిన ఉత్కృష్టతను జీవితంలో ఆవిష్కరించే పరిశోధనాలయంగా అతడు తనను తాను మలచుకుంటాడు. ఆ విధంగా ఇతరులకు ఉజ్వల ఉదాహరణగా నిలుస్తాడు. మనఃస్థితిని ఉన్నతంగా, ఉదాత్తంగా నిలుపుకునే సాహసాన్ని, విషమ పరిస్థితులలోసైతం మానవత్వపు ఉత్కృష్టతను నిలిపి ఉంచుకునే సాహసాన్ని అతడు జన మానసానికి ప్రదానం చేస్తాడు.

సంస్కర్త వాసనపైననే కాక తృష్ణపైన కూడ అదుపును సాధిస్తాడు. ఆత్మనిర్మాణం జరుపుకుంటాడు. ఇతరులను మార్చే పరాక్రమాన్ని ప్రదర్శిస్తాడు. ఆత్మ సంస్కరణ మన చేతుల్లో ఉన్న పని. కనుక సంత్ యొక్క కార్యక్షేత్రం పరిమితమైనది, సరళమైనది. అయితే– సంస్కర్త ఇతరులనుకూడ మార్చవలసి ఉంటుంది. సంత్ 'బ్రాహ్మణుడు'గా ఉంటే సరిపోతుంది. సంస్కర్త 'సాధువు'గా మారవలసి ఉంటుంది. ఒక చేతిలో శాస్త్రాన్నీ, మరో చేతిలో శస్త్రాన్నీ (ఆయుధాన్నీ) పట్టుకోవలసి ఉంటుంది. ప్రాణశక్తిని పెంచుకోవాలంటే– తృష్ణ–లిప్సనూ, అత్యాశనూ అదుపుచేయవలసి ఉంటుంది. సంస్కర్త యొక్క శీలం మహోన్నతంగా ఉండాలి. అతడి సాహసం జ్వలించేదిగా ఉండాలి. అతడి కార్యశూరత బలీయంగా ఉండాలి. అనాచారాలను వదులుకోవడానికీ, సదాశయాలను స్వీకరించడానికీ ఇతరులను ఒప్పించడం అతడికి అప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది. ఇలా సంస్కర్త రెండు రంగాలలో విజయం సాధించి, విస్తృతపరివర్తనకు భూమికను నిర్మాణం చేస్తాడు.

ఇక– అమరవీరుడు వాసన, తృష్ణలతోపాటు అహంకారాన్నికూడ త్యజించిన వ్యక్తి, ఇతరులకోసం తనను పూర్తిగా సమర్పించుకోవడం, శరణాగతి, పరమసత్తా యొక్క ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికై తన జీవితాన్ని త్యాగం చెయ్యడం– అమరవీరుని ముఖ్య లక్షణాలు. సంకుచిత స్వార్థపరత్వాన్ని నిర్మూలించడం, పరమార్థాన్నే తన ఆశాకేంద్రంగా మలచుకోవడం, అందులో ఆనందాన్ని అనుభూతి పొందడం, అందులో తన్మయత్వాన్ని పొందడం– ఇవే అమరవీరుని మహత్తర గుణాలు, అహంకారాన్ని హరింపజేసుకున్నవాడే అమరవీరుడు.


అవతారాన్ని ప్రత్యక్షంగా దర్శించదలచుకుంటే– పై ముగ్గురి విస్తరణనూ, స్థాయినీ సూక్ష్మంగా పరిశీలించాలి. యుగ పరివర్తన ప్రక్రియను తద్వారా అవగాహన చేసుకోవచ్చు.

★★★

**భయపడని వాడూ, భయం కల్గించనివాడే మహాత్ముడు.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** సంత్, సంస్కర్త, అమరవీరుడు 1
2. **విషయ సూచిక** 2
3. **సద్గురు వచనామృతం**
   పరమాత్మను దర్శించడం ఎలా 2
4. **వేద మంత్రం :** కలసిమెలసి జీవించు 3
5. **వర్తమాన భారతం**
   ఈనాటి సమస్యలు-రేపటి సమాధానాలు 4
6. **ముఖచిత్ర కథనం :** అష్టసిద్ధులు-నవనిధులు 7
7. **దీపావళి వ్యాసం**
   ఆర్థిక సమస్యలు-ఒక అవగాహన-దీపావళి 10
8. **ధారావాహిక : హనుమత్ కథామృతం-6**
   దివ్యజననం ఋషుల ఆగమనం 12
9. **బోధకథ :** జీవితమే సంపద 13
10. **ధారావాహిక : దేవసంస్కృతి సౌరభం-17**
    కర్మ ఫలం 14
11. **గాంధీ జయంతి ప్రత్యేకం**
    సాఫల్యం కొరకు రహస్య సూత్రాలు 16
12. **మనం-మన ఆరోగ్యం : పంచతత్వాలతో చికిత్స-9**
    ఆకాశ చికిత్స 18
13. **ధారావాహిక : భక్తి గాథ-12**
    భక్తుడు శాస్త్రాన్ని రక్షిస్తాడు 20
14. **ఆచరణలో అధ్యాత్మ :** త్యాగ రహస్యం 22
15. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-35**
    ఆనందమయ కోశము 23
16. **జీవించే కళ :** జీవితం పరమేశ్వరునికే అంకితం 26
17. **ధారావాహిక :** నా **స్మృతిపథంలో గురుదేవులు-26**
    గురుదేవుల కర్తవ్యనిష్ఠ 27
18. **మహిళా జాగరణ**
    మహాకాలుని సంకల్పం-21వ శతాబ్దం-నారీ శతాబ్దం-2 28
19. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-55**
    సరికొత్త వెలుగులో-1 30
20. **సాధన విజ్ఞానం :** ప్రేమ సాధన-ఆత్మీయతావిస్తరణ 33
21. **సద్గురులీలామృతం:** అసాధ్యం కూడా సుసాధ్యమవుతుంది
    గురుసత్తా ప్రాణంపోసింది 35
22. **విద్యావిస్తరణ కొరకు ఆహ్వానం** 36
23. **తత్వచింతన :** సంకల్పంలో దాగిన రహస్యం 39
24. **మంత్ర మూలం గురోర్వాక్యం-మోక్ష మూలం గురుకృపా** 41
25. **మానవుని పశువుగా మార్చే దుర్గుణాలు రెండు** 43
26. **వార్తలు** 45

# సద్గురు వచనామృతం

## పరమాత్మను దర్శించడం ఎలా?

పరమేశ్వరుని ఉనికి ధర్మానికి సంబంధించిన విషయం. ఆ ఉనికిని అనుభూతి పొందగలుగుతాము. మన అనుభవం ఎంతలోతుగా ఉంటే, ఎంత విస్తృతం అయితే అంత స్పష్టంగా మనం పరమాత్మ యొక్క విశాలతనూ, వ్యక్తీకరణనూ అవగాహన చేసుకోగలుగుతాము. పరమేశ్వర భావన మన హృదయంలో ఎంతగా స్థిర పడిందంటే దాన్ని అంతఃకరణ నుండి వెలికితీయడం కష్టమని అనిపిస్తోంది" -అని ప్రొఫెసర్ నైట్ పేర్కొన్నారు.

ఆంతరిక జ్ఞానం ద్వారానే మనం పరమాత్మ యొక్క అనుభూతిని పొందగలుగుతాము, పరమాత్మను సాక్షాత్కరించుకో గలుగుతాము. ఆంతరిక శక్తుల వికాసం ద్వారానే ఆ పని జరుగుతుంది. ఊహ, చింతన, ఆలోచన, భావన, కల మున్నగు వాని ద్వారా మనం ఆయన యొక్క ఒక తళుకును మాత్రమే చూడగలుగుతాము.

విశ్వాసాన్ని బలపరచేందుకు బుద్ధితత్వం కూడ అవసరమే. అయితే, పరమాత్మ యొక్క పూర్తి జ్ఞానాన్ని పొందాలంటే- మనం మనలోపలకు ప్రవేశించాలి; ఆత్మ యొక్క సూక్ష్మ సత్తాలో ప్రవేశించాలి. బుద్ధికి అందని పని ఇది. ఆత్మను ఆత్మయే ఛేదించగలుగుతుంది. ఆత్మగా మారినప్పుడే ఆత్మయొక్క సాక్షాత్కారాన్ని పొందగలగుతాము.

పరమేశ్వర జ్ఞానానికి కూడ ఈ సూత్రం వర్తిస్తుంది. జల బిందువు సముద్రంలో కలియడం ద్వారానే తాను సముద్రాన్ని అనే అనుభవాన్ని పొందగలుగుతుంది. అయితే- బిందువుగా ఉన్నంతవరకూ అది సముద్రపు లోతును కొలవజాలదు.

★★★

## పండుగలు

**అక్టోబరు 2008**

| | |
|---|---|
| **2** | గాంధీ జయంతి |
| **9** | విజయ దశమి |
| **14** | వాల్మీకి జయంతి |
| **28** | దీపావళి |

**నవంబరు 2008**

| | |
|---|---|
| **13** | గురునానక్ జయంతి |
| **14** | నెహ్రూ జయంతి |

విషయాన్ని అర్థంచేసికుంటే - భయం దరిదాపులకేరాదు.

వేద మంత్రం

# కలసిమెలసి జీవించు

**సం జానీధ్వం సం పృచ్ఛధ్వం సం వో మనాంసి జానతామ్ ।**
**దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే ॥**

**(అథర్వవేదం 6/64/1)**

**భావార్థం :** జ్ఞానాన్ని సంపాదించి పరస్పరం కలసిమెలసి ఉండటం ప్రతి మనిషికీ కర్తవ్యం. అందరూ ఉత్తమ సంస్కారవంతులు కావాలి. మన పూర్వీకులు తమ కర్తవ్యాలు ఎలా నిర్వహించారో అలాగే మనం కూడా ఎల్లప్పుడూ కర్తవ్య నిర్వహణ చేద్దాము.

**సందేశం :** నరపశువులవలె తినటం మీద, సంతానాన్ని కనటం మీద, వాసన, తృష్ణల మీద ఆధారపడకుండా అధ్యాత్మవాద జీవన విధానం ఉజ్జ్వల ఉత్కృష్ట ఆదర్శవాదాల నుండి ప్రేరణ పొందుతుంది. అధ్యాత్మవాదికి ఆత్మ, శరీరముల తేడా తెలుస్తుంది. ఆత్మను యజమానిగా, శరీరాన్ని పనిముట్టుగా అతడు భావిస్తాడు. ఈ తేడా తెలుసుకున్న వ్యక్తి శరీర సుఖానికీ, సౌకర్యాలకూ, ఇంద్రియాల వాంఛలకూ, మిథ్యాప్రశంసకూ, ఆడంబరాలకూ ప్రాముఖ్యం ఇవ్వడు. ఆత్మ కళ్యాణం, వికాశం వంటి ఉన్నత ప్రయోజనాలకు ఈ అమూల్య మానవ జీవితాన్ని అత్యుత్తమంగా ఎలా ఉపయోగించుకోవాలా అని ఆలోచిస్తాడు. ఈ లక్ష్యపూర్తిలో శారీరిక సౌకర్యాల, భౌతిక సంపదల లేమికి కించిత్తు కూడా విచారించడు. ఎందుకంటే ఈ శరీరం పనిముట్టు మాత్రమే అని అతనికి తెలుసు. శరీర సౌకర్యాలు తగ్గే కొద్దీ ఆత్మ ఉత్కర్షకు ద్వారం తెరుచుకుంటుంది. దీనిలో హాని తక్కువ, లాభం ఎక్కువ.

ఆత్మవాది 'నిరాడంబర జీవనం ఉన్నతమైన ఆలోచనలు' అనే ఆదర్శాన్ని పాటిస్తాడు. విలాసాలకు, ఆడంబరాలకు వినియోగించే సమయాన్నీ, డబ్బునూ పొదుపు చేసినప్పుడే లోకశ్రేయస్సుకై ఆదర్శవాద కార్యాలలో దాన్ని వినియోగించటం సాధ్యమవుతుంది. విలాసవంతమైన, ఆడంబరమైన జీవనం గడిపేవారు అధిక ఆవశ్యకతలకు, చింతలకు, చిక్కులకు, ఒత్తిడులకు గురి అవుతారు. ఇతరుల కంటే ఆధిక్యాన్ని ప్రదర్శించాలని, అధిక సుఖాలు భోగించాలనే వాంఛ తగ్గించుకునే కొలదీ తన యొక్క తన కుటుంబం యొక్క అనవసరపు ఖర్చు, ఆడంబరపు వ్యయాన్ని తగ్గించుకోగలుగుతాడు. దివ్యత్వం మితవ్యయం నుండే ప్రారంభం అవుతుంది.

ఈ జ్ఞానం కలిగిన మనుష్యుడు అందరితో కలసిమెలసి ఉండటంలోనే ఆనందం అనుభవిస్తాడు. అందరి సుఖ దుఃఖాలు తన సుఖ దుఃఖాలవంటివేనని అతడికి తెలుస్తుంది. ఇతరుల సుఖంలో సుఖమూ, ఇతరుల దుఃఖంలో దుఃఖమూ అతడికి అనుభవమవుతాయి. తన సుఖాన్ని ఇతరులకు పంచాలని, ఇతరుల దుఃఖభారాన్ని తాను మోయాలనే ఆకాంక్ష అతణ్ని వసుధైవ కుటుంబకం యొక్క ఔన్నత్యానికి చేరుస్తుంది. పరస్పర సహకారం, పరోపకారం, దయ, మమత, ఏకాత్మతా భావన దృఢం కావటంవల్ల పరస్పర సద్భావన, స్నేహం, సామంజస్యం వృద్ధియై సమాజంలో స్వర్గీయ వాతావరణం ఏర్పడుతుంది.

ఈనాటికీ సార్థకమైన ఆదర్శాన్ని మన ఋషులు మనకు అందించారు. తమ జ్ఞానాన్నీ, బుద్ధినీ సమాజ కళ్యాణానికే వారు వినియోగించారు. స్వయంగా కుటీరాలలో నిరాడంబరంగా జీవిస్తూ సమాజాన్ని సుఖసమృద్ధుల శిఖరం చేర్చేందుకు నిరంతర ప్రయత్నం చేశారు. ఎంత ఉన్నతమైన ఉత్కృష్టమైన ఆలోచనా పద్ధతి ఇది! జీవితమంతా నిస్వార్థ భావంతో తమ కర్తవ్య పాలనలో నిమగ్నం కావటం వారికి ఇష్టం.

అటువంటి ఉత్కృష్ట ఆదర్శాలపాలనలో మనం శీలవంతులం కాగలం.

★★★

**చీకటిలో ధైర్యంగా ఒక్క అడుగు వేస్తేచాలు - రెండవ అడుగు దానంతట అదే పడుతుంది.**

వర్తమాన భారతం

# ఈనాటి సమస్యలు-రేపటి సమాధానాలు

*(పరమపూజ్య గురుదేవులు రచించిన క్రాంతిధర్మీ పుస్తకంలో (1988-89) ఈనాటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యుగానుకూలమైన వివేచన.)*

*(గత సంచిక తరువాయి భాగం )*

## చదువుతోపాటు విద్య లేకుంటేనే సమస్యలు

పరమపూజ్య గురుదేవులు వ్రాశారు- విషయజ్ఞానాన్ని, అక్షరజ్ఞానాన్ని తెలియచేసేది చదువైతే, ఆత్మజ్ఞానాన్ని తెలియచేసేది విద్య. చదువుయొక్క గొప్పదనాన్ని ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. కాని విద్యను మాత్రం ఏకంగా జ్ఞాన చక్షువుతోనే పోలుస్తారు. ఎందుకంటే విద్యలేని వ్యక్తి గ్రుడ్డివానితో సమానం. విద్య అన్ని ధనములకన్న మించిన ధనం. విద్య మానవుని గుణ, కర్మ, స్వభావాలతోపాటు వ్యక్తిత్వాన్నే మార్చివేస్తుంది. వ్యక్తిత్వ వికాసమే కాదు ప్రతిభను పెంచి సంస్కరిస్తుంది. కేవలం చదువునే నమ్ముకుంటే భ్రష్టచింతనలతో దుష్ట ఆచరణలు ప్రారంభమౌతాయి. అందువల్ల మానవుడు మిక్కిలి ప్రమాదకారిగా మారుతాడు. ఆ పరిస్థితిలో అధిక సంఖ్యలో బ్రహ్మరాక్షసులు జన్మిస్తారు. ఈనాటి చదువుల్లో వ్యక్తిత్వాన్ని వికసింపచేసే, సంస్కారాన్నందించే, ప్రతిభను పెంపొందించే లక్ష్యమే లేదు. అనేక విషయాలను తెలిసికొన్నాననే అహంకారంతో అనేక దుర్గుణాలను ప్రోగుచేసికుంటాడు. ఆ పనిని చదువురానివాడు కూడ చేయగలడు. ఇటువంటి వారు ప్రతి ఒక్కరికీ కీడునే చేస్తుంటారు. మన దేశంలో ఆత్మజ్ఞానాన్నిచ్చే చదువులు లేకుండా పోయాయి.

## సంస్కారపూరితమైన చదువు

మనం ఇలాంటి విషయాలను తర్కించి చూచినట్లైతే దేశం మొత్తం మీద అతి పెద్ద సమస్య ఇదే. సమాధానం కూడ ఇదే. చదువు బాగా పెరిగిపోయింది. చిన్న వారినుండి పెద్ద పెద్దవారి వరకు తెలియని అంశాలులేవు. పట్టణాల్లో ఎక్కడ చూచినా చదువు విజయభేరీ మోగిస్తోంది. కాని ఈ చదువులవల్ల మనం శ్రేష్ఠులుగా, మహా మానవులుగా, సంస్కారవంతులుగా తయారు కాలేకపోతున్నాం. కేవలం నిర్వాహకులుగా, ఇంజనీయర్లుగా తయారవుతున్నాం. ఐ.టి డిగ్రీలు పొందుతున్నాం. కాని వాటివల్ల జీవన మూల్యాలను పొందలేకపోతున్నాం. స్వార్థప్రయోజనాలకు దూరంగా, దేశాభ్యుదయానికి పాటుపడలేకపోతున్నాం. అనేకానేక ఒత్తిడులతో సతమతమౌతున్నామే కాని శాశ్వతమైన ఆధ్యాత్మిక అనుభూతులను అందుకోలేక పోతున్నాం. ఆనందమయ జీవనాన్ని గడపలేక పోతున్నాం. యువత హింసాత్మకమైన ఉద్యమాలను చేపడుతోంది. విశ్వవిద్యాలయాలు రాజకీయకేంద్రాలైనాయి.

పరమపూజనీయ గురుదేవుల మాటల్లో- "నేడు దేశంలోని మహా మనీషులు, ఆలోచనాపరులు తక్షణమే చేయాల్సిన పని ఏమంటే చదువులో విద్యను ప్రవేశపెట్టాలి. భావిపౌరులను ప్రగతి శీలురుగా తయారు చేసే ప్రయత్నం చేయాలి. మానవత్వాన్ని ప్రతిబింబించే ఆలోచనలను ఏ రూపంలో ప్రవేశపెట్టాలో ఆలోచించాలి. చరిత్ర స్థాయిని పెంచుకుంటూ వ్యవహారంలో గంభీరతను పెంపొందించుకోవాలి. అన్నివిధాలుగా ఔచిత్యంతో మసలుకోవాలి. వారే ఔచిత్యాన్ని మరచిపోయినట్లైతే మానవాళికి దిక్కేలేకుండాపోతుంది. ఈనాటి సమస్యలకు పరిష్కారమే దొరకకుండాపోతుంది.."

పరమపూజనీయ గురుదేవుల వ్రాతల్లో- "మానవత్వం అనేది సభ్యతా-సంస్కారాలనుండే జన్మిస్తుంది. సభ్యత శరీరాన్ని, సంస్కారం మనస్సును ప్రభావితం చేస్తాయి, సమస్యలను పరిష్కరిస్తాయి. ఈ విభాగం నేడు ఉపేక్షకు గురిఔతోంది. చదవడం గాని, చేయడం గాని, ఆలోచించడం గాని స్వల్పమైన పరిధికే అంకితమైపోతున్నాయి. ఆత్మనుగురించిన ఆలోచనేలేదు. ఇది జరగాలంటే చదువులో విద్యను ప్రవేశపెట్టాలి."

## ఒకే ఒక మార్గం ఉంది

చదువులో విద్యను ప్రవేశపెట్టడానికి, రెండింటినీ పూర్తిగా సమన్వయ పరచడానికి గురుదేవులు ఒక మార్గాన్ని తెలిపారు. అదే ఈనాటి దేవసంస్కృతీ విశ్వవిద్యాలయం. అదే గురుదేవుల

**చేసిన తప్పుకు పరిహారం - దివ్య, సత్య, ప్రేమల ఉపహారం.**

స్వప్న వీధిలో నడయాడిన వినూత్న ఆశారేఖ. దేవమానవులను తయారు చేసే ఒక విశ్వవిద్యాలయం నడపాలని వారు కలలుకన్నారు. అది జీవన విద్యను నేర్పించే కేంద్రంకావాలని ఉవ్విళ్లూరారు. నేడు విద్యావిస్తరణలో భాగంగా దూర విద్యాకేంద్రాలు ప్రారంభింపబడ్డాయి. భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్షలు నిర్వహింప బడుతున్నాయి. అనేక విధాలుగా వారి సాహిత్యం జన సామాన్యానికి అందించబడుతోంది. రాబోయే రోజుల్లో ఈ విద్యా తంత్రాన్ని, యువతను జోడించి వికసింపచేయాలి. ఒక విధంగా దేశం మొత్తం విద్యా విధానాన్నే సమూలంగా మార్చివేయాలి. ఒక్క భారత దేశంలోనే కాదు. సేవాదృక్పథంతో విశ్వమంతా ప్రచారం జరగాలి. ఇదే ఈనాటి విద్యా విధానానికి సరియైన సమాధానం.

## ఆలోచనల్లో మార్పుకై ఉద్యమం

పైన తెలుపబడిన విషయాలు జనమానసాల గురించి పరిష్కార మార్గంలో కొనసాగాయి. సహజంగా పరమపూజనీయ గురుదేవులు స్ఫూర్తిదాయకమైన ఏ ఆలోచనలనిచ్చారో వాటిల్లోనే దాదాపు మానవ సమస్యలన్నింటికీ సమాధానాలు ఇమిడి ఉన్నాయి. భోగాలను, అనుభవిస్తూ సోమరితనంవైపు పయనించేవారికి గురుదేవులు తగినస్ఫూర్తిని కలిగించారు. ఎవరి భాగ్యానికి వారేకర్తలని నిరూపించారు. వేర్లు బలంగా లేకపోతే చెట్లు ఏ విధంగా పుష్పిస్తాయి? ఏ విధంగా ఫలములనిస్తాయి? మన కోరికలే (లక్ష్యమే) మనకు వేర్లు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే మొట్టమొదట ఆత్మ విశ్వాసం చాల అవసరం. తగిన పూజలు, కర్మకాండ మొదలైన రకరకాల కార్యక్రమాలు తరువాత వస్తాయి. ఆస్తికతకు అసలైన అర్థం ఆత్మవిశ్వాసం. దీనినే భగవంతునిపై నమ్మకం అంటుంటారు. ఇది మన దేశవాసుల్లో అత్యధికంగా కనిపించే విషయం. చూస్తుండగానే లక్షలాది మంది ఆలోచనల్లో మార్పు వచ్చింది. పరిస్థితులు మారిపోతున్నాయి. ఈ మార్పుకు కారణం ఆలోచనల్లో వచ్చిన మార్పే.

## దేవ మానవులొస్తున్నారు

గురుదేవుల మాటల్లో– ఈ లోకంలో రకరకాల సౌకర్యాలను, సంపదలను అభివృద్ధి చేసుకోవడం అవసరమే. కాని దానికొరకు మానవత్వాన్ని, సమర్థతను మాత్రమే ఉపయోగించుకోవాలి. భూమిని, భూమిపైనున్న సాధనాలను వశపరచుకోదలచిన వారు, దానికి తగిన యోచనలు చేసేవారు వికృత మనస్తత్వంతో ఉండరాదు. వికృతంగా ఆలోచించేవారు సరిగా చేయలేరు. సరికదా వినాశనానికి దారి తీస్తారు. అడ్డు నిలచిన సమస్యలను కూడ పరిష్కరించుకోలేరు. ఈనాటి పరిస్థితి ఆ విధంగానే ఉంది. ప్రజాస్వామ్యంలో ఎన్నుకోబడిన నాయకులుకూడ అదే స్థితిలో ఉన్నారు. అటువంటప్పుడు ప్రజలకు మంచి పరిపాలన ఎట్లా లభిస్తుంది? దీనికి సమాధానం ఏమిటి? ఆత్మ బలసంపన్నులైన దేవ మానవుల నిర్మాణం జరగాలి. సంయమనం, ధ్యానం వల్ల కలిగిన శక్తి సామర్థ్యాలతో, యోగుల మనస్తత్వంతో తయారైన యువత మాత్రమే దేశానికి అభ్యున్నతిని సాధించగలుగుతుంది.

గురుదేవుల లేఖిని ద్వారా వెలువడ్డ మృదువైన మాటలు– "వికృతమైన మనస్సు, నిష్ఠురమైన హృదయం, మలినమైన రక్తంతో జీర్ణశక్తిని కోల్పోయిన శరీరంలో అంగాలన్నీ విషపూరితమైపోతాయి. అటువంటి అవయవాలకు విలువైన వస్త్రాలు, ఆభరణాలు, సుగంధ ద్రవ్యాల లేపనం మొదలైనవన్నీ వ్యర్థమే. ఆరోగ్యంగా, ఆనందంగా గడిపేవ్యక్తి పేదరికంలో కూడ అందంగా కనిపిస్తాడు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోగలుగుతాడు. ఏదో విధంగా ప్రగతిని సాధిస్తాడు. దీనికంతటికీ కారణం వ్యక్తిగత ఆరోగ్యం, తెలివితేటలు, ముందుచూపు అని చెప్పవచ్చు." ఈ మాటల్లో ఈనాటి సమస్యా ఉంది. రేపటి సమాధానమూ ఉంది. ఆరోగ్యమే మహాభాగ్యం కదా!

## సగటు పౌరుని జీవితం

గురుదేవుల మాటల్లో– "ప్రతి పౌరుడు సగటు పౌరునిగా జీవించగలిగితే పైరు పచ్చలతో నిండిఉన్న పల్లెల్లో నివసించగలుగుతాడు. వాయు మండలంలో వాతావరణ కాలుష్యాన్ని తొలగించగలుగుతాడు. ప్రకృతి మాతను తృప్తిపరచ గలుగుతాడు. ప్రాచీనకాలంలో సంస్కారవంతులైన ప్రజలు ఆ విధంగానే గడిపేవారు. జీవించడానికి కావలసిన వాటినన్నింటినీ స్వయంగా సమకూర్చుకొనేవారు. వాతావరణ కాలుష్యం అన్నమాటే ఉండేది కాదు. గ్రామాలనుండి ప్రతిభావంతులు పరాయి స్థలాలకు పారిపోయేవారూ కాదు. గ్రామాలు వెనుక బడి ఉండేవి కావు. పట్టణాలు అశుభ్రతకు, అసమానతకూ కేంద్రాలయ్యేవి కావు. ఈనాడు కూడ ఆనాటి పద్ధతులను అవలంబించినట్లైతే ఇన్నిరకాల సమస్యలు తలఎత్తవు. ఇన్ని రకాల ఆర్తనాదాలు వినిపించవు.

**ప్రేమ, గౌరవాలు ఒకరికి ఇవ్వాలే గాని - మనం ఆశించకూడదు.**

## గ్రామాలను పరిరక్షిద్దాం

సమాధానం అదే- పట్టణాలకు భారాన్ని తగ్గించాలి. గ్రామాలను బలపరచాలి. గోహత్యను నిలుపుచేయాలి. పట్టణాలలో ఆకర్షించే విషయాలపై అవగాహన కల్పించాలి. పల్లెలో స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించాలి. గోసంబంధిత వ్యవసాయం మరల మొదలవ్వాలి. పరిశ్రమల కొరకు బలవంతంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ సెజ్ నీతిని, రీతిని వ్యతిరేకించాలి. గ్రామాలను నైసర్గికంగా వికసింప చేయాలి. అప్పుడే శాంతిపూర్ణ వాతావరణం, ప్రకృతి సమతుల్యత లభిస్తాయి. అలాంటి వాతావరణాన్నే ప్రజలు మనసా, వాచా కోరుకుంటారు.

## పరస్పర సహకారంతో ఉత్సాహభరిత పాలన

యుద్ధోన్మాదాన్ని నిలిపివేయాలనీ, విద్యుత్తు వల్ల కలిగే కష్ట-నష్టాలను తొలగించాలనీ గురుదేవులు చర్చించారు- మన విజ్ఞానాన్ని యుద్ధాలకోసం కాకుండా ప్రయోజనకర సాధనాలను తయారు చేయడానికి ఉపయోగించాలి. స్థానిక సాధనాలతో చిన్నపాటి విద్యుత్తుకేంద్రాన్ని ఏర్పాటుచేసికోవాలి. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు స్థాపించుకోవాలి. అణుశక్తిని కూడ ఉపయోగించుకోవాలి. కాని ఏమాత్రం హద్దులు దాటకుండ జాగ్రత్తపడాలి. మనకు నచ్చిన, పదిమంది మెచ్చుకోగల విషయాలనే ఎంపిక చేసుకోవాలి పాలకులు, పాలితుల పరస్పర సహకారంతో పరిపాలన కొనసాగాలి. ప్రతీ వ్యవహారం సేవా భావంమీదనే ఆధారపడి ఉండాలి. అప్పుడే ఆదర్శపాలన అనగలం.

మానవత్వం అనేది అప్పుడప్పుడు ఆశ్చర్యజనకమైన మార్పులు చెందుతూ ఉంటుంది. దానిననుసరించే దేవమానవుల నూతన వసంతం ఆరంభమవుతోంది. క్రొత్త క్రొత్త చివుర్లు, మొగ్గలు, పువ్వులు, పండ్లు, సంపదతో 8 దిక్కుల్లోను వ్యాపించిపోతోంది. మహా మానవులు, దేవమానవులు, మహా మనీషులు, సమాజ సుధారకులు, నూతన సృష్టికర్తలు (వైజ్ఞానికులు) ఉద్భవిస్తున్నారు. రాబోయే రోజుల్లో నూతన సృష్టికర్తల నూతన తరం తయారవుతుంది. ఆ తరంలో పురోగమించిన సాధు సంతులు, సంఘ సంస్కర్తలు, త్యాగమూర్తులు అందరు చిన్నవారుగా కనిపించకతప్పదు.

## నా కోసం కాదు

*నౌషేర్వా పర్షియాదేశపు చక్రవర్తి. ఆయన న్యాయపరిపాలనతో ప్రసిద్ధి పొందాడు. ఆయన ధానధర్మాలు ఎక్కువగా చేసేవాడు. ఓ రోజు ఆయన మంత్రితో షికారుకు వెళ్లాడు. ఓ తోటలో ఓ ముసలాడు ఖర్జూరం మొక్కలు నాటుతుండటం చూశాడు. చక్రవర్తి ఆ పండు ముసలి వద్దకు వెళ్లి 'నీవు తోటమాలివా? లేక యజమానివా?' అని అడిగాడు.*

*'నేను ఎవరికిందా పని చేయడంలేదు. ఈ తోట మా తాతముత్తాతలు నాటింది' - మాలి వినయంగా బదులిచ్చాడు.*

*పాదుషా - 'నీవు ఈ ఖర్జూరం మొక్కలు నాటుతున్నావు. ఇవి చెట్లయి, పళ్లు కాచే దాకా నీవు బతికుంటావా?'*

*ఖర్జూరం చెట్టు పెరిగి పెద్దదయి ఇరవైఏళ్లు అయ్యేదాకా పళ్లనివ్వదు. ఇది అందరికీ తెలిసిన సంగతే. ముసలి తోటమాలి చక్రవర్తితో ఇలా అన్నాడు- 'మాతాత ముత్తాతలు నాటిన చెట్లపళ్లు నేనింతవరకు చాలాతిన్నాను. అందువల్ల నా తర్వాతి తరాల వాళ్లు తినేందుకని నేను మొక్కలు నాటాలి. తాను పళ్లు తినడానికే చెట్లు నాటడం స్వార్థం.'*

*చక్రవర్తి తోటమాలి జవాబు విని చాలా సంతోషించాడు. అతనికి బహుమతిగా రెండు బంగారు నాణేలు ఇచ్చాడు.*

## రాబోయే నినాదం "మార్పు-మార్పు-మార్పు"

యుగ పరిష్కర్త అయిన యుగావతారుని సందేశం రెండే రెండు వాక్యాలు. (1) ఆత్మ పరిష్కారం (2) సత్ప్రవృత్తి సంవర్ధనం. దీనివల్ల ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఉదారతతో మనస్సులు ఆర్ద్రమవుతాయి. వ్యక్తులలో సంయమనం పెరిగిపోతుంది. కార్యక్రమాలలో ఆదర్శవాదం తొణికిసలాడుతుంది. ఈ మార్గంలోనే నూతన శకం ముందుకుసాగుతుంది. ఈనాడు మనను బాధిస్తున్న సమస్యలన్నీ తమతమ అస్తిత్వాలను సరిదిద్దుకుని సక్రమరీతిలో కనిపిస్తాయి. భూమిపైకి స్వర్గం దిగివస్తుంది. దానికొరకే మనమంతా ఎదురుతెన్నులు చూస్తుండాలి. కేవలం ఎదురు చూచినంత మాత్రాన పని కాదు. ఆ పనిలో మనమంతా భాగస్వాములం కావాలి.

"మనం మారుదాం - యుగం మారుతుంది."

★★★

**బిడ్డ కన్న శ్రేష్ఠమైన, విలువైన అవసరాలుంటే - బిడ్డను కనకున్నా పరవాలేదు.**

ముఖచిత్ర కథనం

# అష్టసిద్ధులు-నవనిధులు

## సిద్ధి ద్వారా లబ్ధి

ఆధ్యాత్మిక విద్యలో ప్రవేశమున్న వారికి తెలిసిన విషయం ఏమంటే సాధన వల్ల సిద్ధులు ప్రాప్తిస్తాయి. విభిన్న యోగాల ద్వారా అనేక శక్తులు లభిస్తాయి. సాధన యొక్క కఠోర నియమాలను పాటించి, ఇంద్రియ నిగ్రహం ప్రదర్శించి, ఐహిక సుఖాలను త్యజించి తర్వాత పొందిన అనుదానాలు అధిక మూల్యమైనవి. మహాత్ములు కనపరిచే వైరాగ్యం అమూల్యమైన దానిని పొందడానికి తక్కువ విలువగల వాటిని త్యాగం చెయ్యటమే.

ప్రస్తుత పరిస్థితులలో సాధారణ మానవుడు ప్రదర్శించలేని కేవలం కొందరు విశేష వ్యక్తులు మాత్రమే కనబరిచే ఆశ్చర్యజనకమైన, అసాధారణమైన పనులు చేయగల సామర్థ్యాన్నే "సిద్ధి" అంటారు.

చమత్కారాన్ని చూచి ఆశ్చర్యచకితులమవుతాం. కాని అందులో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. గాలిలో ఎగరడం, నీటి మీద నడవడం అనేవి కొన్ని ప్రాణులు సహజంగానే చేయగలుగుతాయి. అదే విధంగా అష్టసిద్ధులు, నవనిధులు అనేవి ఆశ్చర్య జనకమైనవి కావు. కాని సాధారణంగా ఆ శక్తులు అందరిలో కనిపించవుకనుక, మనకు ఆ భావన కలుగుతుంది.

మనిషి ఒక అనంత శక్తి భాండాగారం. తన లోపల ఉన్న మహాశక్తి యొక్క ఒక్కొక్క కణం ద్వారా ఒక్కొక్క జడజగత్తును నిర్మించగలడు. మనలో ఉన్న శక్తిలో సహస్రాంశం కూడా మనం ఉపయోగించుకోవడం లేదు.

మనిషి తనలో ఉన్న సమస్త శక్తులను ఉపయోగించుకుంటే తానే పరమాత్మవంటి శక్తిసంపన్నుడు కాగలగుతాడు. నిప్పుకణిక బూడిదతో కప్పబడి ఉంటే బయటకు తెలియదు. కాని బూడిద తొలగించిన వెంటనే ఆ నిప్పుకణిక సామర్థ్యం తెలిసివస్తుంది. మనిషిలోని దుర్భావనలు, హీనమైన కోరికలు, చెడుఆలోచనలు, భోగలాలస, అవినీతి మొదలైనవి తన నిజరూపాన్ని కప్పిఉన్న బూడిదగా భావించాలి. మనం వీటిని తొలగించుకుని సద్భావనలు పెంచుకుంటే మనలోని అంతఃశక్తులు ప్రకటితమవుతాయి.

బద్ధకంతో ఏపనీ చేయని మనిషి కష్టపడకుండా గొప్ప సంపదలు పొందాలని అనుకుంటాడు. అవి ఏరకంగా లభించినా పరవాలేదనుకుంటాడు. కాని అలాంటిసంపదలే చివరలో దుఃఖ కారకాలవుతాయి.

## భూలోక కల్పవృక్షం తపస్సు

మానవుడు ఎంతోకాలం నుండి అమరత్వం పొందాలని కోరుకుంటున్నాడు. కాని ఇప్పటి వరకు అది ప్రాప్తించిన వానిని చూడలేదు.

అమరత్వం యొక్క అర్థం గతిహీనత. గతి అంటే జీవనం. ఈ అమరత్వం అనే పదార్థాన్ని అత్యంత ఉగ్రమైన ఆధ్యాత్మిక సాధనల ద్వారా పొందవచ్చునని ఋషులు మన ముందుంచారు. ఈ ఋషికల్పసాధనల ద్వారా మనిషి అమరత్వాన్ని పొందిన అనుభూతి పొందగలడు. దీనికి మరోపేరు బ్రహ్మ జ్ఞానం. మనిషి శరీరంకాదు, ఆత్మ అని బ్రహ్మజ్ఞానం తెలుపుతుంది.

భూలోకంలోని కల్పవృక్షం– "తపస్సు". తపస్సు అంటే కష్టం సహించడం. ప్రయత్నంచేయడం. తపస్వికి మాత్రమే ఐశ్వర్యాన్ని పొందే సామర్థ్యం ఉంటుంది. యోగాభ్యాసం చేస్తుంటే అప్రయత్నంగా దానిద్వారా వచ్చిన సత్ఫలితాలే ఐశ్వర్యాలు. ఉత్సాహం, స్ఫూర్తి, కష్టపడటం, ధైర్యం, సాహసం, కష్టాలకు చలించిపోవడం అనేవి తపస్సుకు ముఖ్య లక్షణాలు. అనుకున్నది ఏది సిద్ధించాలన్నా తపస్సే ఏకైకమార్గం. పట్టుదలగా, తపనతో ప్రయత్నించడమే ఈనాటి తపస్సు.

## అష్టసిద్ధులు

అజేయమైన తపశ్శక్తితో అష్టసిద్ధులను సాధించినవారున్నారు. అష్టసిద్ధులను సాధించిన వారిని సిద్ధ పురుషులు అంటారు.

**1. అణిమ :** (సూక్ష్మీకరణము) సూక్ష్మముగా చేయునది. అవసరమైనప్పుడు సూక్ష్మరూపధారణ ఈ సిద్ధివల్లనే సాధ్యమౌతుంది.

**2. మహిమ :** (మహిమము) అణు సమూహాన్ని ఒక్కటిగా చూపటం. భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపడం ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

**3. గరిమ :** (గురుత్వము) బరువుగా తయారగుట, భారాన్ని పెంచుకోవడం ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

**4. లఘిమ :** (అల్పత్వము) బరువును పూర్తిగా కోల్పోవుట. గాలిలో తేలిపోయే శక్తి ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

**5. ప్రాప్తి :** (ఇష్టసిద్ధి) కోరుకున్న పనిని కోరుకున్న విధంగా, కోరుకున్న చోట చేయడం ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

నీవు ఖచ్చితంగా మెరుగుపరచుకోగల ప్రదేశం నీ మనస్సొక్కటే.

**6. ప్రాకామ్యము :** (మనోరథ దృష్టి) అనుకున్నది నిర్విఘ్నంగా చేయగలుగుట, ఒకచోట ఉండి మరొకచోట పనిచేయడం ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

**7. ఈశత్వము :** (సర్వాధికారిత) అన్నింటిపైన అధికారమును కలిగియుండుట అనేది ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

**8. వశిత్వము :** (స్వాధీనత) ఇంద్రియాలనే కాకుండ ఎవరినైనా తనవశములోనికి తెచ్చుకోవడం ఈ సిద్ధి ద్వారానే సాధ్యమౌతుంది.

పైన తెలిపిన వాటినికాక అష్టసిద్ధులను పరమపూజ్య గురుదేవులు తన పరిభాషలో తెలియచేశారు. అన్నింటికీ ఆత్మబలాన్నే ప్రధానంగా చేసిచెప్పారు.

**1. ఆత్మజ్ఞానము :** ఆత్మజ్ఞానము పొందిన వ్యక్తి శరీరాన్ని ఆత్మను వేర్వేరుగా చూడగలుగుతాడు. ఐహిక సుఖాలను అశాశ్వతమైనవిగా గ్రహిస్తాడు. జీవితంలో సౌకర్యాలు తక్కువగా లభించినా లోలోన కుమిలి పోకుండా తృప్తిగా జీవిస్తాడు. వియోగ విద్రోహాలకు, కష్ట నష్టాలకు బెంబేలుపడడు. ఎటువంటి సమస్యలు ఎదురైనా అతి సహజంగా పరిష్కరించుకోగలుగుతాడు. సాధారణ మానవుడు దుఃఖ నివారణకే జీవితమంతా ధారపోస్తున్నాడు. అయినా సంతోషాన్ని పొందలేకపోతున్నాడు. కాని ఆత్మజ్ఞాని సునాయాసంగా, అనాయాసంగా ఆనందప్రాప్తిని పొందుతాడు.

**2. ఆత్మభావము :** ఆత్మభావం గల వ్యక్తి సద్భావాలకు నిలయమౌతాడు. నీతి నిజాయితీ, ప్రేమ-స్నేహం, సేవ-సహకారం ఆతనిలో నిండి ఉంటాయి. అందువల్ల అతని వ్యవహారం మృదువుగా, మధురంగా, ఉదారంగా, వినమ్రంగా ఉంటుంది. ఫలితంగా మంచి మిత్రులను, మంచికోరేవారిని, ప్రేమించే వారిని అధిక సంఖ్యలో పెంచుకోగలుగుతాడు. సత్సంగం వల్ల ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తాడు.

**3. ఆత్మనిరీక్షణ :** ఆత్మనిరీక్షణ చేసేవ్యక్తి మంచి-చెడులను విశ్లేషించి చూడగలుగుతాడు. మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉంటాడు. అందువల్ల పాపాలు ఆతనిదగ్గరకు చేరలేవు. చిత్తశుద్ధిగలిగి ప్రశాంతంగా జీవించగలుగుతాడు. ఎటువంటి ఆవేదనలకు లోనుకాడు.

**4. సంయమము :** మానసికంగా స్థిరత్వంగల వ్యక్తి శారీరికంగా కూడ ఆరోగ్యంగాఉంటాడు. మానసికనిగ్రహం మానవుని తొందరపాటును తగ్గిస్తుంది. శారీరిక, మానసిక ఆరోగ్యాలు తోడుగా ఉన్నవ్యక్తి దీర్ఘాయువును కలిగిఉంటాడు.

**5. సాత్విక ప్రవృత్తులు :** సాత్వికప్రవృత్తులుగలవ్యక్తి ధైర్యం, సాహసం, స్థిరత్వం, దృఢత్వం, కష్టసహిష్ణుత, శ్రమశీలత కలిగి ఉంటాడు. దీనివల్ల అంతులేని యోగ్యతలు అభివృద్ధి చెందుతాయి. అన్ని విధాల యోగ్యుడైనవ్యక్తి ఆనందంగా జీవించగలుగుతాడు.

**6. అధికారిత :** సహజనాయకత్వపు లక్షణాలుగల వ్యక్తి మాటను అందరు గౌరవిస్తారు. అంటే అధికారిత, గౌరవం ఉన్నత వ్యక్తిత్వం, అపూర్వ విశ్వాసం మొదలైనవన్నీ వాటంతట అవే వచ్చిచేరుతాయి. అవసరమైతే ఆ వ్యక్తికోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధపడతారు. ఆతడు మకుటంలేని మహారాజుగా చలామణి అవుతాడు.

**7. బుద్ధిపరిమార్జన :** బుద్ధిని శుద్ధిచేసుకున్న వ్యక్తి హృదయం స్వచ్ఛమైన అద్దంలాంటిది. దానిలో ఇతరుల మానసికస్థితి ప్రతిబింబిస్తుంది. ఎదుటివారి మనోభావాలను గుర్తెరిగిన వ్యక్తి వాటికి అనుగుణంగా ప్రవర్తించగలుగుతాడు. ఆ విధంగా నడుచుకున్ననాడు చేసిన ప్రతీపని సాఫల్యం చెందుతుంది. పరులనుండి సమస్యలు దాడిచెయ్యవు. కనుక ఆనందంగా జీవించగలుగుతాడు.

**8. ఆత్మపవిత్రత :** ఆత్మను పవిత్రంగా ఉంచుకున్న వ్యక్తి జీవన్ముక్తుడు అవుతాడు. ఈశ్వరప్రాప్తిలభిస్తుంది. సచ్చిదానంద రూపుడౌతాడు. అట్టి వ్యక్తికి పునర్జన్మ తన గుప్పిట్లోనే ఉంటుంది.

సాధకుడు ఈ అష్టసిద్ధులను సాధించగలిగినట్లైతే అనంతమైన సుఖానుభూతిని పొందగలుగుతాడు. ఈ సుఖానుభూతిని పొందే ప్రయత్నంలోభాగంగానే అనేకమంది అనేక మార్గాల్లో పయనిస్తున్నారు. కాని అధికశాతం నిరాశకు గురిఅవుతున్నారు. ఆధ్యాత్మిక మార్గంలోనే అష్టసిద్ధులు అనాయాసంగా లభిస్తాయి. అవి లభించిన వారి దుఃఖాలు పటాపంచలైపోతాయి. ఈ సిద్ధులు కేవలం తనకేకాకుండ ఇతరులపై కూడ ప్రభావం చూపగలుగుతాయి. సాధకుడు సాధించిన సిద్ధులు వాటి ద్వారా పొందిన సఫలతలు ఆతనితోపాటు ప్రక్కవారికి కూడ లాభాన్ని చేకూరుస్తాయి. ఆ లాభమే నవనిధుల రూపంలోఉంటుంది.

**ఆలోచనలను మార్చుకుంటే ప్రపంచాన్నే మార్చవచ్చు.**

## నవనిధులు

కుబేరుని నవనిధులు వరుసగా–

**1. పద్మము :** తామరపువ్వు.

**2. మహాపద్మము :** పౌరాణిక సంఖ్యల్లో ఒకనొక పెద్దసంఖ్య, ప్రపంచభారాన్ని మోస్తున్న పెద్దసర్పము.

**3. శంఖము :** ఏనుగు దంతమునందలి మధ్యభాగం, సర్పం, ఎర్రతామర.

**4. మకరము :** మొసలి.

**5. కచ్ఛపము :** తాబేలు.

**6. ముకుందము :** పాదరసం, మణివిశేషం.

**7. కుందము :** మొల్లపూవు.

**8. నీలము :** నీలమణి, ఒకకొండ, నలుపు.

**9. ఖర్వము లేక వరము :** కుంకుమపువ్వు, కోరిక, శతమూలి.

ఈ నవనిధులన్నీ సమయానుసారంగా విలువైన ప్రయోజనాలను కలిగిస్తాయి. అయితే పరమపూజ్య గురుదేవులు తన పరిభాషలో తెలిపిన నవనిధులు–

**1. వాక్శుద్ధి :** అష్టసిద్ధులలో మొదటిదైన ఆత్మబలం సిద్ధించిన వ్యక్తికి వాక్శుద్ధి ప్రాప్తిస్తుంది. ఆత్మబలంతో ఇతరులపై చేసిన భావన ఆశీర్వాదరూపంలోను, శాపం రూపంలోను పనిచేస్తుంది. ప్రాచీన ఋషులగురించి మనం విన్న శాపాలుగాని, వరాలుగాని అసత్యంకావు. ఈ నిధి ఆత్మబలసిద్ధినుండి లభిస్తుంది.

**2. వైద్యవిధానం :** (హస్తవాసి) ఆత్మభావం సిద్ధించిన వ్యక్తి అసాధ్యమైన వ్యాధులను కూడ సులువుగా నయంచేయగలుగుతాడు. ఆతని చికిత్సలో ఆధ్యాత్మికఅమృతం కలపబడుతుంది. ఆతని హస్తవాసి ముందు పెద్ద పెద్ద డాక్టర్లు పనికిరారు. ఈ నిధి ఆత్మభావసిద్ధి నుండి లభిస్తుంది.

**3. ఆకర్షణ శక్తి :** ఆత్మనిరీక్షణ సిద్ధించిన వ్యక్తి తన దగ్గరకు వచ్చినవారిని, తనను ఆశ్రయించినవారిని తనంతవానిగా చేయగల ఆకర్షణ నిధిని పొందుతాడు.

**4. సమ్మోహన శక్తి :** సంయమమును సాధించినవ్యక్తి మానసిక దోషాలతో, మానసిక బలహీనతలతో బాధపడుతున్నవారిని మెస్మరిజం, హిప్నాటిజం, పరకాయప్రవేశం లాంటి పద్ధతులతో సరిచేయగలడు. సమ్మోహనశక్తి ఒక అమూల్యనిధి.

**5. ఆత్మవిమర్శ :** సాత్విక ప్రవృత్తులను సాధించిన వ్యక్తి భవిష్యత్తులో ఎదురయ్యే కష్టాలకు మూలకారణాన్ని గతంలో చేసిన కర్మల ఫలంగా భావించగలుగుతాడు. ఫలితంగా ఆత్మవిమర్శ చేసికుంటూ ధైర్యంగా ఎదురొడ్డి నిలుస్తాడు. ఇలాంటి పరిస్థితిలో ఆత్మవిమర్శ విలువైన నిధివంటిదే.

**6. దివ్యదృష్టి :** గతంలో జరిగిపోయినసంఘటనలు, చేసిన ఆలోచనలు నశించిపోవు. అవి ఈథర్ తత్వంలో స్థిరపడి ఉంటాయి. తపోశక్తిని సాధించిన వ్యక్తి తన దివ్యదృష్టితో సర్వం చూడగలడు. ముఖంచూస్తూనే అవతలివ్యక్తి చరిత్రనంతా చదివి చెప్పగలడు. ఇది చాల అరుదుగా లభించే నిధి.

**7. మార్పిడి :** తన్ను తాను సంస్కరించుకోగలిగిన వ్యక్తి అవసరానికి అనుగుణంగా తన ఆయువును, తపస్సును, యోగ్యతను ఇతరులకు దానంచేయగలడు. అంతేకాక ఇతరులబాధలను తనపైకి తెచ్చుకుని అనుభవిస్తూ వారికి ఉపశమనం కలిగించగలడు. ఇది ఆపదలో ఉపకరించే నిధి.

**8. కర్మణ్యత :** ఆత్మశుద్ధి గల వ్యక్తి చేసే చేతలు అనేకమందిని ఆకర్షిస్తాయి. ఆ వ్యక్తి చేసే ఆలోచనలు అదృశ్యరూపంలో పయనించి అనేకమందిని చుట్టుముడుతాయి. వారందరిని అతిత్వరలో కార్యశీలురుగా తీర్చిదిద్దుతాయి. ఇంతకు మించిన నిధి మరొకటి లేదని చెప్పవచ్చు.

**9. ఉత్ప్రేరణ :** నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న వారికి స్ఫూర్తినికల్గించి ముందుకు నడిపించగల నిధి ఉత్ప్రేరణ. ఏడ్చేవారిని నవ్వించడం, పాపులకు పశ్చాత్తాపం కల్గించడం, దరిద్రులను ధనవంతులుగా చేయడం, అజ్ఞానులకు జ్ఞానంకల్గించడం, మానవుని దేవతగా మలచడం మొదలైన కార్యక్రమాలల్లో ఉత్ప్రేరణ పాత్ర అమోఘం. అద్వితీయం.

పైవిధంగా గురుదేవులు “అష్టసిద్ధులు–నవనిధులు” సాధించగల మార్గాన్ని, అవసరాన్ని, విధానాన్ని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు వివరించారు. పురాణాల్లో చెప్పబడిన అష్టసిద్ధులకు బదులుగా సరళమైన వాటిని, అవసరమైన వాటిని, అందుకోగల వాటిని చక్కగా చెప్పారు. వాటిద్వార సంభవించే నూతన నవనిధుల మూటలను విప్పి మనముందర కుప్పపోశారు. అటువంటి అమూల్య సంపదను మనకందించే దాతగా గాయత్రీమాత చిరునామాను తెలియచేశారు. కోరినవాటన్నింటినీ సమకూర్చే సమర్థత గాయత్రీమాతకు ఉన్నదని నొక్కివక్కాణించారు.

గాయత్రీమాతను ఆరాధిద్దాం–అష్టసిద్ధులు, నవనిధులు సాధిద్దాం.

★★★

పరస్పర సహకారాన్ని, సమాన స్వేచ్ఛను పెంచేదే వైవాహికబంధం.

దీపావళి వ్యాసం

# ఆర్థిక సమస్యలు-ఒక అవగాహన-దీపావళి

ఉత్సవాలు-సంస్కారాలు ఒకే సంస్కృతికి ప్రాణాలు. సంస్కారాల ద్వారా మానవుని అంతరంగంపై శ్రేష్ఠ జీవనానికి ముద్ర వేయబడుతుంది. ఉత్సవాల ద్వారా ఒక దేశం యొక్క జాతి యొక్క సామూహిక సమస్యలను పరిష్కరించే మార్గం లభిస్తుంది. ఉత్సవాలలో ప్రజలంతా సంగఠిత శక్తితో ఆలోచిస్తుంటారు. ఫలానా సమస్యకు పరిష్కారమార్గమేంటి? అని ఆలోచించి నిర్ణయిస్తారు. పరిష్కరిస్తారు. అలాంటి సమయాల్లో ప్రతి మానవుని హృదయం తాను సమాజం అనే శరీరంలో ఒక అంగంగా అనుభూతి చెందుతుంది. దానివల్ల స్వార్థ భావం నశిస్తుంది. సామాజిక భావన పెంపొందుతుంది.

## పండుగలు - ప్రయోజనాలు

మనపెద్దలు నిర్ణయించిన పండుగలు, ఉత్సవాలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రయోజనాన్ని కలిగిస్తూఉంటాయి. విజయదశమి ఆరోగ్యంతో పాటు ఐకమత్యాన్ని వృద్ధిచేస్తుంది. వసంత పంచమి విద్యను ప్రసాదిస్తుంది. మహా శివరాత్రి త్యాగాన్ని నూరిపోస్తుంది. హోలీ పరిశుభ్రతను నేర్పిస్తుంది. శ్రీరామనవమి న్యాయరక్షణను కలిగిస్తుంది. గాయత్రీ జయంతి తపస్సుపై ఆసక్తిని రేకిస్తుంది. గురుపౌర్ణమి గురుజనులపై శ్రద్ధాగౌరవాలను పెంపొందిస్తుంది. పచ్చల అమావాస్య అడవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. శ్రావణ పౌర్ణమి యజ్ఞోపవీతధారణ ద్వార వేదాలను గౌరవిస్తుంది. రాఖీబంధనం ద్వార స్నేహ సుహృద్భావాలను వృద్ధి చేస్తుంది. జన్మాష్టమి గోమాత విలువను తెలియచేస్తూ గోరక్షణను ప్రోత్సహిస్తుంది. అదే విధంగా దీపావళి జాతీయ ఆర్థిక వ్యవస్థకు చుక్కాని వంటిది.

## ఆర్థికపరంగా

ఆర్థిక వ్యవస్థ అనేది వ్యక్తిగతంగాను, సామూహికంగాను ఏ రకంగా చూచినా విశిష్ట స్థానాన్ని పొంది ఉంటుంది. దానిని పరిష్కరించుకోవడం చేతకాకపోతే జీవితంలో సుఖ సమృద్ధులు లభించవు. మనం చమటోడ్చి సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేసికోవాలికదా! గత సంవత్సరంలో ఆర్థికంగా పడిన ఇబ్బందులేమిటి? దానికి కారణాలేమిటి? అలా జరగకుండా ఉండాలంటే ఈ సంవత్సరం ఏం చేయాలి? కష్ట సమయాల్లో నిలదొక్కు కోవాలంటే ఏయే ఖర్చులు తగ్గించుకోవాలి? మొదలైన విషయాలపై సామూహికంగా చర్చించుకోవడానికి కూడ దీపావళిని ఉపయోగించుకుంటారు. అందువల్ల ఆరోజు ఇంటింటా లక్ష్మీపూజ నిర్వహిస్తారు. వ్యాపార వేత్తలు గడచిన సంవత్సరానికి సంబంధించిన లెక్కలు సరిచూచుకుంటారు. ఈ సంవత్సరానికి తగిన విధంగా బడ్జెట్ తయారు చేసికుంటారు. ప్రతీ వ్యక్తి కూడ తన ఆదాయ, వ్యయాలను సరిచూచుకొనకపోతే తరువాత చాల ఇబ్బందులు పడాల్సివస్తుంది. సంవత్సరంలో ఒక్కరోజు ఈ విశ్లేషణ జరిగి తీరాలి. దీనిని గురించి గోస్వామి తులసీదాసు :

"తులసీ, సో సమర్థ, సుమతి, సుకృతి, సాధు సుజాన్।
జోవిచారి వ్యవహరత జుగ ఖరచ లాభ అనుమాన్॥"

అన్నారు. గృహస్థ జీవనంలో పనుల ఒత్తిడి వల్ల రోజూ చర్చించుకోవడం కుదరదు. దానికి ప్రత్యేకించిన సమయంలోనైతే ప్రశాంతంగా ఆలోచించుకుని చర్చించుకోవచ్చు. ఆర్థిక పరమైన చర్చలకు దీపావళి అనువైనది. వచ్చిన ఆదాయాన్ని పూర్తిగా ఖర్చు చెయ్యడం కూడ బుద్ధిమంతుల లక్షణం కాదు. రోజులు అన్నీ ఒకే రకంగా నడవవు. ఎప్పుడు ఏ ఆపద ముంచుకు వస్తుందో తెలియదు. ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు. అందువల్ల అవసరానికని కొంతలో కొంత ధనాన్ని దాచుకోవడం అవసరం. డబ్బును దాచుకోవడానికి ఈ రోజుల్లో అనేక మార్గాలు మన ముందున్నాయి. బేంకుల్లో దాచుకోవచ్చు. పోష్టాఫీసులో దాచుకోవచ్చు. భార్యాబిడ్డల పేర్లమీద వేర్వేరుగా కొంత వేసికోవచ్చు. జీవిత భీమాను కట్టుకోవచ్చు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ కొనుక్కోవచ్చు. ఫిక్సెడ్ డిపాజిట్లు చేసికోవచ్చు. పై విధంగా ఎవరికి అనుకూల పరిస్థితిని వారు ఆలోచించుకుని ఆచరించవచ్చు.

## ఆధ్యాత్మికంగా

సహజంగా ఒక్కొక్క పండుగకు ఒక్కొక్క దేవతను ఆరాధిస్తూ ఉంటారు. అది కూడ వారి అవతారాలను అనుసరించి ధర్మపత్నీ సహితంగా నిలిపి పూజిస్తారు. సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు అంటూ సందర్భానుసారంగా ఆరాధిస్తారు. కాని దీపావళినాడు ఆవిధంగా కాదు. లక్ష్మీదేవితోపాటు విష్ణుమూర్తిని పూజించరు. లక్ష్మీదేవికి ఎలాంటి సంబంధంలేని విఘ్నేశ్వరుని పూజిస్తారు.

ఎన్నేళ్లు బ్రతికావన్నది కాదు లెక్క - ఎట్లా బ్రతికామన్నదే లెక్క.

దీనిలో గొప్ప పరమార్థం ఇమిడి ఉంది. ధనాన్ని సద్వినియోగ పరచుకుంటే పరమ ప్రయోజనాన్ని పొందవచ్చు. అజ్ఞానంతో దుర్వినియోగపరచుకుంటే తనకే కాక సమాజానికి కూడ అనిష్టం సంభవిస్తుంది. సదాలోచనలకు ప్రతీక విఘ్నేశ్వరుడు. విఘ్నాలను తొలగిస్తాడు. అందువల్ల లక్ష్మీదేవితో పాటు విఘ్నేశ్వరుని కూడ తప్పనిసరిగా పూజించడం జరుగుతుంది. మంచి ఆలోచనలతో ఎట్టి ఆటంకాలు లేకుండా సంవత్సరమంతా సత్కార్యాలు కొనసాగాలని దాని అర్థం.

## సామాజికపరంగా

సామాజిక దృష్టిలో కూడ దీపావళి మహిమాన్వితమైన పండుగ. దీపావళి వస్తుందనగానే ముందు నుండే పారిశుధ్యకార్యక్రమాలు మొదలవుతాయి. ఇళ్లు వాకిళ్లు శుభ్రం చేసికోవడం మొదలుపెడతారు. గోడలకు సున్నాలు వేయిస్తారు. తలుపులకు, దర్వాజాలకు రంగులు వేయిస్తారు. శిథిలమైన ఇంటికి రిపేర్లు చేయిస్తారు. సిమెంటు, సున్నంతో చేయించలేని వారు మట్టితోను, పేడతోను మరమ్మత్తులు చేయించుకుంటారు. పైన తెలిపిన సున్నం, సిమెంటు, మట్టి, పేడ, రంగులు మొదలైనవన్నీ క్రిమిసంహారకాలే. గడచిన నాలుగు మాసాలలో కురిసిన వర్షాలకు భూమి, వాతావరణం అంతా క్రిమి కీటక మయం అయిపోతాయి. దీపావళి నాటికి వర్షాలు వెనకపడతాయి. అందువల్ల పారిశుధ్య కార్యక్రమాలు చాల అవసరం. శుభ్రతలో సుందరత కూడ చోటు చేసికుంటుంది. అంతే కాక క్రిమి సంహారం వల్ల ప్రజల ఆరోగ్యం బాగుపడుతుంది. "ఆరోగ్యమే మహాభాగ్యం" కదా! ఆరోగ్యం ఆనందాన్ని ప్రసాదిస్తుంది. ఆనందం ఆయువును పెంచుతుంది. కృష్ణ భగవానుడు నరకాసురుని వధించినట్లు చెపుతారు. అంటే నరకప్రాయమైన అనారోగ్యం తొలగించబడుతుందని అర్థం.

దీపావళి సమాజానికి మరొక సందేశాన్ని కూడ అందిస్తుంది. శాస్త్రాల్లో చెప్పినట్లు పగలు, రాత్రి జాగరణ చేసి పూజించిన వారిని లక్ష్మీదేవి అంటిపెట్టుకుని ఉంటుంది. సోమరితనంతో పూజను నిర్లక్ష్యం చేసినవారిని లక్ష్మి కూడ నిర్లక్ష్యం చేస్తుంది. అంటే ప్రతి వ్యక్తీ కూడ తన శక్తి సామర్థ్యాల ఆధారంగానే ధనవంతుడవ్వాలి. అటువంటి న్యాయార్జితం ద్వారానే సమాజ కళ్యాణ కార్యక్రమాలు నిర్వహింపబడాలి. జాగరణ అనగానే కొందరు జూదాన్ని, కొందరు సినిమాలను ఎంపిక చేసుకుంటారు. అది సరియైన పద్ధతి కాదు. జూదం ద్వారా ధనాన్ని గుంజాలని చూస్తుంటారు. ధనార్జనకు జూదం ఎప్పుడూ సరి అయిన మార్గం కాదు. లాభాన్ని ఆశించి మొదలుపెడితే నష్టం కలిగే ప్రమాదమే ఎక్కువ. ఒకవేళ లాభం కలిగినా అత్యాశతో ఆడి ఆడి అధఃపాతాళానికి చేరుకుంటారు. శుభసమయంలో అవినీతి పనులజోలికి పోరాదు. ఒక్కసారి పాండవులను, నల మహారాజును గుర్తుకు తెచ్చుకోవలసి ఉంటుంది.

## చారిత్రక దృష్టిలో

చరిత్రపరంగా ఆలోచించినా దీపావళి తక్కువైనది ఏమీ కాదు. దీపావళిని గురించిన కథలను మనకు చరిత్ర బోధిస్తూనే ఉంది. బలి చక్రవర్తి దేవతలందరితోపాటు లక్ష్మీదేవిని కూడ బంధించినట్లు, విష్ణుమూర్తి వామనావతారుడై బలిని అణగద్రొక్కినట్లు చెపుతారు. కృష్ణపరమాత్మ నరకాసురుని వధించి లోక కళ్యాణం కలిగించాడని చెపుతారు. రాముడు రావణ సంహారం చేసి సీతతో కలసి పట్టాభిషిక్తుడైనట్లు చెపుతారు. ఈ విజయాలను దృష్టిలో పెట్టుకుని ఆనాడు దీపోత్సవం జరుపుకుంటామని చెపుతుంటారు. భారతదేశానికి వెలుగును ప్రసాదించిన ముగ్గురు మహానుభావులు– (1) మహావీరుడు (2) స్వామి దయానంద (3) స్వామి రామతీర్థులు. దీపావళినాడు శరీరత్యాగం చేశారు.

## వైజ్ఞానికంగా

దీపోత్సవం వైజ్ఞానిక పరంగా కూడ మహత్వపూర్ణమైనది. ఆరోజు వెలిగించబడే చమురు దీపాలు, కాల్చబడే మతాబులు అన్నీకూడ క్రిమి కీటక సంహారాలే. వర్షాకాలంలో వృద్ధిచెందిన క్రిమి కీటకాలు ప్రజలను అనేక రకాలుగా బాధిస్తూ ఉంటాయి. వాటివలన రోగాలు వృద్ధి చెందుతాయి, అంటురోగాలు విజృంభిస్తాయి. ఆ దీపాల నుండి వెలువడే పొగ, మందుగుండు సామాను కాల్చిన పొగ వాతావరణంలోని కాలుష్యాన్ని తొలగిస్తాయి, వాయువును శుద్ధిచేస్తాయి. రాబోయే శీతాకాలంలో ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవించే అవకాశం లభిస్తుంది.

ఏ విధంగా ఆలోచించినా మనకు దీపావళి గొప్పగా జరుపుకోవలసిన పండుగ, ఇదే విధంగా ఇంకా ఇంకా ఆలోచించి ఈ పండుగను ఆదర్శపూర్వకంగా, ఆనందంగా జరుపుకోవాలి.

★★★

*ఈ పత్రికను మీరు చదివిన తర్వాత*
*ఈ నెలలో అయిదుగురిచేత చదివించండి.*

**సాధించడంలోనే దాస్యవిముక్తి దాగి ఉంటుంది.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-7

# దివ్యజననం-ఋషుల ఆగమనం

గత కొద్దిరోజులనుండి అంజనీదేవి హృదయం ఆనంద డోలికల్లో తేలిపోతోంది. శరీరం కూడ విచిత్రకాంతులీనుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాను చేసిన కఠోర తపస్సు, తన ఆధ్యాత్మిక భావనలు, ఋషి మునిజనుల ఆశీస్సులు ఫలించే రోజు దగ్గర పడుతున్నట్లుగా అనుభూతి చెందుతోంది. ఆమె అంతరంగంలాగే బయట ప్రకృతి కూడ పులకిస్తోంది. ఎన్నో శుభసూచనలు కనిపిస్తున్నాయి. అడవుల్లో తపస్సు చేసికొనేవారు ఆ శుభ సూచనలకు పులకించి పోతున్నారు. అంజనీదేవి పుత్రునికి స్వాగతం పలకడానికి ప్రకృతి అందంగా అలంకరించుకుంటోంది. వనమంతా మూలికా సంపదతో నిండిపోయింది. ఉద్యానవనాలు, సుందర పుష్పాలతో సుగంధాన్ని వెదజల్లుతున్నాయి. పర్వత శ్రేణులు సహజ శోభతో కనువిందు చేస్తున్నాయి. భూమిలోని విత్తనాలు కూడ వేగంగా మొలకెత్తి మోరలు సాచి చూడసాగాయి. నదీనదాలు, సరస్సులు నిర్మలత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. చెట్లు, లతలు, తీగలు చిగురులు తొడిగి ముసిముసిగా నవ్వుతున్నాయి. అటువంటి ఆహ్లాదకర వాతావరణంలో ఋషుల మధ్యన చర్చ కొనసాగుతోంది. "ప్రకృతి ఎవరికొరకు ఇంతగా ఎదురుతెన్నులు చూస్తోంది?" అన్నదే ప్రధాన విషయం.

మునులంతా కలసి మాతంగ మహర్షి ఆశ్రమాన్ని చేరుకున్నారు. మహర్షి ధ్యానావస్థలో ఉన్నాడు. ముఖంపై ఒకానొక అలౌకిక తేజస్సు తాండవమాడుతోంది. ఆ తేజస్సుతో పరిసరాలన్నీ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆశ్రమంలోనుండి ఒక శిష్యుడు వచ్చి చూచాడు. తన గురువు ముఖంలో ఇటువంటి తేజస్సును గతంలో ఎన్నడూ చూచి ఎరుగడు. అనుకోకుండా అడుగు వెనుకకుపడింది. గురువుగారి ధ్యానం భగ్నం కాకూడదని తిరుగు ముఖం పట్టాడు. వెనుక నుండి గురువుగారు అస్పష్టంగా ఉచ్చరిస్తున్న మాటలు వినిపించాయి. "శివ! శివ! శివ! జయము జయము శంకరా! కరుణా నిధీ! జయము జయము." ఆతనికి అడుగుముందుకు సాగలేదు. అక్కడే నిలబడిపోయాడు. మహర్షి ధ్యానం సఫలత పొందిందని భావించాడు. ఇంతలోనే మహర్షి తన్ను తాను మరచినస్థితిలో మధురంగా, మృదువుగా, మంద స్వరంతో పాటపాడుకుంటున్నాడు.

ఆయన స్వరంలో భక్తి ఉంది. తన్మయత్వముంది. అనురాగమున్నది. ప్రేమ ఉన్నది. కన్న బిడ్డలాగా చూచుకుంటున్న అంజనాదేవి ఆయన కన్నులముందు కదలాడింది. శివుడాయనకు ఆరాధ్య దైవం. మెల్లగా తన్మయత్వాన్ని వదలి కన్నులు తెరచి చూచాడు. ఎదురుగా ప్రియ శిష్యుడు సువ్రతుడు కనిపించాడు. ప్రసన్నంగా దగ్గరకు పిలిచాడు. ''నాయనా! ఎందుకంత బిత్తరపోయి చూస్తున్నావు? భయపడవలసిందేమీ లేదు. ఈరోజు సుదినం. పద వానర రాజు కేసరి ఇంటికి పోదాం." అంటూ లేచి నిలబడ్డాడు.

చైత్రశుద్ధ పూర్ణిమ చిత్తానక్షత్రంతో కూడియున్న సమయాన సూర్యుడు మేషరాశిలో ప్రవేశించాడు. ఆ సమయంలోనే కేసరి భవనంలో అంజనాదేవికి పుత్రోదయమైంది. జన్మించిన శిశువు బాలసూర్యుని వలె దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. అపరిమితమైన తేజస్సుతో, విచిత్రకాంతులతో ప్రకాశించడమే కాదు దివ్యసుగంధాన్ని వెదజల్లుతున్నాడు. ఇంతేకాదు. ఇంకో విచిత్ర మేమంటే బిడ్డ రోమ రోమం నుండి రామ నామం వినిపిస్తోంది. అది ఒక మధురమైన సంగీతంలా విన్పిస్తోంది. ఈ వింతను కేవలం అంజని మాత్రమే గుర్తించగలిగింది. అది సదా శివుని అనుగ్రహంగా భావించింది. తన పుత్రుడు శ్రీరామభక్తుడు. పుట్టిన మరుక్షణం నుండే తన సాధన మొదలుపెట్టాడు.

వానరదంపతుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అఖండమైన ఆనందంతో మైమరిచిపోయారు. దాసీజనం శిశువుకు శుశ్రూష చేయడంలో నిమగ్నమయ్యారు. ప్రసవ సమయంలో అంజనాదేవికి ఏమాత్రం బాధ కలుగలేదు. ఈ వింత మాత్రం వారి మనస్సులను వీడిపోవడంలేదు. ఆమె సంపూర్ణమైన ఆరోగ్యంతోను, ఆనందంతోను కనిపించింది. ఆపుకోలేక ఒక దాసీ మరొక్కదాసీతో ఇలా అంది. "ఈ బిడ్డ విచిత్రమైన మాతృ భక్తుడు. ప్రసవకాలంలో కూడ తల్లికి బాధను కల్గించలేదు." ఔనంటే ఔనని వింతగా చర్చించుకుంటూ ఉండగానే ఒక సేవకుడు వచ్చి శిష్య సమేతంగా మాతంగ మహర్షి వచ్చారని తెలియచేశాడు.

ఆనందంతో కేసరి ఎదురేగి సాదర నమస్కారాలతో ఆహ్వానించాడు. మహర్షి సాటి ఋషులతో "మునిగణములారా! మీ మనస్సులలోని సందేహాలన్నింటికీ సరియైన సమాధానం ఈ కేసరి భవనంలోనే ఉంది. అంజనాపుత్రుని స్వాగతించడానికి నేడు ప్రకృతి కూడ పరవశించిపోతోంది." మహర్షి మాటలపై వారికి పూర్తి విశ్వాసమున్నది. కాని వారి ఆలోచనల్లా అంజనీ పుత్రుడు ఎవరై ఉంటారా? అన్నదే.

కేసరి చేత అర్ఘ్యపాద్యాదులను గ్రహించి శిశువును చూడాలన్న ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇంతమందిని ప్రసూతి గృహంలోనికి ఆహ్వానించడానికి కేసరి కొద్దిగా వెనుకముందాడాడు. అది గమనించిన మాతంగుడు త్రిలోకాధీశుడే నీయింట జన్మించాడు. అటువంటప్పుడు ఇంకా ప్రసూతిశౌచం ఏంటి? అయినా నీమాట కూడ కాదనలేము. మేమంతా దూరం నుండే శిశువును చూచివెళతామన్నాడు.

★★★

ప్రతిఫలాన్ని కోరకుండ పనిచేస్తూఉండు - ప్రపంచమే పాదాలచెంతకు వస్తుంది.

బోధకథ

# జీవితమే సంపద

ఒకానొక గ్రామంలో సాయం సమయం. పురాణ పఠనం జరుగుతోంది. గ్రామంలోని చిన్న పెద్ద అన్ని వయస్సుల వారు వచ్చి చేరారు. పండితులవారు చతురోక్తులతో అందర్ని నవ్విస్తూ కవ్విస్తూ కథా వివరణ చేస్తున్నారు. అందరు ఆసక్తిగా ఆలకిస్తున్నారు.

పండితులవారు సంపదపై ప్రజలు చూపుతున్న మోహాన్ని గురించి వివరిస్తున్నారు. "భక్తులారా! ఈరోజుల్లో డబ్బుపైనున్న వ్యామోహం గురించి చెప్పాలంటే వర్ణించటం, వివరించటం మహా కష్టం. అందుకే ఉదాహరణగా ఒక సంఘటనను తెలియచేస్తాను. శ్రద్ధగా వినండి." అంటూ మొదలుపెట్టారు.

"అనగా అనగా ఒక ఊరు. ఆవూర్లో నేర్పరియైన వ్యాపారి. ఆయనకు అన్ని విధాలా చేదోడు వాదోడుగాఉన్న అర్థాంగి. వారికి ముద్దులు మూటగట్టే చిన్నారి బాబు. భార్యాభర్తలిద్దరు ముచ్చటగా, ఆదర్శప్రాయంగా బట్టల వ్యాపారం చేసికొనేవారు. ఇద్దరి మధ్య ఉన్న ఐక్యతవల్ల, తెలివితేటలవల్ల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. గొప్పధనవంతులయ్యారు. వెండి-బంగారాలు పుష్కలంగా కొని ఉంచారు. విలువైన వస్తువుల విషయం చెప్పవలసిన పనేలేదు. వారి జీవితం హాయిగా సాగిపోతున్నది.

అన్ని వేళలు మనవి కావుకదా! ఒకనాటి అర్థరాత్రి సమయాన విధి కాలసర్పమై వారిని కాటువేసింది. దౌర్భాగ్యవశాత్తు ఇంటికి నిప్పంటుకున్నది. అందరు గాఢమైన నిద్రలో ఉన్నారు. మెల్ల మెల్లగా విజృంభించిన మంటలు దంపతులు శయనించిన మంచందాకా వచ్చాయి. అప్పుడు మెలకువ వచ్చింది వారికి. లేస్తూనే గాభరాపడి పోయారు. పెద్దగా కేకలు వేస్తూ ఇన్నేళ్లూ కష్టపడి సంపాదించిన వెండి బంగారాలు దాచిన పెట్టెలవద్దకు పరుగుదీశారు. వాటిని భద్రంగా బయటకు చేర్చారు. కేకలుపెడుతూ ఇరుగు పొరుగు వారిని లేపారు. అందరు లేచివచ్చారు. ఎవరికి తోచిన విధంగా వారు విలువైన వస్తువులను బయట పడేశారు. కొందరు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మొత్తం మీద గంటసేపటికి అలజడి సద్దుమణిగింది. విలువైన సామానంతా చాలవరకు రక్షింపబడింది. పరవాలేదు అని ఊపిరి తీసికొనేంతలో తల్లికి తన చిన్నారి తనయుడు గుర్తుకు వచ్చాడు. బాబూ! నా తండ్రీ! అని కేకలు పెడుతూ కాలిన గృహంలోకి పరుగులు తీసింది. ఆమె వెనుకనే కొంతమంది కూడా వెళ్లి బాలునికై గాలించారు. ఇంకేముంది! మంచం మీద నిద్రించిన బాలుడు నిద్రించినట్లే కాలి మసిబొగ్గుగా మారిపోయి ఉన్నాడు.

ఆ హృదయవిదారక ఘట్టాన్ని ఏమని వర్ణించాలి? వర్ణించాలంటే ఎన్ని హృదయాలను అరువుగా తెచ్చుకోవాలి? తల్లి దండ్రి మూర్ఛపోయారు. పొరుగువారి సాయంతో తేరుకున్నారు. నిన్నటివరకు అందరి మనస్సులను ఆటపాటలతో అలరించిన చిన్నారి శిశువు "ఇక లేదు" అన్న భావం అందరిని బండరాళ్లుగా మలచివేసింది.

'సంపద' 'సంపద' అంటూ వెండి- బంగారాలకై పరుగులు తీశామేకాని బంగారు భవిష్యత్తు కలిగిన బంగారు తండ్రిని ఎలామరచిపోయాము? సంపద అనే మాయా జాలంలో ఎలా చిక్కుకునిపోయాము? దీనికంతటికీ కారణమేమిటి? డబ్బుపై గల వ్యామోహమే కదా! అంటూ పరిపరి విధాల వాపోయారు.

జీవితమే అసలైన సంపద అన్న విషయాన్ని ఆలోచించలేక పోయాము అని గుండెలు బాదుకుని బాదుకుని విలపించారు. ఏడ్చి ఏడ్చి వాస్తవ దృష్టికి రాగలిగారు.

కాలిపోగా రక్షింపబడిన సంపదను పేదసాదలకు వినియోగపరుస్తూ కొన్ని వందల జీవితాలను నిలబెట్టగలిగారు. వారిలోనే తమ ముద్దుల కుమారుని చూచుకుంటూ శేష జీవితం సమాజ సేవలో గడిపివేశారు.

"భక్తులారా! ధనసంపాదన అవసరమే. కాని అదే లోకంగా జీవించకూడదు. భగవంతుడు ప్రసాదించిన ఈ జీవితమే గొప్ప ధనంగా భావించి మంచిపనులు చేయాలి. మరల రేపు ఇదే సమయానికి మన పురాణ కాలక్షేపం కొనసాగిద్దాం." అంటూ ముగించి లేచి నిలబడ్డారు. భక్తులంతా బరువెక్కిన గుండెలతో ఇళ్లకు బయలుదేరారు.

★★★

**పశ్చాత్తాప పడాల్సిన అవసరంలేని ప్రతిపనీ ఒప్పే అవుతుంది.**

ధారావాహిక : దేవసంస్కృతీ సౌరభం-17

# కర్మ ఫలం

భారతీయ సంస్కృతి కర్మఫలాన్ని నమ్ముతుంది. మనదగ్గర కర్మగతిని గురించి చాలా లోతుగా తరిచి చూడడం జరిగింది. మనకు ఏ విధమైన ఫలితం లభించినా అది మనం చేసుకున్న కర్మల యొక్క ఫలితమే.

**"మనుష్యాః కర్మ లక్షణాః"**

అంటే మనిషి యొక్క లక్షణం కర్మయే అని, మనిషి కర్మ నాచరించాలని, కర్మనాచరించడం వలననే మనిషి తయారవుతాడు అని అర్థం.

**"స్వకర్మ నిరతో యోహి సయశః**
**ప్రాప్యనుయాన్మహత్"**

-మహాభారతము. వ.ప.212-19.

"ఎవరు తనదైన కర్మలో సంలగ్నుడై ఉంటాడో అతను గొప్ప కీర్తిని పొందుతాడు."

**"ధృవ న నాశో స్తి కృతస్య లోకే"**

-మహాభారతము. వ.ప.237-27.

"జగత్తులో చేయబడిన కర్మకు నాశనం జరుగుదు."

**"యః క్రియావాన్ స పండితః"**

"ఎవరు కర్మ పరాయణుడో అతడే నిజమైన పండితుడు."

భారతీయ సంస్కృతిలో మనిషి చేసే మంచి, చెడ్డపనుల చిట్టా వ్రాసే చిత్రగుప్తుడిని గురించి పేర్కొనడం జరిగింది. మరణించిన తరువాత జీవుడు చేసిన మంచి, చెడు కర్మల కారణంగా స్వర్గానికో లేక నరకానికో వెళ్లడం జరుగుతుంది. ఈ ఆలంకారికమైన కథనంలో ఎంతో లోతైన సత్యముంది. మన గుప్త మనస్సులో మనం చేసే అన్ని శుభాశుభకార్యాల సూక్ష్మ రేఖలు పడతాయి. ఇవే మనయొక్క కర్మరేఖలను నిర్మిస్తాయి. "ఎంత నేర్పుతో ఏమి చేసినా కర్మరేఖ చెరిగిపోదు"- అని తెలుపబడింది. కర్మరేఖలు ఫలాన్ని ఇవ్వకుండా ఉండవు. పాప, పుణ్య కర్మల ఫలాలు వెంటనేగానీ, ఆలస్యంగాగానీ తప్పకుండా లభిస్తాయి.

కర్మకు మూడు స్థాయిలు కలవు. అవి (1) సంచితం. (2) ప్రారబ్ధం, (3) క్రియమాణం అన్నవి. ఈ మూడు రకాల కర్మల యొక్క సంచయం నిరంతరం మన సంస్కారంలో జరుగుతూ ఉంటుంది. మనిషి యొక్క అంతరాత్మ పక్షపాతంలేనిది, నిర్మలమైనది న్యాయశీలంగలది, వివేకవంతమైనది.

అసహాయస్థితిలో ఇష్టంలేకున్నా ఏదైనా పనిని చేయవలసి వస్తే, అట్టి కర్మకు సంచితకర్మ అని పేరు పెట్టబడింది. ఆ పని (కర్మ) చేయడానికి ఇష్టంలేక పోయినా చేయడం తప్పని స్థితి కలగడంవల్ల దాన్ని చేయవలసి వస్తుంది. ఇటువంటి కర్మల సంస్కారాలు చాలా బలహీనంగా, తేలికైనవిగా ఉంటాయి. అందువల్ల అవి మనస్సులో వేలకొద్ది సంవత్సరాలు ఒకమూల పడి ఉంటాయి. బైటపడటానికి కావలసిన అవసరం కలుగనంత వరకు అవి అట్లాగే పడి ఉంటాయి. ఆవిధంగా సంచితమైన ఆ సంస్కారాలకు విరుద్ధంగా మంచి కర్మలవల్ల కలిగిన సంస్కారాలు బలంకలవైతే- ఆ సంచిత దుష్ట సంస్కారాలు నిర్మూలించబడతాయి. ప్రసిద్ధి చెందిన ఆలోచనాపరుడు, సమాజానికి సంబంధించిన విజ్ఞానం పుష్కలంగా కలవాడు అయిన శ్రీ సోహన్ లాల్ మధుప్‌గారు, "మంచి, చెడులతో కూడిన మన రెండు రకాల సంచిత కర్మలు, సంస్కారాలు వాటికి అనుకూలమైన పరిస్థితు లేర్పడినప్పుడు ఫలితాలనిస్తాయి. ప్రతికూల పరిస్థితులలో నశిస్తాయి." అని తెలిపారు.

స్వేచ్ఛతో తెలిసి తెలిసి తీవ్రమైన భావాలతో ప్రేరేపింపబడిన మనోభావనతో చేసే కర్మలను ప్రారబ్ధ కర్మలని పిలుస్తారు. అందువల్లనే వాటివల్ల కలిగే సంస్కారాలు చాలా బలమైనవిగా ఉంటాయి. కర్మలు పరిపక్వమై ఫలమేర్పడితే అది ప్రారబ్ధమన బడుతుంది. సాధారణమైన కార్యము ఒక ఉపాయం. సంచిత కర్మల ఫలం దొరకడం అనుమానమే. వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొని అవి నశించిపోతాయి.

క్రియమాణ కర్మ శరీరంతో చేయబడేది. దాని ఫలితం వెంట వెంటనే లభిస్తూ ఉంటుంది. ఏ శారీరిక కర్మల వెనుక మనస్సు యొక్క సంబంధముండదో, శరీరం ద్వారా శరీరం కొరకు మాత్రమే చేయబడతాయో అట్టికర్మలు క్రియమాణకర్మలని పిలువబడతాయి.

ఈ విధంగా అన్ని విధాలైన కర్మల ఫలం తప్పకుండా లభిస్తుంది. ఎన్నిరోజులలో లభిస్తుంది? ఎంత సమయం పడుతుంది? అంటే ఇందుకు ఒక నియమమంటూ ఏమీలేదు. కర్మయొక్క ఫలం

**పశ్చాత్తాపాన్ని కల్గించే ఎంతపెద్ద సుఖానైనా త్యజించడమే ఆనందహేతువు.**

నేడేలభించవచ్చు, లేదా రేపు, కాదా ఎల్లుండి, లేదా యింకొక జన్మలోనైనా లభించవచ్చు. ఎప్పుడైనా లభించక తప్పదు. కష్టాలు, బాధలు, తప్పకుండా అప్రియంగానే ఉంటాయి. వాటి తాత్కాలిక ఫలం చేదుగానే ఉంటుంది. కానీ భగవంతుని లీల ఎట్టిదంటే– అవే చివరకు జీవుడికి మంచిచేసేవి, సంతోషాన్ని కలిగించేవి ఔతాయి.

భారతీయసంస్కృతి ఈ జగత్తు సత్వ, రజస్తమస్సులను మూడింటియొక్క మిశ్రణమని, ఈ మూడు రకాల వస్తువులు అందులో కలవని నమ్ముతుంది. మన స్వభావం, అభిరుచి, గుణాల ననుసరించి ప్రకృతినుంచి అటువంటి వస్తువులనే పోగు చేసుకుంటాం. మంచిచెడులు, నలుపు తెలుపులు, ధర్మాధర్మాలు, పాపపుణ్యాలు, సుఖదుఃఖాలు మొదలైనవన్నీ ఈ జగత్తులో విచ్చలవిడిగా పడి ఉన్నాయి. మనం మనమనస్సు యొక్క ఆకర్షణను బట్టి మనబుద్ధి, తనస్వభావానికి అనుకూలమైన తత్వాలను ప్రకృతిలో నుంచి పోగు చేసుకుంటుంది. తన మనోభావాలను, అభిరుచులను, రహస్యంగా దాగి ఉన్న కోరికలను, మనిషి తన ముందున్న వారిమీద మోపుతాడు; వాళ్లను అటువంటి వారుగా భావిస్తాడు; తాను ఎట్లా ఉన్నాడో వారు కూడా అటువంటివారేనని తలుస్తాడు. ఉన్నతాత్ముడైన ప్రతివ్యక్తికి తాను వికాసాన్ని పొందడం, సమాజములోని తమో గుణాన్ని పోగొట్టడం, పాపవృత్తులను నిరోధించడం, మంచివృత్తులను, ధర్మం, నీతి సత్యాలను ప్రచారం చేయడం కర్తవ్యం. తన శుభకర్మలద్వారా తాను ఉన్నతిని పొందుతూ తన చుట్టూ పవిత్రత, ఔదార్యం, ప్రేమ, సోదరభావం, స్నేహం, దయ, మంచిగుణాలతో కూడిన వాతావరణాన్ని తయారు చేయాలి.

★★★

## ధైర్యంగా బ్రతకడం నేర్చుకోవాలి

*మలమల మాడ్చే ఎండలు. ఓ సారి కొన్ని కుందేళ్లు అడవిరేగు పొదల్లో సమావేశమయ్యాయి. ఆకాలంలో పొలాల్లో ఎలాంటి పంటలు లేని కారణంగా కుందేళ్లు ఆహారం దొరక్క విలవిలలాడుతున్నాయి. ఆ రోజుల్లోనే పగలు, సాయంకాలం ఊరిబయట తిరిగే కుక్కలు కూడా వాటిని చాలా సతాయించడం మొదలుపెట్టాయి. మైదానాల్లోని పొదలు ఎండిపోయాయి. కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతుండటం మూలాన కుందేళ్లకు బయటకు రావాలంటే భయమేయసాగింది. దిక్కుతోచక అవి ఒకచోట సమావేశమయ్యాయి.*

*ఓ కుందేలు ఇలా అంది– 'బ్రహ్మదేవుడు మనజాతికి చాలా అన్యాయం చేశాడు. మనల్ని చిన్నవిగా, చేతకాని ప్రాణుల్లా సృష్టించాడు. ఆ దేవుడు మనకు దుప్పుల్లాగా కొమ్ముల్నివ్వలేదు; పిల్లుల కిచ్చినట్లు వాడిగోళ్లు కూడా ఇవ్వలేదు. శత్రువులనుంచి రక్షించుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నాం. మనమీద ఎవరైనా దాడిచేస్తే మనకు పారిపోవడం తప్ప మరో మార్గంలేదు. భగవంతుడు కష్టాలన్నీ మనతలమీదనే రుద్దాడు.*

*ఇంకో కుందేలు 'ఈ కష్టాలు, ఈ భయాందోళనలు నాకొద్దుబాబు! నేను ఏ చెరువులోనో పడి చచ్చిపోవాలనుకొంటున్నాను. నేను ఇంకెంత మాత్రమూ ఈ కష్టాలు పడలేను. నేనిప్పుడేవెళ్లి చెరువులో దూకి చస్తాను.'*

*'మేముకూడా నీవెంటనే వస్తాం. మనమంతా కలిసి బతికాం, కలిసేచద్దాం.' కుందేళ్లన్నీ ఒక్కసారి బిగ్గరగా అరిచాయి. అవన్నీ చావడానికి చెరువు వైపు సాగాయి.*

*కుప్పలు తెప్పలుగా కప్పలు చెరువు గట్టుమీద కూర్చున్నాయి. కుందేళ్లు అలికిడి వినగానే అవి భయపడి చెంగుచెంగున చెరువులోకి దూకాయి. కప్పలు భయపడి నీళ్లలోకి దూకడం చూసి కుందేళ్లు ఆగిపొయ్యాయి. అప్పుడు ఓ కుందేలు తోటి మిత్రులతో ఇలా అంది– 'సోదరులారా! మనం చావాల్సిన పనిలేదు. రండి. తిరిగి వెళ్దాం. దేవుని సృష్టిలో మనకంటే అల్పమైనవి, మనమంటే భయపడే ప్రాణులూ ఉన్నాయి. అవికూడా బతుకుతున్నాయి. అలాంటప్పుడు మనమెందుకు చావాలి?'*

*ఆ మాటలు విన్న మిగతా కుందేళ్లు ఆత్మహత్య చేసుకోకుండా తిరిగి వెళ్లాయి. కష్టాలు వస్తాయి. కాని భయపడకూడదు. మనకంటే ఎక్కువగా కష్టాలు అనుభవిస్తున్నవాళ్లు, మనకంటే పేదలు, రోగాలపాలైనవాళ్లు ఈ ప్రపంచంలో ఎంతోమంది ఉంటున్నారు. మనం ఎందుకు భయపడాలి?*

**అవతలి వ్యక్తిని గూర్చిన అవగాహనాలోపమే మనల్ని బాధిస్తుంది.**

గాంధీ జయంతి ప్రత్యేకం

# సాఫల్యం కొరకు రహస్య సూత్రాలు

*(గాంధీజయంతి సందర్భంగా గురుదేవుల ఆత్మకథ నుండి)*

అవి స్వాతంత్ర్యసంగ్రామపు తొలి రోజులు. అప్పటికింకా గురుదేవుల దర్శన భాగ్యం కలుగలేదు. గ్రామంలో ఒక కాంగ్రెస్ కార్యకర్తగా ఉంటూ ఉండేవాడిని. గ్రామంలోని వారందరూ గాంధీజీని అలౌకిక శక్తులు గలవానిగా పూజిస్తూ ఉండేవారు. ఆంగ్లేయులు గాంధీజీని జైలులో పెట్టినప్పుడు ఆయన తన శక్తితో జైలునుండి బైటకు వచ్చేవారు అని అందరూ చెప్పుకునేవారు. మేమందరం ఆయనను భారతదేశమునకు స్వాతంత్ర్య సాధనకొరకు అవతరించిన దేవదూతగా భావించేవారం.

గాంధీ గారివద్ద యోగాభ్యాసం నేర్చుకునే కోరిక నాకుకలిగింది. సబర్మతీ ఆశ్రమానికి ఉత్తరంవ్రాసి కొన్ని నెలలు ఉండే అనుమతిని పొందాను. వెంటనే అక్కడకు చేరుకున్నాను. రెండవ రోజు నుండే నాకు పని అప్పగించారు. అది పాయిఖానాలను **(latrines)** కడగడం, ఆశ్రమపు ముంగిలిని శుభ్రంగా ఉంచడం. ఆశ్రమ వాసులకు మొదట ఈయపడే నియమం చెత్తాచెదారం తీసివేసి తాను ఉన్నస్థలాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవడం. లెట్రిన్స్‌ను నేను చాల జాగ్రత్తగా కడిగాను. కానీ నిరీక్షకునకు పని నచ్చలేదు. తప్పులను చూపించి నాచేత మరల మరల కడిగించారు. శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అంత శుభ్రంగా పాకీదొడ్డిని కూడా ఉంచాలి అన్నారు. అప్పటినుండి నిరీక్షకుని తృప్తి మేరకు నేను పని చేశాను. దీనితో పాటు ప్రత్తి వడకడం కూడా నా దినచర్యలో ఒక భాగంగా ఉండేది.

ఒక రోజు కట్టెలు కొట్టే పని ఇవ్వబడింది. చేశాను. నిరీక్షకుడు వచ్చి కట్టెలు బాగానే కొట్టావు కానీ అక్కడ పడిఉన్న చిన్న చిన్న చితుకులు ఎవరికైనా గుచ్చుకోవచ్చును. వాటిని జాగ్రత్తగా ఏరి వంట ఇంట్లోకి తీసుకొని వెళ్లు. ఇంధనానికి పనికి వస్తాయి అన్నారు. అలానే చేశాను. ఇదే పనిని చాలా రోజులు నాచేత చేయించారు.

ఒక రోజు వేపచెట్టునుండి పళ్ళు తోముకోవడానికి వేపపుల్ల తుంచి దంతధావనం చేసుకుంటూ ఉంటే ఆరోజు పరీక్షకురాలైన మీరాబహన్ చూచి "అనవసరంగా అంత పెద్దపుల్లను ఎందుకు విరిచావు? ఒకవేళ విరిస్తే ఒకముక్క ఇతరులకు ఇవ్వవచ్చునుకదా!" అన్నది. అంతేకాక "ఉమ్మిని ఎక్కడ పడితే అక్కడకాక, కాలువలోనే ఉమ్మాలి" అన్నది. "పుల్లనుండి తుంచిన ఆకులను చెత్తకుండీలో వేయడం, దంతధావనం అనంతరం పుల్ల కూడ జాగ్రత్తగా కసువు డబ్బాలో వేయడం మరువకూడదు, నీళ్ళను ఎక్కువ ఖర్చు పెట్టకూడదు" అని అన్నది. పై సూచన లన్నింటినీ నేను తు.చ. తప్పకుండా పాటించాను.

ప్రతిరోజు డైరీ వ్రాసేవాడిని, అది గాంధీగారు చూసేవారు. ఈవిధంగా మూడు నెలలు గడిచినాయి. ఇచ్చటకు యోగంద్వారా చమత్కారాలు నేర్చుకోవడానికి వచ్చాను. వేరొకగాంధీ అవాలనివస్తే దానికి అవసర మయ్యే సాధన నేర్చుకునే వీలు దొరకలేదు. తిరిగి వెళ్ళి పోయే రోజు దగ్గరపడుతున్న కొద్దీ నా ఆతురత పెరిగింది. ఒక రోజు ధైర్యం చేసి గాంధీజీ సెక్రటరీ అయిన మహాదేవ్ భాయిదేశాయ్ ఆఫీసుకు వెళ్ళి నేను ఆశ్రమానికి వచ్చిన కారణాన్ని వివరించాను. ఆయన విని నవ్వి ఇలా అన్నారు. "నేను యోగ సిద్ధుడిని కాను గాంధీగారు కావచ్చును, నీవు రేపు ఉదయం ఆయన ప్రాతః భ్రమణానికి వెళ్ళే సమయంలో ఆయనతో కలిసి వెళ్ళి యోగి అయ్యే మార్గాన్ని తెలుసుకో!" అని అన్నారు. నేను సరే అన్నాను.

గాంధీగారితో పాటు ప్రాతఃభ్రమణానికి వెళ్ళే వారి సందేహాలు తీరేవి, గాంధీగారి షికారు పూర్తి అయ్యేది. ప్రొద్దున 5 గంటలకు నేను ఆయన తలుపు వద్ద నిలుచున్నాను. గాంధీగారు ఇవతలకు రాగానే ఆయనను అనుసరించాను. మహాదేవభాయి గాంధీగారికి నా గురించి చెప్పారు కాబోలు. "నీవు గాంధీ అయ్యే యోగవిద్య నేర్చుకోవడానికి వచ్చావా?" అని అడిగారు. నేను నా మూడునెలల కార్యక్రమ వివరణను ఆయనకు వివరించి చెప్పాను. "ఇదే గాంధి అగుటకు కావలసిన యోగసాధన" అని అన్నారు ఆయన.

నాకు అర్థం కాలేదు. అందువల్ల ఆయన ఒక సంఘటన తెలిపారు. అది అత్యంత ప్రతిభా సంపన్నుడు, శాస్త్రవేత్త అయిన "థామస్‌దేవి" జీవితములో జరిగింది. చిన్నతనంలో ఆయన

మనకు కలిగిన నష్టం తాత్కాలికంగా బాధిస్తుంది - మనం కలిగించిన నష్టం శాశ్వతంగా వేధిస్తుంది.

చాలా బీదవారు. ఆయనకు శాస్త్రవేత్త అవ్వాలనే కోరిక ప్రబలంగా ఉండేది. కానీ విశ్వవిద్యాలయంలో చేరి చదువుకోవడానికి తగిన ఆర్థికస్తోమత లేదు. అప్పుడు దేవీ తనతల్లితో తనని ఒక శాస్త్రజ్ఞుని వద్దకు తీసుకొని వెళ్ళి వదిలేస్తే వారి ఇంటిపని చేసిపెట్టి వారి వద్ద శాస్త్రాభ్యాసము చేస్తాను, అన్నాడు. అతని తల్లి అనేకుల వద్దకు తీసుకొని వెళ్ళింది. అందరూ మాకొద్దు అంటే మాకొద్దు అని అన్నారు. ఒక శాస్త్రజ్ఞుడు "మీ అబ్బాయిని రేపు తీసుకొనిరా పనికివస్తే నేను తప్పనిసరిగా శాస్త్రజ్ఞుడిగా చేస్తాను అన్నాడు." దేవీని తీసుకొని రెండవ రోజు ఆయనవద్దకు వెళ్ళింది. ఆ శాస్త్రజ్ఞుడు దేవీకి చీపురుకట్ట ఇచ్చి శుభ్రపరచు అని అన్నాడు. దేవీ యెంత శుభ్రంగా తుడిచాడంటే ఎక్కడా, ఏమూలా, ఏవస్తువు మీద ఒక్క ధూళికణంకూడా లేదు. ఇల్లు అంతా అద్దంవలె తళతళలాడుతోంది. శాస్త్రజ్ఞుడు దేవీకి తుడిచే పనిలో శ్రద్ధ, తన్మయత్వం, వస్తువులను ఒక వ్యవస్థలో ఉంచే గుణం ఉన్నదని అర్థం చేసుకున్నాడు. అందువల్ల ఇతనికి నేర్పిన విద్య పూర్తిగా నేర్చుకొనగలడని నిర్ధారించుకున్నాడు. దేవీ ఇంటిపని చేస్తూ అతని వద్ద చదువుకున్నాడు. చివరకు ప్రఖ్యాత శాస్త్రవేత్తగా పేరొందాడు.

గాంధీగారు పై సంఘటనను తెలుపుతూ ఇలా అన్నారు. "ఇచ్చట నీచే చేయించబడిన ప్రతీపని నీలో ఇష్టతను, బాధ్యతను పెంపొందించాయి. నాలో ఉన్న యోగశక్తి ఇదే! అదే, నిన్ను ఇక్కడకు తీసుకొనివచ్చింది. నా కార్య సాఫల్యం యొక్క రహస్యం ఇదే! **నీవు చేసే ప్రతి పని ఎంత చిన్నది అయినా దానిని పూర్తి బాధ్యత, అభిరుచితో చేస్తే ప్రతీపనిలోనూ విజయం సాధిస్తావు. అది ధార్మిక క్షేత్రమైనా, రాజనీతి క్షేత్రమైనా, కుటుంబ సమస్యలైనా విజయం సాధించడానికి రాజమార్గం.**"

నిజమైన యోగసాధనకు విజయసాధనకు మార్గం ఈవిధంగా నాకు లభ్యమైంది. మనిషి ఎల్లప్పుడూ ఆదర్శాన్ని లక్ష్యంగా పెట్టుకొని నిష్ఠతో పని చేసుకుంటూ పోవాలి. ప్రతిపనినీ బాధ్యతతో ఇష్టంతో చెయ్యాలి. మూడునెలల సబర్మతి ఆశ్రమంలో ఉండి ప్రతీ చిన్నపనిని బాధ్యతతో, క్రమం తప్పకుండా చక్కగా ఇష్టత కలిగిచేయడం నేర్చుకున్నాను. నిరీక్షకులు తప్పులు సరిదిద్దేవారు.

నేను చమత్కారాలు చూపించే యోగినవ్వాలనే బాల్య చాపల్యాన్ని వదిలేశాను. మూడునెలల సమయం అయిన తరువాత అందరివద్ద వీడ్కోలు తీసుకొని ఇంటికి తిరిగివచ్చాను. గాంధీజీ చెప్పిన విషయాలను నా హృదయములో పదిలంగా ఉంచుకున్నాను. ఇదే నా అన్ని విజయములకు మూలకారణము.

★★★

## బ్రహ్మదేవుని సంచులు

*సమస్త చరాచరప్రపంచాన్ని సృష్టించిన బ్రహ్మదేవుడు ఓసారి మానవుణ్ణి తనవద్దకు పిలిచి 'నీకేమి కావాలి?' అని అడిగాడు.*

*మానవుడు ఇలా బదులిచ్చాడు– 'నేను బాగాపైకి రావాలి. సుఖశాంతులతో తులతూగాలి. లోకులంతా నన్ను పొగడాలి.'*

*బ్రహ్మదేవుడు మానవుని ముందు రెండు సంచులు ఉంచాడు. ఇలా అన్నాడు– 'ఈ రెండు సంచుల్ని తీసుకో, ఒక సంచిలో నీ పొరుగువాని తప్పులున్నాయి. దాన్ని వీపుమీద వేసుకో. దాన్ని ఎప్పుడూ విప్పకు, నీవు చూడకూడదు. ఇతరులకూ చూపించకూడదు. రెండో సంచిలో నీ తప్పులున్నాయి. దాన్ని నీ ఎదుట వేలాడ తీసుకొనిఉంచు. దాన్ని పదే పదే విప్పి చూస్తూ ఉండు.'*

*మనుష్యుడు రెండు సంచులను తీసుకొన్నాడు. కాని అతను చెప్పినదానికి వ్యతిరేకంగా చేశాడు. తన తప్పులున్న సంచిని వీపుమీదికి ఎత్తుకొన్నాడు. దాని మూతిని గట్టిగా బిగించి ఉంచాడు. పొరుగు మనిషి తప్పులున్న సంచిని ఎదురుగుండా వేలాడదీశాడు. అప్పుడప్పుడు దాని మూత విప్పి చూస్తూ, ఇతరులకు కూడా చూపిస్తూ ఉండేవాడు. దీనివల్ల జరిగింది ఏమిటంటే బ్రహ్మదేవుడు ఇచ్చిన వరం తలక్రిందులయింది. అతను చితికిపోసాగాడు. అతనికి సుఖశాంతులు లభించకపోగా దుఃఖం, అశాంతి ఎక్కువ కాసాగాయి. లోకులు అతన్ని దూషించసాగారు.*

*ప్రతి మనిషి తనతప్పులు దిద్దుకోవాలి. అప్పుడే అతను పైకి వస్తాడు. అతనికి సుఖశాంతులు లభిస్తాయి. ప్రజలు అతన్ని మనసారా ప్రశంసిస్తారు.*

**జీవితం అనేది పయనించే పడవ - సంస్కారవంతమైన తోడు దొరికితే కొంత సేదతీరవచ్చు.**

## మనం-మన ఆరోగ్యం: పంచతత్వాలతో చికిత్స-9

# ఆకాశ చికిత్స

పంచ తత్వాలలో పృథ్వి, జల, వాయువు, అగ్నిల క్రియా కలాపాలు ప్రత్యక్షంగా కనబడినవిధంగా ఆకాశ అస్తిత్వము అనుభవంలోనికి రాదు. నిజానికి వీటన్నింటి కన్నా శక్తివంతమైనది, క్రియాశీలమైనది, ప్రభావం కలది ఆకాశమే. ఆకాశం అంటే కొంతమంది వాయువని, కొంతమంది మేఘమని, కొంతమంది శూన్యమని, మరికొంతమంది మరొకటని అనుకుంటూ ఉంటారు. కాని నిజానికి ఆకాశం అనేది ద్రవ, ఘన పదార్థములలో వ్యాపించి ఉన్న ఒక సూక్ష్మపదార్థము. ఆంగ్లభాషలో దీనిని 'ఈథర్' అంటారు. రేడియోలో దూరప్రాంతము నుండి ప్రసారం చేయబడ్డ శబ్ద ధ్వనులు ఈథర్ ద్వారానే వస్తాయి. వాయువు నిమిషానికి కొన్ని మైళ్ళు ప్రయాణిస్తుంది. తుఫాన్ గాలి నిమిషానికి సుమారు 20 మైళ్ళు పయనిస్తుంది. ఈ ధ్వనులు ఇంగ్లాండు నుండి ఇండియా రావాలంటే వారాలు పడుతుంది. వాయు దిశ మారితే అసలు రాదు. రేడియో శబ్ద తరంగాలు వాయువు ద్వారా రావు. అవి ఈథర్ ద్వారా వస్తాయి. ఆకాశ గుణం శబ్దం. అన్ని శబ్దాలు ఆకాశం ద్వారానే ఉత్పన్నం అవుతాయి. ఆకాశం లేకపోతే శంఖం, గంట, తుపాకి మొదలైన వాటిశబ్దాలు వినపడవు. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం సాధ్యం కాదు. చివరకు నోటి నుండి మాటలు కూడా రావు.

మన మనస్సులో ఉత్పన్నమయే ఆలోచనలు ఆకాశంలో వ్యాపిస్తాయి. అవి ఎప్పటికీ నశించవు. అనేక స్థలాలలో నుండి నీరు ఆవిరిగా మారి పైకివెళ్లి మేఘంగా ఏర్పడుతుంది. అదే విధంగా అనేక మంది మనస్సులలో నుండి బయలుదేరిన ఒకే రకమైన ఆలోచన ఏకమై పెద్ద రూపాన్ని సంతరించుకుని అటుఇటు పయనిస్తూ ఉంటుంది.

ఒకే రకమైన ఆలోచనగల మేఘాలన్నీ ఒకేచోట చేరుతాయి. అదే విధంగా ఆలోచనా మేఘాలు తమజాతి దగ్గరకు క్షణంలో చేరతాయి. ఒక వ్యక్తి క్రోధం, ఆత్మహత్య, ధూర్తత్వం, దొంగతనం ఆలోచనలు చేస్తుంటే, అనేక వ్యక్తుల ద్వారా భూత, వర్తమాన కాలాలలో చేయబడిన అలాంటి ఆలోచనా మేఘాలు ఆ వ్యక్తి వద్దకు చేరతాయి. ఆ దిశలో అతనికి క్రొత్త దారులు, సూచనలు అందుతాయి. ప్రేమ, ఉత్సాహం, త్యాగం, పరమార్థం, సంయమనం మొదలైన ఆలోచనలు చేస్తే అనేక సత్పురుషుల ద్వారా చేయబడిన ఆలోచనల సమూహం అతని దగ్గరకు చేరుతుంది. అదే మార్గంలో ఎక్కువ ఉత్సాహం లభిస్తుంది.

ఎవరైనా తన ఆరోగ్యం దిగజారిపోతుందని భయపడినా, ఏమవుతుందో అని గాభరాపడినా, గతంలో ఇటువంటి ఆలోచనలు చేసిన వ్యక్తుల ఆలోచనలు అతని వైపు ఆకర్షింపబడతాయి. భయపెట్టే అలోచనలు అతని నెత్తిపైన కూర్చుంటాయి. పరిస్థితి ఇంకాస్త విషమిస్తుంది. ఒక వ్యక్తి 'విషం' అనే లేబుల్ అంటించి ఉన్న సీసాలోని మందుని పొరపాటున త్రాగాడు. సీసా మీద ఉన్న లేబుల్ని చూచి విషం త్రాగానని గాభరాపడ్డాడు. ఆ భయంతో కొద్దిసేపట్లో మరణించాడు. తరువాత పరీక్షించి చూస్తే 'విషం' అనే లేబుల్ ఉన్నది కాని అందులో ఉన్నది సాధారణ ఔషధమే. మృతుని శరీరంలో ఒక్క చుక్క విషం కనపడలేదు. కేవలం భయంతో చనిపోయాడు. ఒక వ్యక్తి ముందు నుంచి పాము వెళ్ళింది. అదే సమయంలో ఒక ముల్లమొన గుచ్చుకుంది. పాము కరిచింది అనే భయంతో, భావనతో కొద్ది సమయంలో మరణించాడు. పరీక్షించి చూస్తే అతని శరీరంలో విషం ఏమి కనపడలేదు. కేవలం అతని భ్రమ, భయం విషంగా మారి ప్రాణాన్ని తీశాయి.

ఆకాశం ఒక మహమానిత్వ తత్వం. ఎవరైన వ్యక్తి అనారోగ్యం గురించి ఆలోచిస్తూ ఉంటే ఆరోగ్యంగా ఉన్నవాడు కొద్ది రోజులలో అనారోగ్యం పాలవుతాడు. చచ్చిపోతానని భయపడేవాడిని ఏ మందు రక్షించలేదు. ఆలోచనల శక్తితో మృత్యువును పిలవ వచ్చు లేదా ఆరోగ్యాన్ని, దీర్ఘ జీవనాన్ని కూడా పొందవచ్చు. బంగారు భవిష్యత్తు గురించి కలలు కనేవారు ఆరోగ్యంగా ఉంటారు. ఒకవేళ ఏదో కారణం వల్ల వ్యాధి వచ్చినా త్వరలో కోలుకుంటారు.

సూక్ష్మదృష్టి గల మనో విజ్ఞానవేత్తలు ఇలా చెప్పారు– భయం, నిరాశ, గాబరా, అపనమ్మకం ఇలాంటి మానసిక స్థితిగలవారు ఆనారోగ్యం పాలవుతారు. ప్రసన్నంగా, నిర్భయంగా, భవిష్యత్తుపై విశ్వాసం గలవారు ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్యం సగం ఆహార విహారాల మీద, సగం మానసిక స్థితి మీద ఆధారపడి ఉంటుంది.

**పురోభివృద్ధిని చూచి, పూర్వ స్థితిని మరువద్దు.**

మంచి ఆలోచనలు, ఉన్నతమైన ఆలోచనలు చేసేవారు శరీరం బలహీనంగా ఉన్నా ఆరోగ్యంగా ఉంటారు. తామసులు, పాపాత్ములు, భయం, చింతతో కూడిన ఆలోచనలు చేసేవారు బలమైన శరీరాన్ని కూడా పాడుచేసుకుంటారు.

శరీరం అనే వృక్షానికి మనస్సు వేరువంటిది. 'ఊర్థ్వమూల మధఃశాఖా' అన్న భగవద్గీత శ్లోకంలో ఇదే చెప్పబడింది. శరీరం అనే వృక్షానికి వేళ్ళు మనస్సులో ఉన్నాయి. మనస్సుకు అనుగుణంగా శరీరం తయారవుతుంది. భావోద్వేగ చిహ్నాలు శరీరం మీద వెంటనే కనిపిస్తూనే ఉంటాయి. ఆలోచనా ధారలకు అనుగుణంగా బాహ్యా ఆకృతి, ఆరోగ్య స్థితి తయారవుతుంది. దుర్భావనలతో వ్యక్తి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటాడు. సద్భావనలతో వ్యక్తి ఆరోగ్యకరమైన, శాంతిమయ జీవనాన్ని పొందవచ్చు.

రోగరహిత జీవితం కోరుకునే వారు మనస్సు దిగజారకుండా చూచుకోవాలి, మనస్సును ఉన్నతంగా ఉంచుకోవాలి. పాపం, కామవాసనలు, నిరాశ, ఈర్ష్య, ద్వేషం వంటి ఆలోచనలను వదలి, ఆశ, సాహసం, ప్రేమ, సద్భావనలతో మనస్సును నింపుకోవాలి. ఏదైనా వ్యాధికి గురైనప్పుడు అది త్వరలో పోతుంది అని విశ్వసించాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు అలాంటి ఉత్తమ స్థితి జీవితమంతా ఉంటుంది అనే విశ్వాసం ఎంతో ఉపయోగకరం. ఈ ఆలోచన ఆరోగ్యాన్ని సక్రమంగా ఉంచుకోవడానికి తోడ్పడుతుంది. చికిత్స సమయంలో మంచి ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. వైద్యుని మీద విశ్వాసం లేకపోతే అతను ఎంత గొప్ప మందు ఇచ్చినా ప్రయోజనం ఉండదు.

ఆశ, ఉత్సాహం, విశ్వాసాలు దిగజారిన ఆరోగ్యాన్ని యథాస్థితికి తీసుకువస్తాయి. ఆరోగ్యం రోజురోజుకి అభివృద్ధి చెందుతుంది. అందువల్ల పాఠకులు వైద్యం చేసే వైద్యులపై విశ్వాసాన్ని ఉంచి, ఉత్తమ ఆరోగ్యాన్ని ఆశించాలి. దీనితో దిగజారిన ఆరోగ్యాన్ని కాపాడుకోవటంలో ఆశాతీతమైన విజయం లభిస్తుంది.

## భావనా మంత్రము

నా రక్తం బాగా ఎర్రగా ఉన్నది. ఇది నా సంపూర్ణ ఆరోగ్యానికి నిదర్శనం. ఇది అపూర్వమైన తాజాదనంతో ఉన్నది. శరీరంలోని అణువణువు నుండి జీవన కాంతులు వెలువడుతున్నాయి. నా శరీరం సుందరంగా ఉన్నది. నేను ఇంకా అందంగా తయారవుతున్నాను. నా కళ్ళలో తేజస్సు, సామర్థ్యం ప్రకాశిస్తున్నాయి. నా ఊపిరితిత్తులు బలంగా ఉన్నాయి. నేను దీర్ఘ శ్వాస తీసుకుంటున్నాను. నాకు ఎటువంటి రోగాలు లేవు. నా ప్రతి అంగం శక్తివంతంగా ఉన్నది. నేను శక్తిశాలిని. ఆరోగ్య రక్షణ శక్తి నా రక్తంలో తగిన మోతాదులో ఉన్నది.

"నేను తేజస్సు అయిన ఆత్మను నాలో ధారణ చేస్తున్నాను. నా శక్తులను వృద్ధి చేసుకోవటం నా లక్ష్యం. నేను అత్యధిక శక్తిని పొందుతాను. ఆరోగ్యంగా ఉంటాను. అన్ని వ్యాధులను, బలహీనతలను ఓడిస్తాను. నా గుప్తశక్తులు జాగృతమయ్యాయి."

"ఇప్పుడు నేను బలమైన శక్తి పిండాన్ని. నేను జీవన తత్వాల భాండాగారాన్ని. నేను శక్తివంతుడిని, ఆరోగ్యవంతుడిని. నేను ప్రసన్నంగా ఉన్నాను."

అనే భావనా మంత్రాన్ని అనుక్షణం జపిస్తూ ఉంటే అనారోగ్యం మన దరిదాపులకు కూడ రాదు.

★★★

## నేను బాగున్నాను-నా శరీరం సంగతి గంభీర్‌ని అడగండి

*స్వామి శివానంద రామకృష్ణ పరమహంసకు ముఖ్య శిష్యుడు. చివరి రోజుల్లో ఆయనకు పక్షవాతం వచ్చింది. లేచి కూర్చోలేని పరిస్థితి. శ్వాస కూడ కష్టంగా తీసికుంటున్నాడు. ఆయన తన పరిస్థితికి తానే నవ్వుకుంటూ ఉండేవాడు. అప్పుడప్పుడు గంభీర్‌తో నవ్వుతూ అంటుండేవాడు. "గంభీర్! నేను టిబెట్టులో తపస్సు చేసివచ్చాను. నేడు మంచం దిగలేను" అని. ఒకసారి ఆయనకు వైద్యం చేయడానికి డాక్టరు వచ్చాడు. ఎలా ఉన్నారు? అని ప్రశ్నించాడు. దానికి నవ్వుతూ– డాక్టర్! నేను బాగానే ఉన్నాను. నా శరీరాన్ని గురించి చూచుకుంటున్నది ఆయనేగా? ఇంకా ఈ విధంగా అన్నాడు– శరీరంలో ఉన్నంత వరకు కష్టం తప్పదు. ఈ శరీరాన్ని వదలి బయటకు పోయిన నాడు ఏ కష్టమూ ఉండదు. నా శరీరం కూడా ముసలిదయి పోయింది. అయినా నేను బాగున్నాను. మీ పనిని మీరు కానివ్వండి.*

*పరిపక్వత చెందిన యోగుల మానసిక స్థితి ఈ విధంగానే ఉంటుంది. ఉండాలి కూడ.*

ఎలా ఉండాలో నేర్పేది ఏకాంతం - ఎలా ఉన్నామో చెపుతుంది సమాజం.

ధారావాహిక : భక్తిగాథ-12

# భక్తుడు శాస్త్రాన్ని రక్షిస్తాడు

హిమాలయ శుభ్ర శిఖరాలమీద సూర్యభగవానుడు తన బంగారురంగు సహస్రకిరణాలను ప్రసరింపచేశాడు. ఆ ప్రదేశమంతా స్వర్ణిమ కాంతితో మెరిసిపోతున్నది. కొద్దిదూరంలోనే ఉన్న హిమసరస్సులోని జలం ఆ రంగులో లీనమైంది. అక్కడి ఋషులు, దేవతలు అందరూ తమ ప్రాతఃకర్మలను పూర్తి చేసుకొని కొద్ది సేపటిక్రితమే సంపూర్ణ విశ్వహితంకోసం "ధియో యోనః ప్రచోదయాత్" అని ప్రార్థించారు. నిర్మలమైన బుద్ధి నిర్మలమైన భావనలను కలిగిస్తుందని. మహర్షి విశ్వామిత్రుడు క్రతు మహర్షితో ఇలా అన్నారు– "ఈ వేళ నాకెందుకో జరిగిపోయిన విషయం గుర్తుకు వస్తోంది. భావనలు కలుషితమైనపుడు బుద్ధి కర్మలు కూడ కలుషితమౌతాయి."

పరమ భక్తుడైన ప్రహ్లాదుని మధుర భక్తి గీతం ఆయనలో ప్రతిధ్వనిస్తోందా అన్నట్లుంది. అంతటి మహాభక్తుడైన ప్రహ్లాదుడు సౌమ్యమైన, సదాచారపూర్ణమైన జీవితాన్ని గడిపాడు. విధి నిషేధాల కతీతుడైనప్పటికీ పాటించాడు. లోకమూ, వేదమూ అన్నింటినీ తన ఆచరణ ద్వారా మహిమాన్వితం చేశాడు.

బ్రహ్మర్షి విశ్వామిత్రుని అంతర్వాణిని దేవర్షి తన అంతఃకరణ భావమే అన్నట్లు వింటూ నవ్వుతూ ఇలా అన్నారు– "ఋషులందరికీ సమ్మతమైతే నా తదుపరి సూత్రాన్ని మీ ముందుంచుతాను." అందరూ ఇదంతా తమ సౌభాగ్యమంటూ స్వాగతించారు.

**లోకే వేదేషు తదను కూలా చరణం ।**
**తద్విరోధి షూదా సీనతా ॥**

దేవర్షి మధురస్వరంలో నుండి ఈ కథాసూత్రం వెలువడింది. వారిలా అన్నారు "భక్తుడు లోకానికీ, వేదాలకూ అనుకూలంగా ఆచరణ సల్పుతాడు. దానికి వ్యతిరేకమైన వాటి యందు ఉదాసీనుడౌతాడు."

దేవల మహర్షి ఇలా అన్నారు– "లోక, వేదముల మర్యాదను అహంకారులు అవహేళనచేస్తారు. భక్తుడు అహంకార శూన్యుడుగా, వినమ్రుడుగా ఉంటాడు. అతని వల్ల ఈ మర్యాదల అవహేళన ఎన్నటికీ జరుగదు. ఇది సత్యమని వేదవిదుడూ, పురాణాల రచయిత ఐన వేదవ్యాస మహర్షి తెలిపారు. ఆయన మనస్సులో యమునా నదీ తీరంలో కుటీరం నిర్మించుకొని తపశ్చర్య నాచరిస్తున్న భక్త శ్రేష్ఠుడైన శమీకుడు మెదిలాడు.

శమీకుడు హస్తినాపురానికి కొద్ది దూరంలో కుటీరం నిర్మించుకొని ఉంటున్నాడు. విష్ణు భగవానుని అనన్యభక్తుడు. ప్రతి అణువులోనూ ఆయన తన ఆరాధ్య దైవాన్ని దర్శించుకుంటాడు. సృష్టిలోని జడ చేతన పదార్థాలన్నీ ఆయన దృష్టిలో భగవంతుని ప్రతిరూపాలే.

శమీక మహర్షి కుటీరానికి అతి సమీపంలో వారి గురుకులం ఉంది. ఆ కాలంలో సమాజం జాతివంశములూ, కులీనులూ, కులీనులుకానివారూ అనే రేఖలతో విభజింపబడి ఉండేది. మహర్షి ఉపనిషత్తులనూ, ధర్మ గ్రంథాలనూ అనుసరించి గురుకులం నడిపేవారు. వారి గురుకులంలో 'జాతివంశములు సమానమే, మానవులంతా సమానమే'– అన్న ఆచరణ ఉండేది. అధ్యయనం, అధ్యాపనం, తపస్సు, భక్తి– ఇదే ఆ మహర్షి జీవితం. లోక మర్యాదలనూ, వేదముల ఆజ్ఞలను ఆయన ఎంతో నిష్ఠతో శిరసావహించేవారు.

మూడు పూటలా సంధ్యావందనం, గాయత్రీజపం, నియమిత యజ్ఞం, ఏకాదశీ మొదలైన పర్వదినాలు– వీటిని వారు ఎప్పటికీ మరచేవారు కారు. కాల క్రమేణ వృద్ధాప్యం వచ్చింది. వ్యాసమహర్షి వారిని కలసినప్పటికి వారు పూర్తిగా వృద్ధులైనారు. కేశములన్నీ తెల్లబడ్డాయి. ముఖమంతా ముడుతలు పడి ఉంది. కానీ వారి నేత్రములలో వింతకాంతి ఉంది, స్వరంలో మాధుర్యం, ఓజస్సుల సమ్మి శ్రణం ఉంది.

ప్రాతఃకాలంలో వ్యాస మహర్షి వారిని కలిసినపుడు, వారు సంధ్యావందనం, యజ్ఞం మొదలైన నిత్య కర్మలను పూర్తిచేసుకొని గో సేవ చేస్తున్నారు. ఆశ్రమంలోని గోవులన్నిటి సేవాకార్యాలను శమీక మహర్షి తనే స్వయంగా చేసేవారు. ఆశ్రమంలోని మిగిలిన వారు కూడ సేవలో పాల్గొంటున్నా– శమీక మహర్షికి గో సేవలో ఉండే ఉత్సాహాన్ని చూసి తీరాలి. ఆశ్రమంలోని విద్యార్థులూ, అధ్యాపకులూ వద్దన్నప్పటికీ, గురుకులం యొక్క కులపతి శమీకమహర్షి గురుకులంలోని పనులన్నింటినీ స్వయంగా చూచు కొనేవారు.

పరులేమిటో చెపుతుంది విజ్ఞానం - నీవేమిటో చెపుతుంది వివేకం.

ప్రాతఃకాలమందు సేవలో నిమగ్నమైన శమీక మహర్షి అప్పుడే వచ్చిన వేదవ్యాసుని చూడగానే త్వర త్వరగా వచ్చి సాష్టాంగ ప్రణామం చేశారు. వ్యాస మహర్షి ఆయనను లేపి కౌగలించు కున్నారు. వ్యాస మహర్షి చేయి పట్టుకొని శమీక మహర్షి ఆయనను కదంబ వృక్షం వద్దకు తీసికువెళ్ళారు. బ్రహ్మచారులు పరచిన ఆసనం మీద మహర్షులిద్దరూ కూర్చొని తత్వ చర్చలు జరుపుతున్నారు. గురుకులంలోని ఆచార్యుడూ, బ్రహ్మచారులూ ప్రాతఃకాల ఆహారాన్ని తీసుకువచ్చారు.

ఆహారాన్ని వారి ముందుంచి ఆచార్యుడూ, బ్రహ్మచారులూ చేతులు జోడించి నిలబడ్డారు. వ్యాస మహర్షి వారిని మీరేమైనా అడగదల్చుకున్నారా అని అడిగారు. వ్యాస మహర్షి యొక్క అనుమతిని తీసికొని వారిలా అడిగారు– "మా ఆశ్రమ కులపతి ఇప్పుడు బాగా వృద్ధులయ్యారు, మేమంతా ఉన్నప్పటికీ వారు ఆశ్రమంలోని చిన్న చిన్న పనులన్నీ చేస్తూ అలసిపోవాలా? వారు స్వయంగా పనులను చేయకుండా మాకు మార్గదర్శనం చేస్తే బాగుంటుందని వారికి నచ్చచెప్పండి."

ఆశ్రమవాసులు వ్యాసమహర్షితో చెప్తున్న మాటలు వింటూ శమీక మహర్షి ముసిముసిగా నవ్వుకుంటున్నారు. వ్యాసమహర్షి శమీకుని వేపు ప్రశ్నార్థకంగా చూశారు. శమీక మహర్షి ఇలా అన్నారు– "భగవాన్! మీరు శాస్త్రాలను రచించిన వారు. లోక మర్యాదను, వేదవిజ్ఞాన మర్మాన్ని తెలిసినవారు. భగవద్భక్తులమైన మాకు వాటిని పాటించనవసరం లేదా?"

వ్యాస మహర్షి మరల ఇలా ప్రశ్నించారు– "ఆచార్యా! మీరు భక్తి యొక్క పరమ భావదశను దాటారు. విధి నిషేధాల కతీతులు. అటువంటప్పుడు చిన్న చిన్న మర్యాదలు మిమ్మల్ని కట్టివేయవు కదా?"

శమీక మహర్షి గంభీర స్వరంతో ఇలా అన్నారు "శరీరమున్నంత వరకు మర్యాదల రక్షణ అనివార్యం. భగవంతుని పవిత్రమహిమకు భంగం కలిగించే విధంగా భక్తుడైనవాడు ఉండకూడదు కదా!"

గత స్మృతులకు అలంకారమైన ఈ కథను విన్పిస్తూ వ్యాస మహర్షి ఇలా అన్నారు– "భక్తుడైన శమీకుని కథ ఈ భక్తి సూత్రానికి సజీవమైన వ్యాఖ్య."

ఈ కథను విని అందరూ వ్యాస భగవానునికి ధన్యవాదాలు చెప్తూ ఇలా అన్నారు– "శాస్త్రాన్ని రక్షించడం భగవద్భక్తుని పరమ కర్తవ్యం."

★★★

## బాలిక పరోపకారం

*ఇంగ్లండ్ సమీపాన ఉన్న సముద్రంలో ఒక వెలుగు స్తంభం వుంది. ఆ వెలుగు స్తంభం దగ్గర ఉన్న ఉద్యోగి ఏదో పని మీద ఇంగ్లాండు వెళ్ళాడు. సరిగ్గా అప్పుడే సముద్రంలో భయంకరమైన తుఫాను చెలరేగింది. వెలుగు స్తంభంలో ఆ ఉద్యోగి భార్య, పదునాలుగేండ్ల కుమార్తె ఉన్నారు. కుమార్తె పేరు గ్రేస్ డార్లింగ్.*

*అకస్మాత్తుగా రాత్రివేళ ఒక పెద్ద ధ్వని వినిపించింది. పెద్ద ఓడ ఏదో కొండరాతికి ఢీకొని పగిలిపోయి ఉంటుందని గ్రేస్, ఆమె తల్లి గ్రహించారు. సముద్రంలో ఉవ్వెత్తున తరంగాల తాకిడిలో ఆ సముద్రపు ఘోషలో ఓడలోని యాత్రికులను రక్షించే ఉపాయం కనిపించలేదు. తల్లి, కుమార్తె ఇరువురూ రాత్రి అంతా దైవ ప్రార్థన చేస్తూ కూర్చున్నారు. సూర్యోదయం కాగానే గ్రేస్ దూరదర్శిని తీసుకొని వెలుగు స్తంభంపై భాగానికి పోయి నలువైపులా పార చూచింది. వెలుగుస్తంభానికి ఒక మైలు దూరాన ఒక కొయ్య పలక సముద్రపు అలల తాకిడికి అటు ఇటూ ఎగురుతూ ఉండడం ఆమె చూచింది. దానిపై నలుగురు మనుష్యులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని అతుక్కొని కూర్చున్నారు.*

*గ్రేస్ తుఫాన్‌లాగా వెలుగుస్తంభం క్రిందకి దిగి ఇలా చెప్పింది– అమ్మా, ఇక్కడికి ఒక మైలు దూరంలో ఒక కొయ్యపలక మీద నలుగురు మనుషులున్నారు. నేను వారిని రక్షించేందుకు వెడుతున్నాను' తల్లి తన కుమార్తె మాట విని వణికిపోయింది. గ్రేస్ ముందు వెనుకలు చూడకండా ఒకనావ తీసుకొని సముద్రంలోకి దూకింది. సముద్రపుటలలు నావలోకి ఎగిరి పడుతున్నాయి. మాటిమాటికి నావ ఒరిగి పోతోంది. గ్రేస్ తన ప్రాణాలను లెక్కచేయకుండా నావ నడుపుతోంది.. ఆమెకు ఒకటే చింత. ఆ నలుగురు మనుష్యుల ప్రాణాలు రక్షించాలి. అక్కడ తల్లి కనులు మూసి భగవంతుని ప్రార్థిస్తోంది. ఇతరులను రక్షించేందుకు తమ ప్రాణాలకు తెగించి ముందుకు దూకే వారికి సర్వశక్తిమంతుడగు ఆ భగవంతుడు తప్పక సహాయం చేస్తాడు. ఆమె నావ కొయ్యపలక దగ్గరకి వెళ్ళింది. కొయ్య పలకపై కూర్చున్న వ్యక్తులు నౌకలోకి వచ్చారు. నావ వెలుగు స్తంభం దగ్గరికి చేరింది. తల్లి కుమార్తెను పిచ్చిదానివలె కౌగిలించుకుంది. ఇట్టి పరోపకార బుద్ధి గల బాలబాలికలు ఏ దేశం వారైనా గర్వకారణమే. బ్రిటిష్ బాలిక అయిన గ్రేస్ ధన్యురాలు. ఆమె పరోపకార బుద్ధికి జేజేలు.*

**వివేకంలేని విజ్ఞానం ఎంతకలిగినా వ్యర్థమే.**

ఆచరణలో అధ్యాత్మ

# త్యాగ రహస్యం

సకల సుఖాలకూ మూలకారణం త్యాగమే. ఆంతరంగిక దోషాలైన కోరికలు, ఆశ, లోభం, మోహం, అహంకారం మొదలైన వాటినుండి విముక్తి పొందిన ఫల స్వరూపమే త్యాగం. కాని అధిక శాతం ప్రజలు త్యాగంలో దాగొన్న మర్మాన్ని తెలుసుకోలేక భ్రమలో పడి కొట్టుకుంటున్నారు. బిడ్డను ఒడిలో పెట్టుకుని ఊరంతా వెదికినట్లు సుఖం కోసం ఎక్కడెక్కడో వెదుకుతున్నారు. ఇల్లు వాకిలి వదిలిపెట్టి అడవుల్లో తిరిగే వారు తమను తాము త్యాగమూర్తులుగా భావిస్తున్నారు. కాని త్యాగ భావానికి సరి అయిన అర్థాన్ని తెలుసుకోలేక అశాంతితో కొట్టుమిట్టాడుతున్నారు. ఆంతరిక భావాలను అదుపులో పెట్టుకోలేక పోతున్నారు.

సుఖం అనేది బయటి త్యాగాలతో సమకూరదు. ఇది ఆంతరిక శుద్ధికి సంబంధించినది. స్వామి రామతీర్థుని మాటల్లో– "సుఖ శాంతులతో జీవించాలన్నా, ఆత్మిక ఉన్నతిని పొందాలన్నా మనం గుర్తుంచుకోవలసిన విషయం ఇదే. సుఖశాంతులు వెతికితే దొరికేవి కావు. అవి మానవునికి స్వాభావిక గుణాలు. అది తెలుసుకోలేక మానవుడు కస్తూరి మృగంలాగా బయట ప్రపంచంలో వెదుకులాడుతున్నాడు. తనలోపలికి తొంగి చూచుకోవడం నేర్చుకోకపోయినట్లైతే ఎండ మావులవెంట పరుగులు దీయడమే అవుతుంది. అసలు విషయాన్ని మరిచిపోయి సంసారి ఒక విధమైన పరుగులుతీస్తుంటే, సన్యాసి మరియొక విధమైన పరుగులు తీస్తున్నాడు. కాని ఫలితం విషయంలో ఇద్దరిలోను తేడా ఉండదు. ఇరువురూ కూడ కన్ను తెరిచి అంతరంగంలో దాగిన కోర్కెలను, దాహాలను, మదమోహ మాత్సర్యాలను త్యజించినట్లైతే శాంతి, సుఖం వాటంతటవే వచ్చి చేరుతాయి.

'రాహుల్ సాంకులాయన్' ఒక సారి ఉల్లేఖించారు. ఆలోచనలను స్థూలంగా నాలుగు భాగాలుగా విభజించుకోవాలి. (1) ఊహాజనితమైన ఆలోచనలు. (2) భావాలననుసరించి రూపాంతరం చెందిన ఆలోచనలు. (3) పరిపక్వత చెందిన ఆలోచనలు. (4) అభిప్రాయాలను ప్రకటించగలిగే ఆలోచనలు. ఈ ఆలోచనలలో పడి తన్ను తాను మరచిపోకుండా, తులనాత్మక దృష్టితో చూడాలి. అప్పుడే మానవుడు కొంతలో కొంత తన్ను తాను రక్షించుకో గలుగుతాడు. ఒక్కొక్క సారి ఎలాంటి కారణం లేకుండానే సుఖ శాంతులకు దూరం కావడం జరుగుతుంది. ఏ కారణం లేదని అనుకుంటాం. కాని అసలు కారణం ఆలోచనలే. ఆలోచనలు అనేక రకాల కోరికలను ఉత్పన్నం చేస్తుంటాయి. మనం గ్రహించలేక అనేక రకాలుగా భ్రమపడుతుంటాం. భగవంతునికి నైవేద్యం పెడితే సుఖం లభిస్తుందని అనుకుంటాం. వెంటనే అంతరాత్మ హెచ్చరిస్తుంది. "దేవునికి భోగం చెయ్యడం కాదు. త్యాగం చెయ్యి. సుఖం లభిస్తుంది" అని. త్యాగం అనగానే ఇంటిని పిల్లల్ని వదలి వెళ్లాలి అనుకుంటాం. ఈ భ్రమను తొలగించడానికి బుద్ధదేవుడు తన శిష్యులకీ విధంగా చెప్పాడు– "మీకు నిజంగా సుఖం కావాలంటే బయట ప్రపంచములో వెదికి నిరాశపడవద్దు. ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసికోండి. కోరికల వలయంలో చిక్కుకున్న ఆలోచనలను పెరికివేయండి. శాంతిని భగ్నం చేసేభావాలను తుడిచివేయండి. వ్యామోహాలను త్యజించడంలోనే సుఖ శాంతులు ఇమిడి ఉన్నాయి." అయన చెప్పడమే కాదు. తన అనుభవాన్నే అందరికీ అందించారు.

మహా మనీషి 'బట్రాండ్‌రస్సెల్' తన గ్రంథం "సుఖమయ జీవన్" లో వ్రాశారు– ప్రపంచంలో రెండు రకాల మనుష్యులుంటారు. ఒకరు ప్రపంచంలో ధనసంపాదనయే లక్ష్యంగా పెట్టుకుని జీవిస్తారు. రెండవ వారు సంపదనంతా త్యజించి, ఆది మానవుల వలె అడవుల్లో తిరుగుతూ ఉంటారు. ఈ రెండు రకాల వ్యక్తుల్లోను పెద్దగా తేడా ఏమీ లేదు. ఇద్దరూ భ్రమలో మునిగి ఉన్నట్లే లెక్క. బయట ఉన్న సాధన సంపత్తినంతా సొంతం చేసికోవడం లోనే తృప్తి–సుఖం లభిస్తాయని స్వార్థపరుడు భావిస్తాడు. ఇంటా బయటా లభించే వాటి నన్నింటిని వదిలేయడంలోనే సుఖం ఉన్నదని సన్యాసి భావిస్తాడు. ఇద్దరి ఆలోచనలూ తప్పే. సుఖం, శాంతి అనేవి బయటి నుండి లభ్యం అయ్యేవి కావు. అవి అంతరంగం నుండి రావాల్సిందే.

ఎల్లప్పుడూ అంతరంగంలో సంచరించే వ్యక్తి సుఖాను భూతిని పొందుతాడు. ఏ విధమైన సౌకర్యాలు లేకపోయినా తృప్తిగానే జీవిస్తాడు. అంతరంగంలో ప్రశాంతత ఏర్పడిన రోజున ఈ ప్రపంచాన్నే త్యాగం చేయగల స్థాయికి వస్తాడు. అనవసరమైన భ్రమలకు లోనై కర్తవ్యాన్ని త్యజించడు. కర్తవ్యాన్ని త్యజించినవాడు ధర్మాన్ని త్యజించినట్లే అవుతుంది. వ్యామోహాలను వదలి కర్తవ్యాన్ని పాలించడంలోనే నిజమైన త్యాగం ఇమిడి ఉంది. త్యాగంలోనే సుఖం ఇమిడి ఉంది.

★★★

**తప్పును చేయడంకన్నా, తప్పును క్షమించలేకపోవడమే గొప్పతప్పు.**

ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-35

# ఆనందమయ కోశము

గాయత్రి యొక్క ఐదవ ముఖము ఆనందమయ కోశము. ఏ ఆవరణలో ప్రవేశిస్తే ఆత్మకు ఆనందం లభిస్తుందో, ఎక్కడ శాంతి, సువిధ, స్థిరత, నిశ్చింత అనుకూల స్థితి ప్రాప్తిస్తుందో, అదే ఆనందమయ కోశం. గీత యందలి రెండవ అధ్యాయంలో స్థిత ప్రజ్ఞుని సమాధి స్థితి యొక్క లక్షణాలు చెప్పబడ్డాయి. ఆ గుణ, కర్మ, స్వభావాలే ఆనందమయ స్థితిలో కలుగుతాయి. ఆత్మిక పరమార్థాల సాధన మనోయోగ పూర్వకంగా లగ్నం కావడం వల్ల ప్రాపంచిక అవసరాలు చాల పరిమితంగా ఉంటాయి. సాధకుడు తన శారీరిక, మానసిక స్వస్థత ద్వారా జీవనోపయోగానికి కావలసిన వస్తువులను తగినంత పరిమాణంలో సులభంగా పొందగలగుతాడు.

ప్రకృతిలోని మార్పులు, ప్రపంచమంతా వ్యాపించి ఉన్న హెచ్చు తగ్గులు, కర్మలలోని గంభీరత, ప్రారబ్ధాల అనుభవం, వస్తువులలోని అశాశ్వత, వైభవాల చంచలత్వం మొదలైన కారణాలవల్ల అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడి బాధిస్తూ ఉంటాయి. వాటిని చూచి సాధకుడు తనలోతాను నవ్వుకుంటాడు. ఈ ప్రపంచంలోని వెలుగునీడలతో భగవంతుడు ఆడుకుంటున్న దాగుడు మూతలు చూచి ఆలోచనలో పడిపోతాడు. "ఇంతలోనే సంతోషం- అంతలోనే బాధ, ఇంతలోనే వైభవం- అంతలోనే దారిద్ర్యం, యవ్వనం ముగిసిందంటే వృద్ధాప్యం, జననం తర్వాత మరణం, ఒకసారి రుచికరమైన వంటకమైతే మరొక్కసారి మధురమైన వంటకం- ఈ రెండు రంగుల ప్రపంచం ఎంత విలక్షణమైంది! పగలు గడిచిపోతుందో లేదో ఆలస్యం లేదు రాత్రి సిద్ధంగా ఉంటుంది. రాత్రి ముగుస్తున్నది అనగానే ప్రభాతం ప్రత్యక్షమౌతూ ఉంటుంది. దీనితోనే ఆట ప్రారంభం. మేఘాల వలె క్షణ, క్షణం వెలుగు- నీడలు వచ్చిపోతూనే ఉంటాయి. నేను ఈ సీతాకోకచిలుకల వెంట పరుగులు తీయలేను. క్షణక్షణం ఎగిరిపడుతున్న అలలను లెక్కపెట్టలేను. క్షణంలో నవ్వుతూ, మరుక్షణంలో ఏడుపును లంకించుకునే శిశువులాగా ప్రవర్తించలేను."

ఆనందమయ కోశములో ప్రవేశించిన జీవుడు వెనుకటి నాలుగు శరీరాలు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలను చక్కగా అర్థం చేసికుని ఉంటాడు. వాటి అపూర్ణతను ప్రపంచము యొక్క పరివర్తన శీలతను కలిపితే ఒక విషపూరితమైన వాయువు తయారవుతుంది. ఇది జీవుల పాపతాపాలనే నల్లటి ధూళితో కలుషితం చేస్తుంది. ఈ రెండు వర్గాల గుణదోషాలను అర్థం చేసుకొని వాటిని విడివిడిగా ఉంచాలి. తుపాకి మందును, అగ్నిని కలవనివ్వకపోతే విస్ఫోటనం సంభవముకాదు. ఇది అర్థం చేసుకున్న వ్యక్తి తన దృష్టికోణంలో దార్శనికత, తాత్వికత, వాస్తవికత, సూక్ష్మదర్శితలకు ప్రాధాన్యత ఇస్తాడు. తదనుసారంగా అతను ప్రాపంచిక సమస్యలను చాల తేలికవని, మహత్వహీనమైనవని అర్థం చేసికుంటాడు. ఏ సమస్యలను చూచి సాధారణ మానవుడు ఎక్కువగా దుఃఖిస్తాడో వాటిని తేలికపాటి వినోదంగా భావించి వదిలేస్తే అవే ప్రక్కకు పోతాయి. అంతరంగంలో తనదైన స్థానాన్ని స్థిరం చేసుకొని సంతోషాన్ని, శాంతిని అనుభవిస్తాడు.

గీతలోని రెండవ అధ్యాయంలో శ్రీ కృష్ణ భగవానుడు స్థితప్రజ్ఞుని గురించి ఇలా అంటాడు- స్థితప్రజ్ఞుడు తనలోతానే ఆత్మానందాన్ని పొందుతాడు. అతనికి సుఖదుఃఖములు ఒకేరకంగా ఉంటాయి. నచ్చిన దానిపై ఇష్టం, నచ్చని దానిపై ద్వేషం ఉండవు. ఇంద్రియాలను ఇంద్రియాల వరకే పరిమితం చేస్తాడు. అంటే హద్దులో ఉంచుకుంటాడు. వాటి ప్రభావం ఆత్మ మీద పడకుండా చూచుకుంటాడు. తాబేలు తన ఇంద్రియములను లోనికి ముడుచుకున్నట్లు తన కోర్కెలను, ఇష్టాలను ప్రపంచంపై పడకుండా అంతరంగంలోనే నిలుపుకుంటాడు. ఆతని మానసిక స్థితిని యోగి, బ్రహ్మభూత్, జీవనముక్తుడు, సమాధి స్థితి అని అంటారు.

ఆనందమయ కోశం యొక్క స్థితి ఐదవ భూమిక. దీనిని సమాధి స్థితి అని కూడా అంటారు. సమాధి అనేక రకాలుగా ఉంటుంది. కాష్ఠ సమాధి, భావ సమాధి, ధ్యాన సమాధి, ప్రాణ సమాధి, సహజ సమాధి మొదలైన 27 సమాధులు చెప్పబడ్డాయి. మూర్ఛ, మత్తు పదార్థాములు, క్లోరోఫామ్ మొదలైన పదార్థముల వల్ల వచ్చే సమాధిని కాష్ఠ సమాధి అంటారు. ధ్యానంలో భావాతిరేకం

సాంఘిక జీవనంలో బ్రతుకుతెరువు లభిస్తుంది.

వల్ల మనిషి యొక్క శరీర చేష్టలు సంజ్ఞా శూన్యములైన స్థితిని భావసమాధి అంటారు. ధ్యానంలో ఎంత తన్మయత్వం వస్తుందంటే అదృశ్య నిరాకార సత్తా సాకారంగా కనిపించడం మొదలు పెడుతుంది, దీనిని ధ్యానసమాధి అంటారు. ఇష్టదేవ దర్శనం జరిగిన వారికి ధ్యాన సమాధి స్థితిలో దివ్య చేతన వస్తుంది. వారు దివ్య నేత్రాలతో ధ్యానం చేస్తున్నామా లేక సహజ నేత్రాలతో ప్రతిమను చూస్తున్నామా అని సందిగ్ధంలో పడిపోతారు. ప్రాణ సమాధిలో ప్రాణాలను బ్రహ్మ రంధ్రాలలో ఏకత్రితం చేయడం జరుగుతుంది. హఠ యోగి ఈ సమాధి ద్వారా శరీరాన్ని చాల సమయము వరకు శవంలాగా చేసినప్పటికీ తిరిగి జీవింప చేయగలరు. తనకు తానుగా బ్రహ్మలో లీనమయ్యానని ఏ స్థితిలో తెలుస్తుందో దానిని బ్రహ్మ సమాధి అంటారు.

ఈ రకమైన 27 సమాధులలో వర్తమాన దేశకాల పరిస్థితులలో పాత్రతను బట్టి సహజ సమాధి సులభం, సుఖంగా సాధించుకోవచ్చు. కబీరు మహాత్ముడు సహజ సమాధికే ఉన్నత స్థానం ఇచ్చాడు. ఆయన తన అనుభవంతో సహజ సమాధి సర్వ సులభంగా గ్రహించి తన అనుయాయులకు ఈ సాధన చేయండని ప్రేరణ ఇచ్చాడు.

సాధో సహజ సమాధి భలీ।
గురుప్రతాప్ భయో, జా దిన్ తే, సురతి న అనత చలీ॥
ఆంఖ్ న మూందూ కాన్ న రూందూ కాయాకష్ట న ధారూ।
ఖులే నయన్ సే హంస్- హంస్ దే ఖూ సుందరరూపు నిహారూ॥
కహూ సో ఈ నామ్, సునూ సోఈ సుమిరన్, ఖాఊ సోఈ పూజా।
గృహ ఉద్యాన్ ఏక్ సమ లేఖూ భావ్ మిటాఊ దూజా॥
జహా - జహా జాఊ సోయీ పరిక్రమా జో కుచ్‌కరూ సో సేవా।
జబ్ సో ఊ తబ్ కరూ దండవత్ పూజూ అవుర్ న దేవా॥
శబ్ద్ నిరంతర్ మనుఆ రాతా, మలిన వాసనా త్యాగీ।
బైఠత్ ఉఠత్ కబ్‌హూ నా విసరేం, ఐసే తాడీలగీ॥
కహై 'కబీర్' వహ్ ఉన్నతి రహతీ సో ప్రకట్ కర్ గాఈ।
దుఖ్ సుఖ్ కే ఏక్ పరే పరమ సుఖ్, తేహిసుఖ్ రహా సమాఈ॥

పైన చెప్పిన దోహాలలో సద్గురు కబీరు సహజ సమాధి గురించి స్పష్టంగా తెలిపారు. ఈ సహజ సమాధి సర్వ సులభం. సాధారణ సాధకులు కూడ చేయగలిగిన స్థాయిలో ఉంటుంది. అందువల్ల దీనికి సహజ సమాధి అనే పేరు ఇవ్వబడింది. హఠ యోగ సాధనలు కష్టం. వీటి అభ్యాసము చేస్తూ సమాధి స్థితికి చేరుకోవడం కష్ట సాధ్యం. చిరకాల తపశ్చర్య షట్‌కర్మల శ్రమ సాధ్య సాధన అందరికీ తేలిక కాదు. అనుభవజ్ఞుడైన గురువు సమ్ముఖంలో సావధానంగా ఈ సాధనలు చెయ్యవలసి ఉంటుంది. అయినప్పటికీ సాధన మధ్యలో ఆపివేస్తే కష్టాలు ఎదురవుతాయి. కబీరు సహజ యోగానికి ప్రాధాన్యత ఇచ్చారు. సహజ యోగానికి తాత్పర్యం ఏమంటే- సిద్ధాంతమయ జీవనం, కర్తవ్యంతోకూడిన కార్యక్రమం కనుక ఇది చాల అవసరం. ఎందువల్లనంటే ఇంద్రియ భోగాలు, పాశవిక ప్రవృత్తులు అంతఃశత్రువుల వలన ప్రేరణ పొందిన ప్రజలు పూర్తిగా తమ కార్యక్రమాలను నిర్ధారించుకుంటారు. రకరకాల కష్టాలను అనుభవిస్తుంటారు.

సహజ సమాధి అసంఖ్యాకమైన యోగసాధనలలో ఒకటి. దీని ప్రత్యేకత ఏమంటే సాధారణ రీతిలో ప్రాపంచిక కార్యాలు చేస్తూ కూడ సాధనా క్రమం నడుపుకోవచ్చు. ఈ సాధకుడు జీవితమందలి కార్యాలు, కర్తవ్యాలు, యజ్ఞం, ధర్మం అన్నింటినీ ఈశ్వరీయ ఆజ్ఞాపాలనా దృష్టితో చేస్తాడు. అతనికి భోజనం చేస్తున్నపుడు భగవంతుడిచ్చిన శరీరాన్ని కాపాడు కోవడానికి భోజనం చేస్తున్నాననే భావన ఉంటుంది. శరీరానికి ఆరోగ్యకరమైన పదార్థాలను మాత్రమే ఎంచుకుంటాడు, రుచిని గురించి పట్టించుకోడు. కుటుంబ పాలన పోషణ సందర్భంలో తను పరమాత్మ యొక్క రమ్యమైన కుటీరానికి ఒక మాలిగా ఆలోచిస్తాడు. దీనిని ఎలా తీర్చిదిద్దాలో ధ్యానంలో ఉంచుకుంటాడు. కుటుంబ సభ్యులను తన సంపత్తిగా భావించడు. జీవనోపార్జనను అవసరాలను తీర్చుకోవడానికి ఈశ్వరుని చేత ఇవ్వబడిన ఒక పవిత్ర సాధనగా భావిస్తాడు. ధనవంతులకు ఏదో విధంగా ధనం సంపాదించాలనే తృష్ణ కలుగదు. మాట్లాడడం, అక్కడికి ఇక్కడికి వెళ్ళడం, అన్నపానాలు, నిద్ర, జీవనో పార్జన, ప్రేమ, ద్వేషం ఏ పనిచేసినా పరమార్థానికి, కర్తవ్యానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సమస్త కార్యక్రమాలు కూడా యజ్ఞరూపంలో జరుగుతాయి.

**ఏకాగ్రతలో శాశ్వతానందం లభిస్తుంది.**

ప్రతిపనిలో కర్తవ్య భావన ఉంటే ఆ కార్యాలు పుణ్యప్రదాలౌతాయి. సద్బుద్ధితో, సద్భావనలతో చేసే కార్యాల ద్వారా తనకి, ఇతరులకి సుఖము, శాంతి ప్రాప్తిస్తాయి. అట్టి సత్కార్యాలు ముక్తి ప్రదాలు, బంధనాలు కావు. సాత్వికత, సద్భావన, లోకసేవ అనే పవిత్ర ఆకాంక్షలతో జీవితాన్ని గడుపుతుంటే కొద్ది రోజులలోనే అటువంటి నీతి, అటువంటి కార్య ప్రణాలిక అలవాటైపోతాయి. అలవాటు అయిన వాటిపై ప్రీతి కలుగుతుంది. వాటిలో ఆనందం పొందుతారు. ఆ రుచిని కలిగి ఉండి, ఖర్చుతో కూడిన, హానికారకమైన మత్తు పదార్థాలు మదిర, గంజాయి, పొగాకు మొదలైనవన్నీ. కొద్దిరోజుల తరువాత చాల ఇష్టమైనవిగా అనిపిస్తాయి. తరువాత వాటిని ఎంత వదిలించుకుందామన్నా వదిలించుకోలేరు. తామసీ తత్వం కొద్ది కాలంలో అయిన అలవాటుకే ఇంత ప్రాణ ప్రియం కాగలిగినప్పుడు, సాత్విక తత్వం అంతకంటె అధికంగా ప్రాణప్రియం ఎందుకు కాకూడదు?

సాత్విక సిద్ధాంతాలను జీవనాధారం చేసుకోవడం, దానికి అనురూపంగా ఆలోచించటం, పనులు చేయటం వల్ల ఆత్మకు సద్భావంలో రమించటం అభ్యాసమవుతుంది. ఈ అభ్యాసం పరిపక్వమవుతూ ఉంటే సహజ యోగము యొక్క రసాస్వాదన జరుగుతూ ఉంటుంది. దానిలో ఆనందం కలుగుతుంది. అధికమైన పట్టుదల, శ్రద్ధ, విశ్వాసం, ఉత్సాహం సాహసం మొదలైన సిద్ధాంతాలలో జీవితాన్ని కొనసాగించాలి. అప్పుడు సహజయోగం యొక్క రసాస్వాదన జరుగుతుంది. అప్పుడే అతని స్థితికి స్థాయీ వృత్తి కలుగుతుంది, తన్మయత్వం కలుగుతుంది. దీనివల్ల ఉత్సాహం, సంతోషం అసాధారణ రీతిలో కలుగుతుంది. ఈ స్థితినే సహజయోగ సమాధి లేక సహజ సమాధి అని చెప్పబడుతుంది.

కబీరు అట్టి సమాధినే పైన చెప్పిన పదాలలో వివరించాడు. "గురు కృప సిద్ధించిన నాటినుండి అట్టి సమాధి స్థితి కలిగింది. ఆ స్థితి అలాగే స్థిరంగా నిలిచిపోయింది. మనస్సులో ఊగిసలాట లేదు. నేను కళ్ళు మూసుకుని, చెవులు మూసికొని కఠిన సాధనలు చేయడం లేదు. నేను కళ్ళు తెరచుకునే ఉన్నాను. నవ్వుతూ నవ్వుతూనే పవిత్రమైన పరమాత్మ సుందర రూపాన్ని చూస్తున్నాను. నేను మాట్లాడేదే నామ జపం; నేను వినేదంతా స్మరణమే; నేను తినేది త్రాగేది కూడా పూజే. ఇంటిని, అడవిని ఒకే విధంగా చూస్తున్నాను. అద్వైతాన్ని అర్థం చేసుకున్నాను. నేను ఎక్కడెక్కడికి వెళ్ళినా అది ప్రదక్షిణమే; నేను ఏమి చేసినా అది సేవయే. నేను నిద్రపోతే అది సాష్టాంగ నమస్కారమే. నేను ఒకరిని వదలి అన్య దేవతలను పూజింపను. మనస్సునందలి మలినమైన కోరికలను వదలి నిరంతరం శబ్దమందు, అంతఃకరణ యొక్క ఈశ్వరీయ వాణిని వినడంలో నిమగ్నమై ఉంటాను. ఈ నిష్ఠ వలన క్షణం కూడా నాకు మరపులేదు." కబీరు ఇంకా ఇలా అంటారు– "ఈ ఉన్మాద స్థితిలో హర్షానికి, శోకానికి స్థానంలేదు. దీనిని ప్రకటించడానికే పాడాను. సుఖదుఃఖాలకు అతీతంగా ఉన్న పరమ సుఖంలో ఓలలాడుతున్నాను."

సహజ సమాధిలో ఆయన శబ్దమందు నిమగ్నమై ఉంటాడు. భోగాలను, కోర్కెలను, క్షుద్రకార్యాలను త్యజించి ప్రతిక్షణం అంతఃకరణలో భగవంతుని గూర్చిన శబ్దాలనే వింటూ ఉంటాడు. సన్మార్గంలో నడవడానికి దైవసంకేతాలను చూస్తూ ఉంటాడు. వాటినే జీవన నీతిగా ఏర్పాటు చేసికుంటాడు. శబ్దమందే నిమగ్నమైన ఆసహజ యోగి సహజ సమాధిలో సుఖాన్ని అనుభవిస్తాడు. ఆయన ఉద్దేశ్యం ఎప్పుడూ ఉన్నతంగానే ఉంటుంది. దైవప్రేరణలకు కట్టుబడి ఉంటారు. అందువలన ఆయన చేసే సకలకార్యాలు పుణ్య ప్రదంగానే ఉంటాయి. చక్కెరతో చేసిన బొమ్మలు చూడడానికి ఎలా ఉన్నా తింటే తియ్యగానే ఉంటాయి. అదేవిధంగా మంచి ఉద్దేశ్యంతో చేసే పనులన్నీ చూడడానికి ఎలా ఉన్నా యజ్ఞమయమై పుణ్యాన్నే కలిగిస్తాయి. సత్య పరాయణులైన వ్యక్తులు చిన్న– పెద్ద పనులు ఏవి చేసినా, ఎక్కడకు వెళ్లినా, నిద్రించినా, తింటున్నా, చూస్తున్నా ఈశ్వరా రాధనయే అవుతుంది.

స్వల్ప ప్రయాసతో సమాధి యొక్క శాశ్వత సుఖం పొందాలనే కోరిక గలవారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనించేవారు జీవితంలోని ఉన్నతాశయాలపై దృష్టి సారించాలి. దైనిక కార్యక్రమములను సైద్ధాంతిక దృష్టితో నిర్ణయించు కోవాలి. భోగములను విడిచి యోగ స్థితిని పొందాలి. ఈ దిశలో ప్రగతిని సాధించినవారు లోకోత్తర సుఖంలోని రసాస్వాదన చేస్తారు.

★★★

*ఈ నెలలో కనీసం అయిదుగురు వ్యక్తులను పత్రిక చందాదారులుగా చేర్పించండి.*

సంకల్పసిద్ధిని సాధించడమే మనిషికి పెరుగుదల.

జీవించేకళ

# జీవితం పరమేశ్వరునికే అంకితం

ఉపాసన అంటే తనను తాను స్వయంగా భగవంతునికి అర్పించుకోవడమే. కోరికలతో ఉపాసించినా, కోరికలు లేకుండా ఉపాసించినా ఫలితం మాత్రం ఒక్కటే. కోర్కెలకు, ఉపాసనకు ఏమీ సంబంధముండదు. మనకు, భగవంతునికి ఏర్పడిన బంధం మాత్రం అమూల్య నిధి వంటిది.

భగవంతుని కెదురుగా నిలబడి తనకు కావలసిన కోర్కెలను తెలియ చేయడం, కోరుకోవడం తప్పేమీ కాదు. అది ఉపాసనను అవహేళన చేయడమూ కాదు. కాని మనం కోరే కోర్కెలు మాత్రం ఇతరులకు హాని కలిగించేవి కాకూడదు. పరమేశ్వరుడు అనుగ్రహిస్తాడో? లేదో? అని ఒక్క క్షణం కూడ సంశయించరాదు. విశ్వాసం అనేది ఎప్పుడూ ఒక్క క్షణం కూడ చెదిరిపోగూడదు. విశ్వాసమే మనలో అద్భుత శక్తిని, సహిష్ణుతను ఉత్పన్నం చేస్తుంది. విశ్వాసం వల్లనే మనం ఎల్లప్పుడు ఉద్విగ్నతకు లోనుకాకుండ ప్రశాంత చిత్తంతో అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాము.

ఇటువంటి స్థితిలోనే మనం కోరిన రెండు కోరికల్లో ఒక్కటి తప్పకుండ నెరవేరి తీరుతుంది. లేదా ఆ కోర్కెను మన హృదయం నుండి పరమేశ్వరుడు శాశ్వతంగా తుడిచివేస్తాడు. అప్పుడైనా మనకు లభించేది ప్రశాంతతే. అంతేకాకుండ కోరికల నిమిత్తమే అయినా మనం భగవంతుని ఎన్ని నెలలు, ఎన్ని రోజులు, ఎన్ని గంటలు మనస్సులో నిలుపుకుని ధ్యానించామో అంతకు రెట్టింపు అమూల్య సంపదను ప్రసాదిస్తాడు. అదే అనిర్వచనీయమైన ప్రశాంతత. సారాంశమేమంటే ఏకారణంగానైనా మనం భగవంతుని స్మరిస్తూ ఉండాలి.

పరమేశ్వరుని శక్తి అనంతమైనది. అపూర్వమైనది. మన బుద్ధే తర్కశీలమైనది. అపారమైన భగవంతుని ప్రభావానికి సంశయాత్మకమైన మన బుద్ధిలో స్థానం కల్పించకూడదు. మనం విశ్వసిస్తున్నామా? లేదా? అన్నది రెండవ మాట. కాని భగవంతుని అనంత సామ్రాజ్యంలోని విచిత్రాలు నశించిపోవు. సత్యం ఎప్పుడూ సత్యమే. మనం సత్యాన్ని నమ్మినా, నమ్మకపోయినా, గుర్తించినా, గుర్తించకపోయినా దానిలో ఏ మార్పూ రాదు. అందువలన దురభిమానాన్ని మన నుండి తొలగించడమే బుద్ధిమంతుల లక్షణం. ప్రభువు మీద మనలో ఏమాత్రం విశ్వాసమున్నా దానిని మరింత దృఢ పరచుకునే ప్రయత్నం చేయాలి. అదే మనందరికీ శుభకరమైన విషయము. దాని వలన మనకు భగవంతుని సామీప్యం లభిస్తుంది. ఏ కారణంగా చేసినా మనకు లాభాల పంట లభిస్తుంది.

ఉపాసకుడు ఉపాసనా సమయంలో కల్యాణ ప్రదమైన భావనలు కలిగి ఉండాలి. భగవంతునికి, తనకు అభేదాన్ని ఊహించుకోవాలి. అప్పుడే భగవంతునికి, భక్తునికి మధ్య పరస్పర ప్రేమభావం వెల్లివిరుస్తుంది. భక్తుడు దృఢమైన విశ్వాసంతో భగవంతుని ప్రార్థించాలి. అప్పుడే భగవంతుడు భక్తునికి వశమౌతాడు. ఒకరిని అనుగ్రహించడం, మరొకరిని తిరస్కరించడం అనేది భగవంతుని చర్యల్లో ఏనాడూ ఉండదు. అదంతా భక్తుని విశ్వాసం మీదనే ఆధారపడి ఉంటుంది. భగవంతుని ముందు అందరూ సమానులే. అయితే ఇది మాత్రం సత్యం. ఎవరైతే భగవంతుని కృపకు పాత్రులై ఆనంద జలధిలో ఓల లాడుతూ ఉంటారో వారిని పరమేశ్వరుడు ప్రౌఢపుత్రులుగా స్వీకరిస్తాడు. పరమాత్ముని స్నేహం కోసం తపనపడే వారిని అమాయకులుగా భావిస్తాడు. ఎందుకంటే వారు మట్టి బొమ్మలతోనే తృప్తి పడుతుంటారు.

నిజం చెప్పాలంటే భగవంతునితో నిష్కామ సంబంధాన్ని పెట్టుకొన్న వారే అసలు సిసలైన ఉపాసకులుగా భావింపబడతారు. భగవంతుని కోర్కెలు కోరడం అనేది అజ్ఞానమే అవుతుంది. మనకు కావలసిన వాటిని ఆయన అడగకుండానే ప్రసాదిస్తాడు. "మమతా మూర్తి అయిన కన్నతల్లి వలె పరమేశ్వరుడు కావలసినవన్నీ సమకూర్చుతూనే ఉన్నాడు. అటువంటప్పుడు ఇంకా అడగడం ఎందుకు?" అన్న భావాన్ని మనం బలపరచుకున్నట్లైతే ఎలాంటి లోటు మనకు స్ఫురించదు. ఒకవేళ ఏదైనా లోటుగా అనిపించినట్లైతే మనం ప్రభువుకు దూరమవుతున్నట్లుగా భావించాలి. భగవానుని సాన్నిధ్యం కొరకు వెదకులాట మొదలు పెట్టాలి. ఆ వెదకులాటలో ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక కారణంగా భగవంతునితో సంబంధం ఏర్పడి తీరుతుంది. దానిని పదిలపరచుకుంటూ దృఢపరచుకోవాలి.

★★★

జీవితం గూర్చి తెలుసుకుంటేనే - మరణం తర్వాత ఏమిటో తెలిసేది.

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-26

# గురుదేవుల కర్తవ్యనిష్ఠ

హరిద్వార్‌లో జరిగే సాధనా శిబిరాలలో గురూజీ గాయత్రీ సాహిత్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. దాని ప్రచారానికి పూనుకోవలసిందిగా ఉద్బోధించేవారు. గాయత్రీ తపోభూమిలో సాహిత్యాన్ని ప్రదర్శించవలసిందని చెపుతూ ఉండేవారు. అందుకే నన్ను శిబిర సమయంలో హరిద్వార్‌లో ఉండుమని చెప్పేవారు. ఒక పర్యాయం గురుదేవులు నన్నుపిలిచి, ఇప్పటివరకు వివిధ ప్రదేశాలలో జరిగిన యజ్ఞాలు చాలు అన్నారు. అయిదు కుండీలు, 24 కుండీలు, 51 కుండీలు, 108 కుండీలు, 1008 కుండీల యజ్ఞాలు ఇప్పటి వరకు జరిగాయి. మథురలో ఉండగా గురూజీ, నేను యజ్ఞాలు చేయించటంలో తీరుబడి లేకుండా ఉండేవారము. ఒకొక్కసారి రెండు నెలల పర్యంతం వివిధ ప్రదేశాలలో ఉండేవారము. ఒకసారి గురుదేవులు యజ్ఞం చేయిస్తుండగా, గురుదేవుల తల్లిగారు మరణించారు. ఆ వార్త వారికి తెల్పినా, యజ్ఞం పూర్తి అయ్యేదాకా వారు అక్కడనుండి కదలలేదు. ఇది జరిగింది రూర్కెలాలో.

రూర్కెలాలో నాకు గురూజీ తల్లిగారి మరణవార్త తంతి ద్వారా అందింది. అక్కడినుండి దుర్గికి బయలుదేరాము ఆ రాత్రి. అందుచేత అప్పుడు ఆవార్త గురూజీకి చెప్పలేదు. ఉదయం లేవగానే గురుదేవులకు వారి తల్లి మరణవార్త తెల్పాము. ఇప్పుడు ఏమి చేయాలో చెప్పమన్నాను. గురూజీ నిశ్శబ్దంగా కొంచంసేపు ఉన్నారు. మన కార్యక్రమంలో ఏ మార్పులేదన్నారు. 'మీరు మథుర వెళ్లరా'– అని అడిగాను. వెళ్లనని చెప్పారు. మూడుసార్లు మరణవార్త మూడు ప్రదేశాలకు– రూర్కెలా, దుర్గి, బాలాఘాట్‌లకు తెలిసింది. మా కార్యకర్తలకు అందరకూ తెలిసింది. నాకు వార్త తెలుసునని వారికి తెలియదు. దుర్గి స్టేషనులో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. యజ్ఞం పరిస్థితి అయోమయంలో పడింది. నేను బండి దిగగానే ఈవార్త నాకు చెప్పారు. ఆసంగతి నాకు తెలుసునని చెప్పాను. ముందుగా ఏర్పాట్లు జరిగిన విధంగానే అన్నీ జరుగుతాయని గురూజీ చెప్పారు. 'మేము మథుర వెళ్లడం లేదు. మీ యజ్ఞ కార్యక్రమాలు యథావిధిగా జరగుతాయి'– అని వారికి చెప్పాను. దుర్గిలో గురుదేవుల ప్రవచనం జరిగింది. అక్కడ నుండి బాలాఘాట్‌కు వెళ్లాము. అక్కడికి వెళ్లేసరికి కార్యక్రమం ప్రారంభమయింది. వీరేశ్వర్‌జీ మథుర నుండి వచ్చి 'గురూజీ మీరు మథుర రావాలి. మాతాజీ నన్ను పంపారు'– అన్నారు. 'ఈ కార్యక్రమాలు ఇదివరకే నిర్ణయింపబడ్డాయి. చాలా పనులు చేయబడి ఉన్నాయి. మధ్యలో ఆపితే వారికి ఇబ్బంది కల్గుతుంది' –అన్నారు గురూజీ. వీరేశ్వర్‌తో 'మీరే గురూజీకి నచ్చ జెప్పా'లని చెప్పాను. మా అందరిలో వీరేశ్వర్‌జీ నచ్చ చెప్పటంలో మేటి, ఆయన అన్ని రకాలుగా గురూజీని ఒప్పించడానికి ప్రయత్నం చేశారు. కాని గురూజీ వినలేదు. ఆయనను మథుర తిరిగి పంపారు. "తపోభూమిలో ఓంప్రకాశ్ ఉన్నారు, సతీష్ ఉన్నారు. నేను వచ్చి చేసేదేముంది? అన్నీ మాతాజీ పర్యవేక్షిస్తారు"– అన్నారు గురూజీ. ఒకనెల తర్వాత మేము మథుర వెళ్లాము. మా కార్యక్రమం రెండునెలలకు సరిపడావుంది. అంతా పూర్తి చేసికొని వెళ్లాము. 'మాతాజీ నన్ను కోపగించుకొంటారేమో'– అన్నాను గురూజీతో. 'అంతా నేను చూసుకుంటాను. మాతాజీకి బాగా తెల్సు మన పని మనం సవ్యంగా చేయడంలోనే మన ధర్మం ఉందని. అదే మన మతం. మనం వెళ్లకపోతే ఎన్ని యజ్ఞాలు ఆగిపోయేవి. ఏర్పాట్లన్నీ పాడైపోయేవి.'– అన్నారు. "మనం మన శరీరానికి ఎంత ప్రాముఖ్యం ఇస్తామో, మన పనులకు అంతే ప్రాముఖ్యం ఇవ్వాలి. తప్పులు జరగకుండా చూసుకోవాలి. చెడు ప్రవృత్తులకు దూరంగా ఉండాలి. సోమరులుగా ఉండకూడదు. నిర్విరామంగా పని చేయడమే మన మతం. మన కుటుంబాలలో మన సంస్కృతిని నేర్పాలి. అదే మన మతం. సాంఘిక దురాచారాలను తొలగించడమే మన మతం. పూజలు, జపం, కర్మలు చేయడం, యజ్ఞాలు చేయడం, యాత్రలు జేయడం అన్నీ మన మతానికి మెట్లు మాత్రమే. రామాయణ పాత్రలన్నీ కర్తవ్య పరాయణత్వాన్నే బోధిస్తున్నాయి. అందుకే రామాయణం ప్రతి ఇంటికీ చేరింది. ఇప్పటి వరకూ మనం ఎన్నో యజ్ఞాలు చేశాము. అన్నీ పెద్ద పెద్ద ప్రదేశాలలో జరిగాయి. ఇక ఇప్పుడు పల్లెలలో జరగాలి. పల్లెల నిర్మాణం జరగాలి. మన కార్యకర్తలతో చర్చించేటప్పుడు, ఈ విషయం చెప్పాలి. కొంతమందిని కలిపి, పల్లెలకు పంపాలి. అక్కడ గోడలపై మన సందేశాలను వ్రాయించాలి. ఒక్క సందేశమైనాలేని ఇల్లు ఉండరాదు. మన ఆహారం మనమే తీసుకొని వెళ్లాలి. అక్కడ ఏర్పాట్ల కోసం చూడరాదు. నాలుగు రోజుల కార్యక్రమం తయారు చేసుకొని సైకిళ్లపై పోవాలి."– అని సూచించారు గురూజీ.

★★★

ఇంటిని చక్కదిద్దలేని ఇల్లాలు, సంఘాన్ని సరిచేయలేదు.

మహిళా జాగరణ

# మహాకాలుని సంకల్పం-21వ శతాబ్దం-నారీ శతాబ్దం-2

ఈ సమయంలోనే భారతదేశంలో పాలనాధికారం శ్రీమతి ఇందిరాగాంధి చేతికి చిక్కింది. ఆమె యొక్క ఆలోచనవల్ల నేర్పు వల్ల భారతదేశంలో మహిళా వికాసం విస్తరించింది. 1967లో ఇరాన్ వంటి ఘోషా పద్ధతిని పాటించే దేశంలోని మహిళలు కూడ కుటుంబపోషణకై భర్త అనుమతి లేకుండానే ఉద్యోగాలు చేయవచ్చునన్న చట్టం వచ్చింది. 1968లో మానవహక్కుల గురించి చర్చిస్తూ యు.ఎన్.ఒ. టెహరాన్‌కు ప్రచారం చేసే అవకాశాన్ని కల్పించింది. ఈ సమావేశంలో ప్రపంచ మహిళలందరికీ న్యాయం జరిగేలా అసమానతలు తొలగిపోవాలని సంకల్పించారు. 1970 పూర్వార్ధంలో "టేక్ బ్యాక్ ద నైట్" అన్న నినాదంతో ప్రచారం ప్రారంభమయింది. దీనిద్వార ప్రపంచ మహిళల అభివృద్ధి గురించిన ఆలోచనలు ఊపందుకున్నాయి. 1974లో ప్రపంచదేశాల ప్రముఖులందరూ ఒకే త్రాటిమీదకు వచ్చారు– "అత్యవసర పరిస్థితిలోనైనా సరే, శాస్త్రాలను ధిక్కరించైనా సరే మహిళావృద్ధి జరిగి తీరాలి."

పై విధంగా మహిళ వికాసం చెందుతూ చెందుతూ1975 నాటికి ఆ సంవత్సరమంతా అంతర్జాతీయ మహిళా వత్సరంగా జరుపుకునే స్థితికి చేరుకున్నది. ఆ సంవత్సరమంతా మహిళా వికాసం, శాంతి, సమతల కోసం మెక్సికో ప్రకటన పత్రాన్ని వెలువరించింది. దానితో పాటు ప్రపంచదేశాలు చాలవరకు మహిళా సంస్థలను, కార్యయోజనలను ఏర్పాటుచేశాయి. 1976లో బెల్జియంలో మహిళలకు విరుద్ధంగా జరిగే అపరాధాలకు న్యాయాన్ని కోరుతూ ఉద్యమం నడిచింది. దానిలో దాదాపు 40 దేశాల నుండి 2000ల మంది మహిళాప్రతినిధులు పాలుపంచుకున్నారు. 1976 నుండి 1985 వరకు గల 10 సంవత్సరాలను మహిళావికాసానికే ఉపయోగించాలని యు.ఎన్.ఒ. ప్రకటించింది.

మహాకాలుని చైతన్యం, క్రియాశీలత విచిత్రంగా ఉంటాయి. మానవ సమాజంలో కలిగే మార్పుల ద్వారా సృష్టిలో వ్యాపించి ఉన్న సమస్యలను తీర్చి, అసంభవాన్ని సంభవంచేయగల సమర్థత గలవి. అవి కుళ్లిపోయిన ఆచారాలను, శిథిలమైపోయిన సమాజ భవనాన్ని నేలమట్టంచేసి, అదే స్థానంలో నూతన సృష్టి చేసి, శాశ్వత ప్రయోజనాలను కలిగించగలవు. విశ్వ ప్రగతిని సాధించగల విశ్వాత్మ ఇదియే. విశ్వాత్మ నివాస స్థానం అంతఃకరణయే. సర్వత్రా సంచరించే శక్తి దానికున్నది. దీని ఆవేశమే తనను తాను కాలగమనంలో కలుపుకుంటుంది. కాలం నుండి ప్రేరణపొంది, సరియైన మార్గం చేరుకోగానే కాలం, శక్తి రెండూ కలసి విశ్వాత్మను చేరదీస్తాయి. దాని ఫలసిద్ధి కోసం ప్రయత్నం జరుగుతుంది. మహాకాలుడు స్వయంగా ఈ పగ్గాలను పట్టిలాగగానే ప్రపంచ శక్తులన్నీ ఒక్కచోట చేరి సంకల్ప సిద్ధిని కలిగిస్తాయి. మానవుడు సహకరించినా, సహకరించకపోయినా, పనిమాత్రం ఆగదు.

"21వ శతాబ్ది నారీశతాబ్ది" –అన్న సంకల్పం మహాకాలునిదే. సృష్టికి మూలమైన స్త్రీకి గౌరవ మర్యాదల్ని అప్పగించే ప్రయత్నం 1979లో జరిగింది. స్త్రీపట్ల అనుసరిస్తున్న భేదభావాల్ని రూపు మాపడానికే అంతర్జాతీయ సమ్మేళనం ఏర్పాటుచేయబడింది. ఈ సమావేశంలో మహిళా జాగృతితోపాటు ప్రతి రంగంలో సమానాధికారం ప్రాప్తింపచేయాలని ప్రపంచ ప్రముఖులంతా నడుంకట్టారు. 1980 జూలై 14 నుండి 19 వరకు 'కోపెన్ హేగన్'లో ప్రపంచస్థాయిలో 5 రోజుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో కార్యయోజనను రూపొందించారు.

మూడు సంవత్సరాల తర్వాత 1983లో నెదర్లాండులో స్త్రీల వైవాహిక సమస్యలపై బ్రహ్మాండమైన కార్యశాల ఏర్పాటు చేయబడింది. సమాజ స్థితిగతులను, మానసిక స్థితిగతులను బట్టి వారాలతరబడి చర్చించారు. సమస్యలను విశ్లేషించి సమాధానాలను కనుగొన్నారు. 1985లో స్త్రీలపై జరుగుతున్న అమానుష చర్యల నివారణకు సంధి కుదిరింది. అదే సంవత్సరం నైరోబిలో జూలై 15 నుండి 26 వరకు మహిళా ఉన్నతిని రణనీతిగా మార్చాలన్న ప్రయత్నం కొనసాగింది. రాబోయే శతాబ్ది నారీ సమాజ సూత్రధారి తనవంతు పాత్రను సఫలం చెయ్యగలగాలి.

1990లో నవంబరు 25 నుండి డిసెంబరు 10 వరకు స్త్రీలపై హింసను వ్యతిరేకిస్తూ 16 రోజులపాటు ప్రపంచ స్థాయిలో ప్రదర్శనలు

**చిలుము ఇనుమును తినివేస్తుంది - పాపం మనిషిని తినివేస్తుంది.**

జరిగాయి. అన్నిచోట్లా కలసిమెలసి ఇచ్చిన ప్రదర్శనల్లో దాదాపు ప్రపంచ మహిళలంతా భాగస్వాములయ్యారు. ఈ ప్రదర్శనలు అందరికీ కనువిప్పు కలిగించాయి. స్త్రీ వస్తువు కాదు వ్యక్తి అనీ, పురుషునితో పాటు అన్నింటా అర్హులని అర్థం చేసుకున్నారు.

మహిళాజాగృతి విషయంలో స్త్రీలకు న్యాయాన్ని కోరడం జరిగింది. 5 లక్షల మంది సంతకాలతో విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. అప్పటి వరకు వ్యతిరేకించిన ప్రభుత్వం కూడ స్త్రీలకు అనుకూలంగా చట్టం చేసింది. 1993 డిసెంబర్‌లో అత్యధిక ధనిక దేశాల అధ్యక్షులలో న్యూఢిల్లీలో శిఖరాగ్ర సమావేశం జరిగింది. దానిలో స్త్రీ విద్య గురించి ప్రత్యేకంగా చర్చించబడింది.

డిసంబరు 20వ తేదీన యు.ఎన్.ఒ మానవహక్కుల పరిరక్షణకై ఒక కమీషన్ వేసింది. ఆ కమీషన్ 10 సంవత్సరాల వరకు కార్యయోజన సిద్ధం చేసింది. ఈ యోజనలో ప్రధాన అంశం మహిళావికాసం. మరు సంవత్సరం 1994 ఫిబ్రవరి నుండి మార్చి వరకు చేసిన కృషి ఫలితంగా దక్షిణాఫ్రికాలో రంగుభేదం లేకుండా మహిళలందరికీ ఓటుహక్కు లభించింది. ఇదే నెలలో ఆసియా పసిఫిక్ క్షేత్రంలో మహిళావికాసం కోసం జకార్తా ప్రకటన పత్రాన్ని జారీచేశారు. సెప్టెంబరు 5 నుండి 13 వరకు ఈజిపు రాజధాని కైరోలో జనసంఖ్య నియంత్రణ-వికాసం గురించి ఒక అంతర్జాతీయ సమ్మేళనం జరిగింది. దానిలో గర్భనిరోధ విషయంలో స్త్రీలకే అధికారం ఇవ్వబడింది.

1995 మార్చి 11, 12 తేదీలలో సామాజిక వికాసాన్ని గురించి కోపేన్‌హేగన్ లో ప్రపంచ శిఖరాగ్ర సమావేశం జరిగింది. దీనిలో దారిద్ర్యనివారణతో పాటు వ్యవసాయాభివృద్ధికి మహిళల పాత్రపై చర్చించడం జరిగింది. ఇదే సంవత్సరం సెప్టెంబరు 4 నుండి 15 వరకు చైనా రాజధాని బీజింగ్‌లో యు.ఎన్.ఒ ద్వారా 4వ అంతర్జాతీయ సమ్మేళనం ఏర్పాటు చేయబడింది. వికాసం-సమానతల గురించి పంచవర్ష యోజన తయారు చేయబడింది.

ఇదే సంవత్సరం నవంబరు నెలలో అఖిల విశ్వగాయత్రీ పరివార్ ద్వారా సంస్థాపకుని జన్మస్థలంలో ప్రథమ పూర్ణాహుతి మహోత్సవం బ్రహ్మవాదిని మహిళల ద్వారా నిర్వహించబడింది. స్త్రీలు అన్ని కార్యక్రమాలలో పాల్గొనగల్గడమే కాకుండా

## కల్పవృక్షపునీడ

*పూజ్యగురుదేవులను ముగ్గురు దేవతలు ప్రతిక్షణం సంరక్షిస్తూ ఉంటారు. మాతృరూపంలో గాయత్రీమాత కామధేనువు యొక్క పాలను త్రాగిస్తుంటుంది. పితృరూపంలో హిమాలయం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంటుంది. గురువు రూపంలో ఒకానొక మానవాతీత సిద్ధపురుషుడు మార్గదర్శనం చేస్తూ ఉంటాడు. గురుదేవులు వారిని "మాష్టర్" అని చెపుతుండేవారు. ఈ ముగ్గురే వారికి సహాయకులు, సంరక్షకులు, ప్రేరణకర్తలు. వారు ఈ ముగ్గురినీ అమృతం, పరుసవేది, కల్పవృక్షం అంటుండేవారు. తన మార్గదర్శిని వారు సాక్షాత్తు కల్పవృక్షంగా చెపుతూ ఉండేవారు. తన గురుదేవులు తన యొక్క శతాబ్దాల సాధనాశక్తిని ఉపయోగించి తనను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పేవారు. అటువంటి సద్గురు రూపంలో ఉన్న కల్పవృక్షం తన చల్లని నీడలో కూర్చుండబెట్టుకుని అద్భుతశక్తిని ప్రసాదించినట్లు ఎంతో కృతజ్ఞతాభావంతో చెప్పేవారు.*

*-పరమ వందనీయ మాతాజీ.*

*(ఉద్ధత్- వా.ఖండ్ 1,5, 23-24)*

నిర్వహించగలరన్న సత్యం బయటపడింది. బ్రహ్మవాదినీ స్త్రీలు విరాట్ అశ్వమేధాన్ని కూడ నిర్వహించారు. దీనిని బట్టి భారతదేశంలో గార్గీ, మైత్రేయి, అపాలా మొదలైన వారి వారసత్వం మిగిలి ఉందని అర్థమయింది. ఆర్థిక, రాజకీయ విషయాలతోపాటు ఆధ్యాత్మికత కూడ తొణికిసలాడుతూనే ఉంది.

"21వ శతాబ్ది నారీశతాబ్ది" అని కదా మహాకాలుని సంకల్పం. అది తప్పక జరిగితీరుతుంది. స్త్రీలు సాహసోపేతంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. స్త్రీలు శక్తిహీనులుకారు. ఆ విషయం మరువరాదు. సంకల్పసిద్ధికోసం శ్రమించాల్సిన సమయం ఇదే. నారి తనదైన ఈ శతాబ్దాన్ని సఫలం చేసుకుంటుంది. నారీ శక్తి యుగశక్తిగా మారితీరుతుంది. మహాకాలుని సంకల్పం నెరవేరి తీరుతుంది.

★★★

**నీచాశ్రయం న కర్తవ్యం - కర్తవ్యం మహదాశ్రయం.**

ధారావాహిక : దివ్యజీవన దర్శనం-55

# సరికొత్త వెలుగులో-1

## తిరుపతి నుండి కంచికి

ఆదిశంకరులు స్థాపించిన మఠాలలో కంచి కామకోటి పీఠం ప్రతిష్ఠలో, వైభవంలో అగ్రగణ్యమైనది. అక్కడ పీఠాధిపతుల పరంపర దాదాపు అవిచ్ఛిన్నమైనది. ఆ పీఠాధిపతుల విద్వత్తూ, తపస్సూ కూడ సాటిలేనివి. ఇతర మఠాల అధిపతుల విద్వత్తూ, తపస్సూ కొద్దిపాటివి కావు. కంచి పీఠానికి ప్రఖ్యాతి, వైభవం లభించడానికి ప్రముఖ కారణం అక్కడి పరంపరలో విచ్ఛిన్నత, లేకపోవడం కావచ్చు. ఇతర మఠాలపై ఏదో ఒక కాలంలో ఆకతాయులు, మతాంధులూ అయిన పాలకులు అత్యాచారాలు జరిపారు. కొన్ని మఠాలపై అనేకమార్లు జరిగాయి. ఈ అత్యాచారాల వల్ల మఠాలు విధ్వంసమయ్యేవి. కొన్ని సమయాలలో మఠాలకు అధిపతులే లేరు.

మరో విశేషం ఏమంటే– కంచి పీఠం ఆదిశంకరులు స్థాపించినది కాదని పలువురు విద్వాంసులు భావిస్తున్నారు. ఆదిశంకరులు బదరీనాథ్, ద్వారక, పూరీ, శృంగేరిలలో మఠాలు స్థాపించడం బహుళ ప్రచారం పొందిన వాస్తవం. ఆ మఠాలకు తమ నలుగురు శిష్యులను అధిపతులను చేశారు. తమ తమ క్షేత్రాలలో ధర్మ సంస్కృతుల విజయ పతాకాన్ని ఎగురవేసే బాధ్యలను వారికి అప్పగించారు. పలువురు విద్వాంసులు అయిదవ మఠం అస్తిత్వాన్నే గుర్తించారు. అయితే కంచి మఠం యొక్క అస్తిత్వం నేడూ ఉన్నది, గతంలోనూ ఉన్నది. ఇది నగ్న సత్యం. ఆదిశంకరులు మఠాలు నాలుగింటికీ తన శిష్యులను అధిపతులుగా నియమించారనీ, ఆయన స్వయంగా కంచిలో నివసించసాగారనీ ఆ మఠ సంప్రదాయం చెపుతోంది. ఆయన తమ జీవితంలోని చివరి సంవత్సరాలు కొన్నింటిని అక్కడే గడిపారని ఆ సంప్రదాయం ప్రకటిస్తోంది. ఆదిశంకరులు కంచిలోనే సిద్ధిపొందారన్నది మరో విశ్వాసం. ఈ అభిప్రాయాన్ని మన్నించేవారి సంఖ్య తక్కువే.

కంచిలో ప్రవేశించినప్పుడు శ్రీరామ్‌కు ఈ వాస్తవాలు తెలుసు. తిరుపతినుండి కంచికి వచ్చే మార్గంలో పీఠంలోని అనేక విశిష్టతలు వినవచ్చాయి. కంచీపుర నిర్మాణం ఆధ్యాత్మిక దృష్టితో జరిగిందన్నది ఈ చర్చలలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన అంశం. తిరుపతినుండి ఆయనతోపాటు వస్తూన్న మహాత్మా శివానంద స్వామి అనేక నిగూఢ ఆధ్మాత్మిక రహస్యాలను తెలిపారు. ఆయన కంచి కామాక్షి అమ్మవారికి పరమ భక్తుడు. దక్షిణ భారతంలోని ఒక అడవి ప్రాంతంలో ఆయన నివసిస్తున్నారు. ప్రతి పూర్ణిమకూ కామాక్షిని దర్శించాలన్నది ఆయన చేపట్టిన వ్రతం. అప్పుడు అందుకోసమే ఆయన కంచికి వస్తున్నారు. ఆదిశంకరులు కంచిని నిర్దిష్టమైన నిర్మాణ పద్ధతి ప్రకారం రూపుదిద్దారని ఆయన తెలిపారు. ఆ వాస్తు విద్య ప్రస్తావన ఏ శాస్త్రంలోనూ లేదు. ఆదిశంకరులు స్వయంగా తమ అంతర్ దృష్టితో దాని స్వరూపాన్ని నిర్ణయించారు. అందువల్ల, నగరంలో ధార్మికతతో, ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణం నిర్మాణంకావడం వల్ల– అక్కడికి వెళ్లేవారి మనస్సులలో సాత్విక భావాలు ఉదయిస్తాయి. యాత్రికుల మనస్సులు సునాయాసంగా ధర్మ కార్యాలవైపు మొగ్గుతాయి.

## కామాక్షి ఆలయం విశిష్టత

కంచి నగరానికి కేంద్ర బిందువు కామాక్షి ఆలయం. ఆ ఆలయాన్ని ఆధారంగా చేసుకుని, ఆదిశంకరులు ఆ నగరం రూపురేఖలను తీర్చిదిద్దారు. శ్రీ చక్రాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన నగరాన్ని రూపుదిద్దారు. నగరాన్ని శ్రీ చక్రం ఆకారంలో నిర్మించారు. ఆ తీర్థాన్ని ఆధ్యాత్మిక దృష్టిలో సజీవంగా ఉంచడానికై ఆయన అనేక నిర్మాణాలను చేశారు, అనేక సంప్రదాయాలను ప్రారంభించారు. ఆదిశక్తి పార్వతికి మరో రూపం కామాక్షి, కామాక్షి పూజ– ఆరాధన కోరికలను తీర్చుతుంది, ఆత్మిక లక్ష్యంవైపు పయనించడానికి ప్రేరణ ఇస్తుంది.

ఆదిశంకరులు కైలాస మానస సరోవరం నుండి తెచ్చిన 'యోగ లింగాన్ని' ఇక్కడ స్థాపన చేశారు. ఈ విగ్రహాన్ని పూజించే అధికారం నైష్ఠిక బ్రహ్మచారులకు మాత్రమే ఉంది. ఆ పూజ కోసం ఆదిశంకరులు కొత్త శిష్యుణ్ణి మఠాధిపతిగా నియమించారు. ఆయన తమ ప్రధాన శిష్యుడయిన సురేశ్వరాచార్యను ఈ పీఠానికి అధిపతిగా నియమిస్తారని జనం అనుకున్నారు. సురేశ్వరాచార్యులు గృహస్థం

కర్తవ్యపాలనే కాదు - జీవిత పరిపూర్ణతనూ సాధించాలి.

తర్వాత సన్యాసం తీసుకున్నారు. ఆయన బాల బ్రహ్మచారి కారు. కనుక ఆదిశంకరులు ఆయనను ఈ పీఠానికి అధిపతిగా నియమించలేదు.

మోక్ష నగరాలు ఏడింటిలో కంచి ఒకటి. ఆది శంకరులు కంచిలో వేయి ఆలయాలను నిర్మింపజేశారు. ఆ ఆలయాలలో పదివేలకుపైగా శివలింగాలు స్థాపించబడ్డాయి. ఇప్పుడు 200 ఆలయాలయినా లేవు. కాలమూ మారింది. విదేశీ దండయాత్రలు మిగతా ఆలయాలను ధ్వంసం చేశాయి.

శ్రీరామ్ ఈ ఆలయాలవద్ద హెచ్చు సమయం గడపలేదు. ఆయన కైలాసనాథ ఆలయానికి వెళ్లారు. దేశంలోని అతి ప్రాచీనమైన ఆలయాలలో అది ఒకటి. 8వ శతాబ్దంలో పల్లవ రాజు నిర్మింపజేసిన ఈ ఆలయంలో శివ– పార్వతి మనోహర విగ్రహం ఉంది. నృత్యం చేస్తూన్న గౌరీ శంకరులను విష్ణుమూర్తి, బ్రహ్మ చూస్తూ ఉంటారు. పోటీ జరుగుతోందనీ, ఆ దేవతలు ఇద్దరూ న్యాయనిర్ణేతల పాత్ర వహిస్తున్నారనీ అనిపిస్తుంది. ఆలయంలోని వాస్తు శిల్పం ప్రేక్షకుల దృష్టిని కట్టిపడవేస్తుంది. ప్రేక్షకులు తమ చూపులను దానినుండి మళ్లించలేరు.

## ప్రపంచం ఈశ్వరుని నృత్యం

కైలాసనాథ ఆలయాన్ని దర్శించి, శ్రీరామ్ కామాక్షి ఆలయంవైపు వెళుతున్నారు. త్రోవలో ఒక భక్తుడు మధురమైన స్వరంతో గానం చేస్తూన్న కీర్తన వినవచ్చింది. ఆ కీర్తన ఇస్తూన్న సందేశం ఇది–

ప్రపంచం పరమేశ్వరుని కృతి కాదు. అది నృత్యంవంటి రచన. ఆయన నృత్యం చేస్తూన్నప్పుడు క్రీడ కానవస్తుంది. ఆయన ఆగినప్పుడు సత్తా స్థిరం అయిపోతుంది. కృతిని కృతికర్తనుండి విడదీయవచ్చు. విగ్రహాన్ని శిల్పినుండి విడదీయవచ్చు. అయితే సృష్టి పరమేశ్వరుని నుండి వేరు కాదు. అదేవిధంగా నృత్యం నర్తకునినుండి వేరు చేయలేము.

ఈ సందేశం నిగూఢమూ, గంభీరమూ అయినది. సందేశం కన్న మిన్నగా మనస్సును ఆకట్టుకున్నది ఆ కంఠం, ఆ కంఠం నుండి వెలువడుతూన్న స్వరం.

కామాక్షి ఆలయంలో పార్వతీ దేవి ఎదుట నిలబడి శ్రీరామ్ ఆ స్తోత్రంలోని భావాన్ని నెమరువేసుకున్నారు. అక్కడనుండి ఆయన మఠంలోకి వెళ్లారు. మఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారికి కబురు పంపారు. కొద్దిసేపటిలో పిలుపు వచ్చింది. జనం స్వామివారికి దూరంనుండి ప్రణామం చేస్తున్నారు. స్వామివారు ఎవ్వరినీ తమ పాదాలను తాకనివ్వరు. ఆయన ప్రజలను తమ సమీపానికే రానివ్వరు. సన్నగా, పొడుగుగా ఉన్న ఆయన శరీరం తపస్సుతో పండి ఉన్నది. ఆయన వ్యక్తిత్వంనుండి వెలుగు ప్రసరిస్తోంది. ప్రజలతో పాటు శ్రీరామ్ ఆయనకు ప్రణామం చేశారు. స్వామివారు కూర్చోవలసిందిగా ఆయనకు సైగ చేశారు. ఆయన సంస్కృతంలోనే కుశల ప్రశ్నలు వేశారు. ఆయనకు హిందీ వచ్చు. అయితే ఆయన సంస్కృతంలోనే తన భావాలను మరింత చక్కగా వ్యక్తం చేయగలుగుతారు. స్వామివారు శ్రీరామ్ వేష ధారణను నిశితంగా పరిశీలించి ఇలా అన్నారు–

"మీరు కూడా మోహనదాస్ అనుచరులా?"

మోహనదాస్ అనడంలో ఆయన ఉద్దేశించింది మహాత్మా గాంధీని. స్వరాజ్య ఉద్యమాన్ని ప్రారంభించే ముందు బాపు స్వామివారిని కలుసుకున్నారు. దేశాన్ని అవగాహన చేసుకునేందుకై ఆయన గ్రామ గ్రామాన్ని పర్యటిస్తున్నారు. స్వామివారితో జరిగిన చర్చలో ఆయన తన భావి పథకాన్ని ప్రస్తావించారు. ఉద్యమం అధికారపు మార్పుకోసం మాత్రమే నిర్వహించకూడదనీ, స్వరాజ్యం అంటే అర్థం మన జాతికీ, సంస్కృతికీ గౌరవాన్ని కల్పించడమనీ స్వామివారు ఆయనతో అన్నారు. మహాత్మా గాంధీ భారత్‌కు తిరిగి వచ్చిన కొద్ది సంవత్సరాల లోపల ఈ సమావేశం జరిగింది. సమావేశం సమయంలో ఆయన మోహనదాసు మాత్రమే. స్వామివారు ఆయనను ఆ పేరుతోనే గుర్తుచేసుకున్నారు. గాంధీజీ ఉద్యమంలో అనంతర కాలంలో స్వదేశీ, భారతీయత, స్వధర్మం వంటి భావాలు మిళితమైనాయి. ఈ చేర్పు ఆయన ఆత్మ ప్రేరణ కారణంగానే జరిగింది. అయినా– ఆయన హృదయాన్ని స్పర్శించిన మహనీయులలో స్వామివారు ఒకరు. మహాత్మాగాంధీ తమ ఆత్మకథలో ఈ వాస్తవాన్ని పరోక్షంగా ప్రస్తావించారు.

గాంధీగారి అనుచరుడవా?– అని స్వామివారు ప్రశ్నించినప్పుడు, ఆయన 'అవును' అని కాని, 'కాదు' అని కాని చెప్పలేకపోయారు. సామాజిక, రాజకీయ చర్యల వెనుక తపస్సు, సాధనల బలీయమైన ప్రవాహాలు కూడ ఆయన చిత్తంలో ప్రవహిస్తున్నాయి. దీన్ని గమనించి ఆయన మౌనం వహించారు.

ఎటూ తేల్చుకోలేని ఈ స్థితిని స్వామీజీ గుర్తించారు. ఆయన ఇలా అన్నారు–

"మోహనదాస్‌కు రాజకీయ కార్యం ప్రథమ స్థానం వహిస్తుంది. మతం, సాధన ఆయనకు వ్యక్తిగత విషయాలు, ఆంతరిక విషయాలు. కానీ, మీ దృష్టి వేరుగా ఉండవచ్చు.

**ఒకరిని జీవింపచేసినపుడే తాను జీవించినట్లు అవుతుంది.**

వ్యక్తిగతము, సామాజికమూ- రెండు రంగాలలోనూ విధి మీలో ధర్మధారణకే ప్రాధాన్యం ఇచ్చింది.

స్వామివారి విశ్వాసం శ్రీరామ్‌ను పులకింపజేసింది. తన సాధనకు, భావి మహత్కార్యానికీ సిద్ధ యోగుల సమర్థన ఉన్నదని, ఆయనకు తెలుసు. ఈ లక్ష్యం కోసమై సూక్ష్మ జగత్తులో సహకారం, సమర్థన వర్షిస్తున్నాయని ఆయనకు తెలుసు.

స్వామివారితో వివిధ అంశాలపై స్వేచ్ఛగా చర్చ జరిగింది. సంప్రదాయం, శాస్త్రాలు, మీమాంస, ఆధునిక పరిస్థితులు- అన్నీ ఆ చర్చలో వచ్చాయి.

మహాత్మా గాంధీగారి హరిజనోద్ధరణ కార్యక్రమం ఆరోజుల్లో వివాదాస్పద విషయం అయింది. ఈ విషయమై స్వామివారి అభిప్రాయాన్ని తెలుసుకునే దృష్టితో శ్రీరామ్ ఇలా అడిగారు-

"మనిషి ఒక కులంలో, ఒక వర్గంలో జన్మించిన కారణంగా ఉన్నతుడు- నీచుడు అవుతాడా?"

## సంప్రదాయ దృక్పథం

స్వామివారు ఉన్నత శ్రేణికి చెందిన సంత్, తపస్వి. ఈ సామాజిక సమస్యలపై ఆయన అభిప్రాయం ఎంతో విలువైంది. ఈ కారణంవల్ల కూడ శ్రీరామ్ ఆ ప్రశ్న అడిగారు. స్వామివారు ఇలా సమాధానం చెప్పారు-

"వ్యక్తి ఉన్నత శ్రేణికి, నీచ శ్రేణికి చెందిన వాడుగా పరిగణించ బడడానికి గల కారణాలలో వంశం, కులం కూడ ఉన్నాయి."

శ్రీరామ్ ఇలా అడిగారు-

"ఏదో ఒక కుటుంబంలో జన్మించినంత మాత్రాన వ్యక్తి శూద్రుడు కాని, మహనీయుడు కాని కావచ్చు. దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటి?"

స్వామివారు ఇలా జవాబిచ్చారు-

"ఈనాటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ రహస్యాన్ని అర్థం చేసుకోలేము. మన ఋషులూ మునులూ ఆధ్యాత్మిక ఉన్నతి కోసం రకరకాల అన్వేషణలు జరుపుతూన్న రోజులలో చేతనను నిరంతరం- జన్మ జన్మాంతరాలవరకు- సంస్కరించడానికై వర్ణముల, కులముల నియమం ఏర్పరచబడింది. ఆరోజుల్లో దాని ప్రయోజనం ఉండేది. నేడా ప్రయోజనం లేదు."

శ్రీరామ్ ఇలా ప్రశ్నించారు-

"వర్ణం ఆధారంగా కాని, కులం ఆధారంగా కాని ఉచ్చ నీచాలను నిర్ణయించడంవల్ల సమాజానికి ప్రయోజనం ఏముంది?"

### సాధకుని కేంకావాలి?

*మనస్సునిండా వికృత ఆలోచనలు, హృదయంనిండా నిష్ఠురభావాలు, కలుషితమైన రక్తం, అస్తవ్యస్తమైన భోజనం ఉన్నట్లైతే శరీరంలోని ప్రతి అణువు విషాణువులతో నిండిపోతుంది. ఆ పరిస్థితిలో విలువైన వస్త్రాలు, గంధాది లేపనాలు, అత్తర్లు-పన్నీర్లు మొదలైన ఉపచారాలన్నీ వ్యర్థం. విలువైన నగలు ధరించడం లాంటివి ఎన్ని చేసినా ప్రయోజనం లేదు. కాని ఎవరైతే సంపూర్ణమైన ఆరోగ్యంతో అందంగా కనిపిస్తారో, పేదరికంలోకూడ నవ్వుతూ తృప్తిగా జీవిస్తారో, రాబోయే సమస్యలను కూడ ధైర్యంగా ఆహ్వానిస్తారో వారు ఏదో ఒక విధంగా ఎక్కడి నుంచైనా సరే అభివృద్ధికి కావలసిన సాధన సామగ్రిని సమకూర్చుకోగలుగుతారు. అభివృద్ధికి మహత్వపూర్ణ సాధనాలు, అనుకూలమైన పరిస్థితులే అక్కర్లేదు. ముఖ్యంగా వ్యక్తిగత సమర్థత, సహజ సిద్ధమైన ప్రతిభ, దూరదృష్టి ఉండి తీరాలి. వీటి ద్వార సాధకులకు లభించనివంటూ ఏమీ ఉండవు. వారు వేసే ప్రతి అడుగు విజయవంతమై తీరుతుంది.*

స్వామివారు ఇలా అన్నారు-

"ఉచ్చ నీచాలవల్ల, అవి ఆధారంగా ఎవరినైనా గౌరవించడం వల్ల కాని, అవమానించడంవల్ల కాని- ఎన్నడూ ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. సమాజంలో చక్కని వాతావరణం నిలచి ఉన్నంతవరకు ఆధ్యాత్మిక దృష్టిలో మాత్రమే దీనికి ప్రాముఖ్యత ఉండేది. ఒకే స్వభావం, సంస్కారం, ప్రవృత్తి కలిగిన ప్రజలు తమకు అనుకూలమైన వాతావరణంలో నివసించాలి. అందువల్ల- కుటుంబాలలో కుల సమూహాలలో సంరక్షణ, అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి."

విషయాన్ని ముగిస్తూ స్వామివారు ఇలా అన్నారు-

"అయితే ఇవన్నీ గడచిన యుగంలోని విషయాలు కొత్త విద్యా విధానం, కొత్త ప్రభుత్వం ఏర్పడడంవల్ల పరిస్థితులు బాగా మారిపోయాయి. ఆ విషయాలను తిరిగి తీసుకురాలేము."

★★★

**అశ్లీల సాహిత్యం - మంచివారికీ, చెడ్డవారికీ సర్వులకూ విషతుల్యం.**

సాధన విజ్ఞానం

# ప్రేమ సాధన-ఆత్మీయతావిస్తరణ

ఆత్మను వ్యక్తం చేస్తుంది ప్రేమ. నదులు సముద్రంలో కలసి విశాలం అవుతాయి, రత్నాకరములు అవుతాయి. మనిషిలోని గుణాలు నదులవంటివి. ఆ సద్గుణాల రాశి అయిన ప్రేమ సముద్రం వంటిది. ప్రేమలో సద్గుణాలన్నీ విలీనమై, నిర్గుణత్వాన్ని పొందుతాయి.

**స హి అనిర్వచనీయో ప్రేమ రూపః**

అంటుంది నారద భక్తి సూత్రం. పరమేశ్వరుని యొక్క ప్రేమ స్వరూపాన్ని ప్రకటిస్తోంది ఆ సూత్రం. ఇదే పరమ తత్వం. దీన్ని తెలుసుకోవడం జ్ఞానానికి సార్థకత.

**ఢా ఈ ఆఖర్ ప్రేమ్ కా, పఢౌ సో పండిత హోద్**

- అంటారు సంత్ కబీరు. రెండున్నర అక్షరాలలో ఇమిడి ఉన్న ప్రేమ తత్వాన్ని గ్రహించడంలోనే పాండిత్యానికి సార్థకత ఉన్నది- అన్నది దాని అర్థం.

## ప్రేమ వేరు, వ్యామోహం వేరు

మామూలు భాషలో మనం అంటూ ఉంటాం- ఫలానా వ్యక్తికి భార్యమీద ప్రేమ ఉన్నదని, పిల్లలమీద ప్రేమ ఉన్నదని, తల్లిమీద ప్రేమ ఉన్నదని. వాస్తవానికి అది ప్రేమ కాదు- వ్యామోహం.

ప్రేమ శరీరం అయితే, వ్యామోహం దాని నీడ. ప్రేమ శరీరం వలె సజీవమైనది. వ్యామోహం నీడవలె నిర్జీవమైనది.

ప్రేమ ప్రాణులపట్ల ఉంటుంది. వ్యామోహం జడ పదార్థములపట్ల ఉంటుంది. భార్యపట్ల, బంధువుల పట్ల చూపే "ప్రేమ" జడ శరీరాలపై కలుగుతుంది. ఆత్మలపై కలుగదు. కనుక అది వ్యామోహమే.

ప్రేమ తత్వాన్ని యాజ్ఞవల్క్య మహర్షి బృహదారణ్యక ఉపనిషత్తులో ఇలా వివరించారు- భార్య భార్య అయినందువల్ల కాక, ఆత్మ అయినందువల్ల ప్రియమైనది; సంతానం సంతానం అయినందువల్ల కాక, ఆత్మ అయినందువల్ల ప్రియమైనది.

**యో మాం పశ్యతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి**

- అంటోంది భగవద్గీత. అనగా- అంతటా నన్ను చూచేవాడు, అన్నింటిలో నన్ను చూచేవాడు. ఈ కారణంవల్ల భార్య, సంతానం ప్రియమైనవి- అన్నది యాజ్ఞవల్క్య మహర్షి భావం.

ఒక వ్యక్తిపట్ల ప్రేమ ప్రారంభం కావచ్చు. అయితే అది అతడికి పరిమితమై ఉండజాలదు. అలా పరిమితం అయితే, ఏదో పొందాలని కోరితే- అది వ్యామోహం అవుతుంది. ప్రేమలో పొందాలనే ఆసక్తి ఉండదు, ఇవ్వాలనే ఆసక్తి ఉంటుంది. ప్రేమలో ప్రసన్నతా, శ్రేయోభిలాష ఇమిడి ఉంటాయి. వ్యామోహంలో స్వార్థపరత్వం, సంకుచితత్వం పెరుగుతాయి. దానిలో ఇచ్చిపుచ్చుకోవడం ఉండదు; వాడుకోవాలనే కోరిక ఉంటుంది.

ప్రేమ వస్తువులతో ముడిపడి వాటి సద్వినియోగాన్ని గురించి ఆలోచిస్తుంది; వ్యక్తులతో ముడిపడి వారి శ్రేయస్సును గురించి ఆలోచిస్తుంది; విశ్వంతో ముడిపడి పరమార్థం గురించి ఆలోచిస్తుంది.

వ్యామోహంలో వస్తువులనుండి, వ్యక్తులనుండి, ప్రపంచం నుండి ఏదో విధంగా స్వార్థ ప్రయోజనాలను సాధించాలనే కోరిక ఉంటుంది. ఎవరిపట్ల వ్యామోహం కలుగుతుందో, వారిని తమ చెప్పు చేతలలో నడిపించాలనే తహతహ ఉంటుంది. అందులో ఏమాత్రం ఆటంకం వచ్చినా, అసహనం కలుగుతుంది. ప్రేమలో ఇలాంటివి ఏవీ ఉండవు.

ప్రేమ పరిసరాలపట్ల అంకురిస్తుంది. వికసిస్తుంది. పల్లవిస్తుంది. పుష్పిస్తుంది. దాని శాఖోపశాఖలు సమాజమంతటికీ, విశ్వమంతటికీ విస్తరిస్తాయి. పరిసరాలు ప్రేమ సాధనకు పాఠశాల. ప్రేమ దాని వికాసం గురించి ఆలోచిస్తుంది. అనగా- బంధు మిత్రుల, ఇరుగు పొరుగువారి వికాసం గురించి ఆలోచిస్తుంది. ఆ వికాస కృషిలో వచ్చే కష్టాలలో సంతృప్తి అనుభవం అవుతుంది. ఇది తొలి శిక్షణ. అయితే- ఈ కృషిలో ఉచితానుచితాలను పాటించకపోతే, ఆదర్శాలను బలి ఇస్తే- అది వ్యామోహం అవుతుంది.

## అనర్థాలకు మూలం వ్యామోహం

మోహ సకల వ్యాధిన్హ కర మూలా

-అన్నారు గోస్వామి తులసీదాసు. అనగా- వ్యామోహం అన్ని రోగాలకూ మూలం. వ్యామోహం వ్యక్తికీ, అతడితో ముడిపడిన వారికీ హాని కలిగిస్తుంది.

**జూదం, లాటరీ మొదలైన వాటిద్వారా సంపాదించిన ధనం దోచుకున్న ధనంలాగా అనైతికం.**

గంగాజలంలా ప్రేమ పవిత్రమైనది, నిశ్చలమైనది, ప్రేమలో ఆదర్శాల అవిచ్ఛిన్నత మిళితమై ఉంది. ప్రేమలో వివేకం, సహృదయత, పవిత్రత, సద్భావనవంటి గుణాలు ఇమిడి ఉంటాయి. ప్రేమమూర్తి తాను ప్రేమించేవారిలో ఈ గుణాలను పెంపొందించడానికై నిరంతరం ప్రయత్నిస్తాడు.

## ఆదర్శాలకు సమర్పణయే ప్రేమ

భావ సంవేదనలు నిత్యం, నిరంతరం ఉదాత్త ఆదర్శాలకు సమర్పితం కావడమే ప్రేమ. ప్రేమను సంకుచిత పరిధిలో బంధించలేము. ప్రేమ సూర్యునివంటిది. సూర్యుడు ఉదయం తూర్పు దిక్కుకే వెలుగును ఇస్తాడు. మధ్యాహ్నం ఆ వెలుగు అన్ని దిక్కులకూ వ్యాపిస్తుంది. ప్రేమ పరిసరాలపట్ల ప్రారంభం కావచ్చు. అయితే అది నిత్యం, నిరంతరం అభివృద్ధి పొందుతూ జాతికీ, విశ్వానికీ విస్తరిస్తుంది. ప్రేమమూర్తి అయిన వ్యక్తి దేశం, ధర్మం, సంస్కృతి, మానవాళి- అన్నింటి సేవా సాధనలో నిమగ్నం అవుతాడు.

**జా ఘట ప్రేమ న సంచరై సా ఘట జాన్ మసాన్**

- అంటారు సంత్ కబీరు. అనగా- ప్రేమలేని హృదయం స్మశానమే. అందులో చింత, సంతాపం, అసంతృప్తి అనే భూతాలు తిరుగుతూ ఉంటాయి. అలాంటి వ్యక్తి భూమికి బరువు.

ప్రేమ అనే జ్యోతిలో వేడి ఉండదు. అది దివ్యమైన చింతామణి. చల్లని వెలుగు. శరీరం, మనస్సు, బుద్ధి, అంతఃకరణ వెలుగుతాయి ఆ చింతామణి కాంతిలో. ప్రేమమూర్తి సన్నిధిలో వ్యక్తులు నిర్మలత్వాన్నీ, శీతలత్వాన్నీ అనుభూతి పొందుతారు.

ప్రేమకు పరిపూర్ణత పరమేశ్వరునిలో ఉంది. ప్రేమ తత్వం ఆయనలోనే దర్శనం అవుతుంది. ఆ స్థితిలో ప్రేమ ధార మహాసాగరం అవుతుంది.

## బౌద్ధ భిక్షువు అయిన బందిపోటు దొంగ

చైతన్య మహాప్రభుయొక్క దివ్యప్రేమలో మునకలు వేసి, జధాయీ మధాఈ వంటి గజ దొంగలు సంత్‌లుగా మారారు.

బుద్ధ భగవానుని హృదయంనుండి పొంగిపొరలిన ప్రేమ ప్రవాహం అంగుళిమాలుడువంటి బందిపోటు దొంగను బౌద్ధ భిక్షువుగా మార్చింది.

### మహా కాలుడు

*శివుడు భారతీయధర్మంలో ప్రముఖుడైన దేవుడు. దేవ, మానవ, రాక్షసవర్గాలలో శివునిది ప్రథమస్థానం. అందువల్ల దేవాధి దేవుడు. చైతన్యమే ఊపిరిగా గల పరివర్తన పురుషుడు. ప్రకృతికి కట్టుబడి శిశిరంలో పండి ఎండిన ఆకులను రాల్చుతాడు. వసంతంలో కొమ్మలకు చిగురులు తొడుగుతాడు. కనుక గతిశీలుడు. మరణానికి భయపడడు. స్మశానంలోనే నివసిస్తాడు. అతడు యోగి. అతడు భిక్షుకుడు. శరీరమంతా భస్మాన్ని పూసుకుంటాడు. ఋతుప్రభావాలు ఆతనిపై పనిచెయ్యవు. ఆయన మృత్యుంజయుడు. పిరికితనమంటే ఏమిటో ఎరుగడు. అతడు రుద్రుడు. పులి చర్మాన్ని ధరిస్తాడు. ఆతడు పురుష శ్రేష్ఠుడు. మహోల్లాసంతో కపాల మాలను మెడలో ధరిస్తాడు. గొప్ప సాహసి. విషాన్ని కంఠం మధ్యలో నిలిపి ఉంచాడు. అతడు నీలకంఠుడు. పండితులను, పామరులను ఒకే సూత్రంలో బంధించి ఉంచగల సమర్థుడు. విషాన్ని విలీనం చేసుకోగల మహాయోగి. మహాదేవుడు. మహాకాలుడు.*

ఈ దివ్య స్థితిని పొందినప్పుడు అంతటా సత్యం శివం సుందరంల దర్శనం కలుగుతుంది. వ్యక్తి శక్తులన్నీ విరాట్ బ్రహ్మకు స్థూల రూపం అయిన విశ్వ- బ్రహ్మాండం యొక్క సేవకు అంకితం అవుతాయి.

## దివ్యప్రేమద్వారా అద్వైత స్థితి

పరమపితపట్ల ఇలాంటి సాన్నిహిత్యంవల్ల క్షుద్రుడు మహాత్ముడు అవుతాడు, పురుషుడు పురుషోత్తముడు అవుతాడు. అంతరంగంలో సత్-చిత్-ఆనందముల త్రివేణి ప్రవహిస్తుంది. అంతటా ఆత్మసత్తా యొక్క దివ్యానుభూతి లభిస్తుంది.

వేదాంతం వర్ణించే "సర్వం ఖల్విదం బ్రహ్మ", "వాసుదేవః సర్వమితి" అనే అద్వైత స్థితి ఇది. ఈ చరమ స్థితిని పొందడమే మానవ జీవనానికి అంతిమ లక్ష్యం. ఈ స్థితిని చేరుకోవడానికై మనిషి వ్యామోహమనే నీడను వదిలి, ప్రేమ అనే సజీవ శరీరాన్ని అందుకోవాలి, ఆత్మీయతను విస్తరించే నిరంతర కృషి ఫలితంగా ఈ అద్వైత స్థితి సిద్ధిస్తుంది.

★★★

**అన్యాయాన్నెదిరించే తత్వం - గౌరవింపదగిన వీరత్వం.**

సద్గురులీలామృతం

# అసాధ్యం కూడ సుసాధ్యమవుతుంది

రామపురంలోని కార్యకర్త కౌశల్‌కుమార్ చౌదరి. ఆయన భార్య అనితా చౌదరి. ఆ దంపతులిద్దరు కలుగబోయే సంతానాన్ని గురించి కొన్ని ప్రత్యేక ఆశలు పెట్టుకున్నారు. తాము కంటున్న కలలన్నింటినీ కాగితం మీద వివరంగా వ్రాసి గురుదేవుల చిరునామాకు పోష్టుచేశారు. ఋషి దంపతులు ఆశీర్వాదంతో పాటు ఒక సందేశం కూడ పంపించారు. "మీరు సవితా దేవతను ఉపాసించండి. తప్పక మంచి సంతానం కలుగుతుంది" అని. వారలాగే గాయత్రీ ఉపాసన ప్రారంభించారు.

కొంతకాలానికి అనిత గర్భవతి అయింది. డాక్టరు దగ్గరకు వెళితే రక్తంలో 'ఐరన్' శాతం తక్కువగా ఉందన్నారు. దానికి సంబంధించిన మందులు ప్రారంభించారు. ఐనా రెండున్నర నెలలు గడిచే సరికి అబార్షన్ అయిపోయింది. అదేవిధంగా వెంట వెంటనే రెండుసార్లు జరిగింది. వాళ్లు విచారంతో గురుదేవుల వద్ద ప్రత్యక్షంగా ఆశీర్వాదం తీసికోవాలని వచ్చారు.

డాక్టర్లు శరీర పరీక్ష చేసి శరీరంలోని జీన్స్‌లో లోపం ఉన్నదని చెప్పారు. రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించి డాక్టర్లు చెప్పిన దేమంటే- "గర్భం వస్తే మాత్రం అబార్షన్ చేయించుకోవాల్సిందే. సంతానం మీద ఆశలు వదలుకోవాల్సిందే" అని.

పరమపూజ్య గురుదేవులు వందనీయ మాతాజీ వద్ద నుండి ఒక రక్షరేకును అడిగి తీసికున్నారు. దానిని అనితాచౌదరి చేత ధరింపచేశారు. దానిని ధరించిన తర్వాత కూడ ఆమె నియమానుసారంగా సూర్యధ్యానం, గాయత్రీ ఉపాసన ప్రారంభించింది. మరల గర్భం ధరించింది. సోనోగ్రాఫి మాతాశిశువుల జీన్సును పరిశీలించి చూశారు. శిశువు సురక్షితంగా ఉంది. దాదాపు 20 వారాల వయస్సుగల శిశువు ఆరోగ్యప్రదంగా ఉన్నదని ఖచ్చితంగా చెప్పారు.

వందనీయ మాతాజీ మాట ననుసరించి పుంసవన సంస్కారానికి ఏర్పాట్లు జరిగాయి. సలక్షణంగా సంస్కార కార్యక్రమం జరిగిపోయింది. అంతా సవ్యంగా నడుస్తోంది. హిమోగ్లోబిన్ సరిగ్గా ఉన్నది. మందులు సక్రమంగా వేసికుంటున్నట్లు జాబు వ్రాసింది. డాక్టర్లంతా ఆశ్యర్యపోయారు. చివరకు 18-11-1991 సోమవారం కార్తీకశుద్ధ ఏకాదశినాడు ఆరోగ్యవంతమైన, అందమైన శిశువు జన్మించింది. ముఖ్యంగా గుర్తుంచుకోవలసినవిషయం ఆమెకు చికిత్స 1988 నుండి ప్రారంభమైంది. కాని ఋషిద్వయం నుండి ప్రత్యక్ష ఆశీర్వాదం పొందిననాటినుండే ఆమె ఆరోగ్యం మెరుగుపడసాగింది. దీని ద్వారా గురుసత్తా మహిమ అర్థం అవుతోంది.

# గురుసత్తా ప్రాణంపోసింది

. రతలామ్ నగర్‌లో రుద్రకుమారకృష్ణాత్రే నిష్ఠావంతుడైన కార్యకర్త. 1992 ఫిబ్రవరి 6, 7 తేదీలలో సామూహిక శక్తి సాధనా కార్యక్రమాన్ని ప్రారంభించాడు. అట్లాగే వసంతపంచమి కూడ కలసి వచ్చింది. గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినాన్ని కూడ కలిపి చేస్తూ ఉన్నారు.

శ్రీకృష్ణాత్రే కార్యక్రమసాఫల్యం కోసం విరామం లేకుండా శ్రమిస్తున్నాడు. ఫిబ్రవరి 6 నాడు కలశయాత్ర ప్రారంభమైంది. దేవస్థాపన కార్యక్రమానికి పరిజనులను సిద్ధం చేయడానికి మోపెడ్‌పై ఇరుకుసందులో పోతూఉన్నాడు. ఎదురుగా వేగంగా వస్తూన్న సైకిలును ఢీకొన్నాడు. ఇద్దరూ పడిపోయారు. అటేవస్తున్న వృద్ధుడొకడు ఇరువురిని లేవదీసి నిలబెట్టాడు. సరిగ్గా అదే సమయానికి కలశాల శోభాయాత్రనడుస్తోంది. పెద్దగా గాలివీచింది. ఆ గాలికి గురూజీ-మాతాజీల చిత్రపటాలు క్రిందపడి అద్దాలు పగిలిపోయాయి. వెంటనే పరిజనులు పటాలను తీసి అద్దం వేయించడానికి పంపించారు. అక్కడ ఏక్సిడంటైన ఇద్దరికీ ప్రాథమిక చికిత్స చేసి కార్యక్రమానికి తీసికొనివచ్చారు.

గురుదేవులు స్థూల శరీరంతో లేకున్నా సూక్ష్మశరీరంతో తన వారిని రక్షిస్తూనే ఉన్నారు. "నా పనిని చేస్తున్నవారిని నా సూక్ష్మసత్తా, మాతాజీ స్థూలశక్తి ఎల్లప్పుడూ కాపాడుతూనే ఉంటుంది." అన్న గురుదేవుల మాటలు అందరిచెవుల్లోను మారుమ్రోగాయి. భక్తితో కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

★★★

మహత్వాకాంక్షలకు సరియైన ఆధారం - ఉచ్చకోటికి చేరిన పవిత్రత.

# విద్యావిస్తరణకొరకు ఆహ్వానం

ప్రపంచంలో ఉండే బలాలన్నింటిలోను బుద్ధిబలము చాలా ప్రధానమైనది. మానవుని వంటి దుర్బల ప్రాణి సృష్టిలోని సమస్త పశు పక్షాదులపై శాసనం చెలాయిస్తున్నాడు. పెద్ద–పెద్ద ఏనుగులు, సింహాలు, సర్పాలు మనిషి కన్నా శారీరికంగా ఎంతో బలంగా ఉన్నప్పటికీ మనిషికి తలవంచి తన బలహీనతను ఒప్పుకొంటాయి. ఈ బుద్ధి బలంతోనే దేశాలు, జాతులు అభ్యున్నతికి చేరి సమృద్ధిగా, సుసంపన్నంగా తయారు అవుతాయి. బుద్ధి బలం లేనిచోటే బీదతనం, నిరుద్యోగం, కలహాలు, క్లేశాలు, దుర్భావనలు, అజ్ఞానం, భ్రమలు, దుర్గుణాలు వ్యసనాలు మొదలైన నానా రకాలైనవి ఏర్పడి మనిషిని బాధిస్తాయి. నిస్సందేహంగా మానవునిలో బుద్ధితత్వానికే ప్రాధాన్యత ఉంది. ఈ బుద్ధిని అతని వద్దనుంచి లాగేసుకొంటే నక్క, కుందేలు, కోతి కన్న చాలా బలహీనుడై పోతాడు. ఎందుకంటే ఆఖరికి జంతువులు పరుగెట్టినట్టు, గెంతినట్టు మనిషి గెంతలేడు.

మనిషి అభివృద్ధి, పతనం, సుఖదుఃఖాలు, దారిద్ర్యం, సమృద్ధి అన్నీ ఈ బుద్ధి బలం పైనే ఆధారపడి ఉంటాయి. ఈ విషయం సూర్యుని వలె ప్రత్యక్షంగా, సత్యంవలె స్పష్టంగా తెలుస్తోంది కదా! మన భారతీయులం చాలా కాలం నుండి దాస్యత్వం, దీనత్వం మరియు నిర్బలత్వం నుండి జనించే నానా విధాలైన కష్టాలను సహిస్తున్నాం. ఈ కష్టాలనుండి విడుదల పొందుదామని ప్రయత్నిస్తున్నప్పటికీ బుద్ధిబలం లేకపోవడాన ఏమీ చేయలేం. నెమ్మదిగా లేచినా అడుగులు తడబడి పడిపోతూ ఉంటాం. శారీరిక, మానసిక, ఆర్థిక, ధార్మిక, సామాజిక మరియు రాజనైతికంగా నేడు మనకున్న దుస్థితికి కేవలం మనలో జ్ఞాన బలం లేకపోవడమే.

గడచిన కాలపు దురవస్థని, దుఃఖ పూరితమైన స్మృతులను స్మరించుకొంటూ నేడు భారత దేశపు అంతరాత్మ రోదిస్తోంది. ప్రపంచం ఎంతో ముందుకిసాగిపోయింది. మనం ఉన్నతి అనే పరుగు పందెంలో వెనుక బడిపోయాం. భారతదేశం మేల్కొంటున్న కొద్దీ తన పరిస్థితిని తలచుకొని దాని నుంచి బయట పడటం కోసం ప్రయత్నిస్తున్నది.

ఆలోచనా శీలుడూ, కర్తవ్య పరాయణుడూ అయిన ప్రతీ భారతీయుడు తాను ఉంటున్న సమాజాన్ని సంస్కరించాలనే ఆలోచనలో ఉన్నాడు. తనకి అర్థమయిన పద్ధతిలో ఉపాయాల కోసం అన్వేషిస్తూనే ఉన్నాడు. ఈ జాగృతిని గురించి ప్రయత్నించే సమయంలో నేను ప్రతీ ఉన్నతి–పతనం గూర్చి శాశ్వతమైన సనాతన సిద్ధాంతాలను గురించి లోతుగా ఆలోచించాలి. నిజమైన ఉన్నతి, పతనం బుద్ధి బలంపైనే ఆధారపడి ఉన్నాయి. సంపద అడిగితే దొరికేది కాదు, అలా దొరికేది నిలువదు కూడా! బుద్ధి బలమున్నచోటికి, ఇతర శక్తులు, ఇతర సంపదలు వాటంతట అవే ఆకర్షింపబడి వచ్చి చేరుతాయి. కాబట్టి ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకొని దేశాన్ని ఈ పరిస్థితి నుంచి రక్షించడానికి నిజమైన, స్థిరమైన మార్గాన్ని ఏర్పాటు చేసికోవాలి. మొట్టమొదట అన్ని విషయాల కన్నా జనాభివృద్ధికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి.

ప్రపంచంలో ఏ దేశం వృద్ధి చెందినా అది బుద్ధి బలంతోనే సాధ్యపడింది. భారతమాతను తిరిగి ఉన్నత శిఖరాలను అధిరోహించేటట్లు చేయడానికి మనం జ్ఞాన యజ్ఞమనే మహత్తరమైన అనుష్ఠానాన్ని చేయవలసి ఉంది. బుద్ధి రెండు విభాలుగా విభాజితమై ఉంది. ఒక దానిని శిక్షణ అని, రెండవ దానిని విద్య అని అంటారు. శిక్షణలో రకరకాల విషయాలను తెలిసికొని, వాటిలో మెలకువని సంపాదిస్తాము, విద్య ద్వారా సద్గుణాలను, సద్భావనలను పెంపొందించుకొంటాము. శిక్షణ ద్వారా మనిషి మంచి వ్యాపారస్తునిగా, రాజనీతిజ్ఞునిగా, డాక్టరుగా, వకీలుగా, రచయితగా, వక్తగా, అధ్యాపకునిగా, ఆఫీసరుగా మొదలైనవి కాగా, మహా పురుషునిగా సేవా భావము కలవానిగా, శాంతి ప్రియునిగా మరియు నిర్మలచిత్తునిగా ఉండి నిధులను సంపాదిస్తాడు. స్కూళ్లలో, కాలేజీలలో నేడు శిక్షణ ఇవ్వబడుతోంది. సాహిత్యం కూడా ఈ దిశలోనే అభివృద్ధి చెందింది. ఈనాడు శిక్షణ పొందిన వారిలో శిక్షణను అభిమానించే వారిలో జ్ఞానం, నేర్పరితనం తప్పకుండా వృద్ధి చెందుతాయి. వారు గణితం, భూగోళం, సాహిత్యం, ఇతిహాసం,

ప్రతిభకు సానబట్టే యంత్రాలు - బ్రహ్మవర్చస్ - గాయత్రీ తీర్థ్ శాంతికుంజ్.

జ్యామిత్రి, రసాయన శాస్త్రం, ఖగోళ శాస్త్రం, న్యాయ శాస్త్రం, సైన్సు, ఆర్ట్స్ మొదలైన విషయాలలో పరిజ్ఞానం ఏర్పడుతుంది. దానితో తమ చాతుర్యాన్ని జోడించి, డబ్బు, పదవితో పాటు ప్రతిష్ఠను కూడా సంపాదించుకొంటారు. అంతే కాక ఎంతో విలాసంగా, వైభవంగా తమ జీవితాన్ని గడిపివేస్తారు. ఇంత అభివృద్ధి చెందినా విద్య లేకపోవడం వల్ల శిక్షణ అసంపూర్తిగా మిగిలిపోతుంది.

విద్య అనే జ్ఞానం వల్ల మనిషికి చరిత్ర నిర్మించబడుతుంది. దృష్టికోణము నిర్ధారించబడుతుంది. సదుద్దేశ్యం, సత్‌సిద్ధాంతాల వల్ల వ్యావహారిక జీవితంలో చరితార్థులు కావడానికి ప్రేరణ లభిస్తుంది. శిక్షణతో విద్యను సమన్వయ పరచనట్లైతే లాభంకన్నా నష్టమే ఎక్కువ. చదువురాని వ్యక్తికి శక్తి కొంచెమే ఉంటుంది. ఆతడు దుర్మార్గుడైతే ఆతడి దుర్మార్గం కూడ తక్కువ స్థాయిలోనే ఉంటుంది. అంతేకాదు. దుర్మార్గం నుండి తక్కువ సమయంలోనే బయటపడిపోతాడు కూడా! ఒక పల్లెటూరిబైతు అయిన దొంగ తన చుట్టు పక్కల చిల్లర దొంగతనాలే చేయగలడు, త్వరగా పట్టుపడిపోతాడు, ప్రజలు అతనిని చూసి జాగ్రత్తపడతారు. కాబట్టి పల్లె దొంగకు పరిధి చాలా చిన్నగా ఉంటుంది. కాని శిక్షణ పొందిన దొంగ వీనికన్నా ఎన్నో వేల రెట్లు భయంకరమైన వాడు. ఆతడు తన బుద్ధిని ఉపయోగించి న్యాయస్థానం నుండి తప్పించుకొని, మనుషులను మోసం చేయడానికి పెద్ద-పెద్ద కార్ఖానాలు ఏర్పాటు చేస్తాడు. హోటల్స్ పేరుతో వ్యభిచారగృహాలు, కార్మికుల పేరుతో జూదం, రెస్టారెంట్ల పేరుతో మద్యపాన గృహాలు మొదలైనవి ఏర్పాటు చేసికొంటాడు. విధవాశ్రమాల పేర వ్యభిచారం జరుపుతాడు. రెచ్చగొట్టే ప్రకటనల ద్వారా రెండణాల వస్తువుని 10 రూపాయలకు అమ్ముతాడు. సిద్ధాంతాల పేరిట చేయకూడని పనులు చేస్తాడు. బుద్ధిని పాలిష్ చేసి నికృష్ట కార్యాలను గొప్పగా వర్ణిస్తూ, నిర్దోషులుగా చెలామణి అవుతాడు. న్యాయస్థానం కూడ ఏమీ చేయలేని స్థితిలో పడిపోతుంది. సాధారణ జనం ఈ మాయను తెలుసుకోలేరు. ఈ నికృష్టమైన పనులు జరిగి పోతూనే ఉంటాయి. ఈ విధంగా శిక్షణ వల్ల తెలియకుండా అనర్థాలు జరుగుతాయి. క్రమంగా అవే వృద్ధి చెందుతాయి. అంతే కాక దీనివల్ల మనిషి ప్రవృత్తి కలుషితం, స్వార్థపూరితమై శోషించేదిగా, ఇతరులని పీడించేదిగా తయారౌతుంది. ఇటువంటి వ్యక్తులు వారి అంతర్గత జీవితంలో చాలా సందిగ్ధంగా, విశ్వాసరహితంగా, అసంతుష్టునిగా కనిపిస్తారు. కుటుంబంలోని వ్యక్తులే అతనికి శత్రువులుగా కనిపిస్తారు. ఈర్ష్య, కలహం, క్రోధం, చింత, అశాంతి వల్ల ఆతడి అంతఃకరణం ఎప్పుడూ ఉడికిపోతూ ఉంటుంది. ఇటువంటి వ్యక్తులవల్ల దేశానికి, జాతికి ఏం మేలు జరుగుతుంది? వారు ఎప్పుడూ గొడ్డలిలాగ అందరిపైనా దెబ్బ వేయడానికి సిద్ధంగా ఉంటారు.

కాని విద్యకి ఇది వర్తించదు. మానవత్వం గురించి, కర్తవ్యం గురించి, ధర్మం గురించి ఇచ్చే శిక్షణను విద్య అంటారు. విద్య మానవుని హృదయకమలాన్ని వికసింపచేస్తుంది. నమ్రత, మధుర భాషణ, సంయమం, సాహసం, ఏకత్వం, మితవ్యయం, నిరాడంబరత, సేవ, సానుభూతి, నిజాయితి, ఉదారత, న్యాయశీలత, ప్రేమ, శ్రమ, జాగ్రత్త, సత్యసంధత, తపశ్చర్య మొదలైనవి విద్యకు అంగాలు-ఉపాంగాలు. ఈ సద్గుణాలు, సత్కార్యాలపై ఆధారపడి జీవనం గడిపే మనిషి, అక్షరజ్ఞానం లేకపోయినప్పటికీ, ఆతడి వ్యక్తిగత జీవితం ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉంటుంది. పరోక్షంగా దేశానికి జాతికి మేలు జరుగుతుంది. ఆతడు చేపట్టే ప్రతి పనీ ఇతరులను నిలబెట్ట గలిగేదిగా, ఉన్నతి వైపు నడిపించేదిగా ఉంటుంది.

బుద్ధి బలమే మానవ జీవితానికి ప్రధాన తత్వం. బుద్ధి బలానికి విద్య ముఖ్యమైంది. శిక్షణ దానిని పూర్తిచేస్తుంది. శిక్షణ లేని విద్య కూడ బాగానే ఉపయోగపడుతుంది. కాని విద్యలేని శిక్షణ ఎందుకూ పనికిరాదు. పైగా నష్టాన్ని కలుగజేస్తుంది. విద్య హృదయమైతే శిక్షణ మస్తిష్కం. హృదయానికి, మస్తిష్కానికి చెందిన రెండు తీగెల సంయోగం వల్ల జనించిన విద్యుత్ శక్తినే విద్య అంటారు. ఈ విద్యను ఆధారంగా చేసికొనే ఎన్నో జాతులు, దేశాలు ఉన్నతి చెందుతాయి. పరస్పర అవగాహన, ఐకమత్యం, సహాయం, సద్భావనలు పెరుగుతాయి. ఈ విద్యయే లౌకిక, పార లౌకిక ఉన్నతికి మూలమౌతుంది.

**ఈశ్వరోపాసన అంటే - తన్నుతాను వికసింప చేసికోవడం.**

మన దేశం శిక్షణను వృద్ధి చేయడానికి సంతోషకరమైన ప్రయత్నాలు చేస్తోంది; కాని విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. మానవునికి ఉచితమైన సద్గుణాలు, సదాలోచనలు కలిగించి విద్యను వ్యాప్తి చేయడానికి ఇంకా ఎక్కువ ప్రయత్నం చేయాలి. ఎందుకంటే మన ఉన్నతి మరియు సమృద్ధి యొక్క మూలం అదే. వ్రేళ్లను ఉపేక్షించి చెట్టు ఆకులకు మాత్రమే ఆహారం, నీరు ఇస్తే పని జరుగదు కదా! శిక్షణతో క్లర్కులను తయారు చేయవచ్చును, కాని విద్య గర్భం నుండి మహాపురుషులు జన్మిస్తారు. వారిని వృద్ధి చేయడంలోనే దేశం యొక్క నిజమైనసమృద్ధి దాగిఉంది.

శిక్షణావ్యవస్థకు గవర్నమెంటు, సెమి గవర్నమెంటు, ధనవంతుల ద్వారా సహాయం లభించవచ్చు. కాని విద్యా ప్రచారం యొక్క బాధ్యతను కర్మనిష్ఠులు, సదాచారులు, ఋషులు మాత్రమే చేబడతారు. ఇది యుగనిర్మాణం జరిగే సమయం. ఈ ముఖ్యమైన సమయంలో విశ్వగాయత్రీ పరివారం సమస్త ఋషి కల్ప ఆత్మలకు ఆహ్వానం పలుకుతోంది. అంతేకాక తమయొక్క సంపూర్ణ శక్తియుక్తులతో మానవులలో మానవత్వం ప్రసారం చేయడంకోసం కృషి చేస్తోంది. మానవ జాతిలో విద్యావిస్తరణ చేయడానికి ముందుకు వస్తోంది. "తుచ్ఛమైన స్వార్థాన్ని వీడి దేశానికి, జాతికి, సమస్త విశ్వానికి నిజమైన కళ్యాణకరమైన కార్యక్రమాలలో జేరండి" అని వినయపూర్వకంగా విన్నవిస్తున్నాము. ఈ పరివారానికి చెందిన ముఖ్యమైన ఆత్మలు తమ సంపూర్ణ శక్తితో విద్యాప్రచారంలో పాల్గొని చాలా తక్కువ సమయంలో అసంఖ్యాకమైన బహుమూల్యమైన నర రత్నాల నిర్మాణం చేసే యత్నం చేస్తున్నాయి. ఈ ఆత్మలను భారతమాత తన ఒడిలోకి చేర్చుకొని సంతోషించడమే కాక తన ప్రాచీన గౌరవాన్ని తిరిగి పొందగలుగుతుంది.

పసితనం స్వర్గీయ ఆనందాన్ని అనుభవించే సమయం. యవ్వనం, ధనం సంపాదించే సమయం. కాని వృద్ధాప్యం సంచితం చేసుకొన్న ధనంతో సుఖపడుతూ, సమాజానికి సేవలందిస్తూ ఈశ్వర భజన చేసుకొనే సమయం.

★★★

## పశ్చాత్తాపం

*ఓ వ్యాపారి వద్ద రెండు గుర్రాలుండేవి. అతను వాటిపై సరుకులు వేసుకొని, కొండలు గుట్టలు దాటి ఊరూరు తిరిగి వ్యాపారం చేసేవాడు. ఓరోజు ఆరెండు గుర్రాల్లో ఓదానికి జబ్బుచేసింది. ఈ సంగతి వ్యాపారికి తెలియదు. అతను రెండు గుర్రాలపై ఉప్పు, బెల్లం, పప్పు, బియ్యం మూటలు సరిసమానంగా వేసి, పొరుగూరికి ప్రయాణం కట్టాడు.*

*మిట్టపల్లాల కొండదారి. జబ్బుపడ్డ గుర్రం బరువు మోయలేక అవస్థపడుతూంది. అది తోటిగుర్రంతో ఇలా అంది– 'ఈరోజు నా వొంట్లో బాగాలేదు. నేను నా వీపుమీద ఉన్న ఓ మూటను గిరాటు వేస్తాను. నీవు ఇక్కడే ఉండు. అప్పుడు మనయజమాని ఆ బస్తాను నీవీపు మీదికి ఎక్కిస్తాడు. నా భారం కొంత తగ్గితే చాలు, నేను నీతోపాటు నడవగలను నీవు ఆగకుండా ముందుకుపోతే, యజమాని ఆ మూటను నా వీపుమీదికి ఎత్తుతాడు.'*

*అప్పుడు రెండో గుర్రం ఇలా అంది– "నీ బరువు మోయడానికని నేనెందుకు నిలబడాలి? నేనేం తక్కువ బరువు మోస్తున్నానా? నా వంతు బరువు మాత్రం నేను మోస్తాను. అంతే."*

*జబ్బుతో ఉన్న గుర్రం మాట్లాడలేదు. దాని జబ్బు మరింత ఎక్కువ కాసాగింది. ఓరాయి కాలికి తగిలి, గుర్రం కిందపడి లోయలోకి దొర్లిపోయింది*

*ఓ గుర్రం చనిపోవడంతో వ్యాపారికి ఎంతో బాధ కలిగింది. అతను కాస్సేపు అక్కడే విచారంగా నిలబడ్డాడు. తర్వాత కిందపడ్డ మూటలను, రెండో గుర్రం వీపు మీదికి ఎత్తాడు. అప్పుడా గుర్రం తాను చేసిన తప్పుతెలిసికొని, లోలోన మధనపడసాగింది. – 'నా మిత్రుడు అడిగిన వెంటనే ఓ మూట బరువు నేను తీసికొని ఉంటే, నాకీకష్టం వచ్చిఉండేది కాదు.'*

కష్టాలు వచ్చినప్పుడు మిత్రులను ఆదుకొనకపోతే, తర్వాత మనం పశ్చాత్తాప పడాల్సివస్తుంది.

**మనకు ఎదురైన ప్రతి పనీ ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగపడేదే.**

తత్వచింతన

# సంకల్పంలో దాగిన రహస్యం

ఓం నమః పరమాత్మనే, శ్రీ పురాణ పురుషోత్తమస్య శ్రీ విష్ణు-రాజ్ఞయా ప్రవర్తనస్యఽద్య శ్రీ బ్రహ్మణో, ద్వితీయే పరార్థే శ్రీ బ్రహ్మణో కలియుగే ప్రథమపాదే భారతవర్షే భరతఖండే ఆర్యావర్తాంతర్గతే బ్రహ్మావర్తైకదేశే పుణ్యప్రదేశే బౌద్ధావతారే వర్తమానే యథానామ సంవత్సరే అముకాయనే అముక్‌గోలేస్థిత శ్రీ సవిర్తార మాసానామ్ ఉత్తమే మాసే అముక్‌పక్షే తిథౌ అముక్ వాసరాన్వితాయామ్......

ఈ సంకల్పమంత్రం ఏ కర్మకాండను జరిపించాలన్నా అతి ముఖ్యమైనది. సంకల్పంలేని కర్మకాండ అసంపూర్ణము, అవిటిది అని చెప్పవచ్చు. ఏ రిసర్చి చేయాలన్నా ఒక పథకం, ఒక డిజైను ఉండాలి. అదేవిధంగా కర్మకాండ కూడ సంకల్పం ఆధారంగానే నిర్ణయించబడుతుంది. సంకల్పం ద్వారానే మన మనోవాంఛలను తీర్చుకోవడానికి బ్రహ్మాండంలోని శక్తిని ఉపయోగించుకుంటాము. విధి పూర్వకంగా కర్మకాండను జరిపిస్తామనుకుందాం. దాని వల్ల శక్తి ఉత్పన్నమౌతుంది. కాని అది చేరవలసిన గమ్యాన్ని ఏ విధంగా చేరుకుంటుంది? అందుకే సంకల్పం తప్పనిసరి అవుతుంది. సంకల్పంలోని మంత్రాల ద్వారా ఈ బ్రహ్మాండంలో నూతనంగా ఉత్పన్నమైన శక్తికి మార్గదర్శనం లభిస్తుంది. సంకల్పం లేని కర్మకాండ అసంపూర్ణమే అవుతుంది. ఒకవేళ మనం సంకల్ప మంత్రాన్ని వదలివేసినట్లైతే కర్మకాండ ద్వార ఉత్పన్నమైన శక్తి అంతరిక్షంలో కలసిపోతుంది.

సంకల్పంలో లోతైన విజ్ఞానం ఇమిడి ఉంది. కర్మకాండ పూర్తిగా దానిమీదనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల కర్మకాండలో సంకల్ప మంత్రంలోని విజ్ఞానం మహత్తరమైనదని నొక్కివక్కాణించవచ్చు. జ్యోతిషశాస్త్రంలో దీనికి సంపూర్ణమైన వ్యాఖ్య లభిస్తుంది. సంకల్పంలో మనం చెప్పే "పురాణ పురుషోత్తమ విష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య" అనేదానికి "విస్తరించాలి-ప్రచురించాలి" అని అర్థం.

శృతి చెపుతుంది- "ఏకోఽహం బహుస్యామ్". ఒకదాని నుండి అనేకం జన్మించాలనే ఈ సంకల్పం సృష్టి విస్తరణను కోరుకుంటున్నది. జ్యోతిషశాస్త్రప్రకారం ఈ సృష్టి విస్తరణ పగలు-రాత్రి జరుగుతూనే ఉంటుంది. చిన్న చిన్న కథలలో పరిశీలించినట్లైతే సృష్టి విస్తరణ బ్రహ్మదేవుని జీవన క్రీడగా కనిపిస్తుంది. జ్యోతిషశాస్త్రానుసారం బ్రహ్మ యొక్క కాలమానం ప్రకారం బ్రహ్మదేవుని వయస్సు 100 సంవత్సరాలు.

"ఆయుషోఽర్థ-మితంతస్య" -అనగా బ్రహ్మయొక్క ఆయువు సగంపూర్తి అయింది అని అర్థం. ఇది "సూర్య సిద్ధాంతం"లో చెప్పబడింది. ఇప్పటికి గడచిన కాలమంతా కలసి బ్రహ్మకు పూర్వార్థంలో మొదటిభాగం. బ్రహ్మయొక్క దినాన్ని (పగలు) కల్పం ద్వార లెక్కిస్తారు. రాత్రిని కూడ కల్పంతోనే లెక్కిస్తారు. ఒక కల్పంలో నాలుగు అరబుల(నాలుగు వందలకోట్ల) 32 కోట్ల సూర్య సంవత్సరాలు వస్తాయి. అయితే కల్పం అనేది మానవ సంవత్సరాలతో లెక్కించబడుతుంది. అటువంటి ఈ కల్పము బ్రహ్మకు ఒక పగలు ఒక రాత్రి అవుతుంది. బ్రహ్మకు కూడ ఆయన కాలమానం ప్రకారం నెలకు 30 రోజులుంటాయి. "శబ్ద కల్పద్రుమం"లో బ్రహ్మయొక్క రోజులపేర్లు లభిస్తాయి. అవి క్రింది విధంగా ఉంటాయి.

(1) శ్వేతవరాహ కల్పం (2) నీలలోహిత కల్పం (3) వామదేవ కల్పం (4) గాథాంతర (5) రౌరవ (6) ప్రాణకల్పం (7) వృహత్కల్పం (8) కందర్ప (9) సత్య (10) ఈశాన (11) ధ్యాన కల్పం (12) సారస్వత (13) ఉదాన (14) గారూడ (15) కౌర్మకల్పం . ఈ 15 కల్పాలు బ్రహ్మకు శుక్లపక్షం. కౌర్మ కల్పం ఆయనకు పూర్ణిమ.

బ్రహ్మయొక్క కృష్ణ పక్షదినాలు ఈ విధంగా ఉంటాయి.

(16) నారసింహకల్పం (17) సమాధికల్పం (18) ఆగ్నేయకల్పం (19) విష్ణుజకల్పం (20) సౌరకల్పం (21) సోమకల్పం (22) భావనకల్పం (23) సుప్తమాలీకల్పం (24) వైకుంఠకల్పం (25) అచీకికల్పం (26) వాల్మీకికల్పం (27) వైరాజకల్పం (28) గౌరీకల్పం (29) మహేశ్వరకల్పం (30) పితృకల్పం. బ్రహ్మకు అమావాస్య పితృకల్పమే. అమావాస్య తరువాత మరల శుక్లపక్షం ఆరంభమౌతుంది.

మనయొక్క కల్పము బ్రహ్మకు ఒక్కరోజు. ప్రతి కల్పంలో 14 మంది మనువులు గడిచిపోతారు. 14 మనువుల పేర్లు క్రింది విధంగా ఉంటాయి.

(1) స్వయంభూ మనువు (2) స్వారోచిష మనువు (3) ఉత్తమ మనువు (4) తామస మనువు (5) రైవత మనువు (6) చాక్షుష మనువు (7) వైవస్వత మనువు (8) సావర్ణి మనువు (9) దక్ష సావర్ణి మనువు (10) బ్రహ్మసావర్ణి మనువు (11) ధర్మసావర్ణి మనువు

ప్రయోజనాత్మక పనుల కోసం ఎంత పోగొట్టుకుంటామో - దానికి అనేక రెట్లు పొందుతాం.

(12) రుద్రసావర్ణి మనువు (13) రౌత్య మనువు (14) మౌత్యక మనువు. ఒక్కొక్క మనువు యొక్క కాలము 30 కోట్ల, 67 లక్షల, 20 వేల సౌర సంవత్సరాలు. ఇటువంటి ఒక్క మనువు కాలంలో 71 మహాయుగాలు వస్తాయి. అంటే 71 మహాయుగాలు ఒక్క మనువు కాలం. ప్రస్తుతం శ్వేతవరాహ కల్పంలోని వైవస్వత మనువు కాలము నడుస్తోంది. ఈ కల్పంలో 6 మంది మనువుల కాలం గడచిపోయింది. "సూర్యసిద్ధాంతాన్ని అనుసరించి ఈ మనువు కాలంలో 27 మహాయుగాలు గడిచిపోయినాయి. ఇంకా 44 మహాయుగాలు మిగిలి ఉన్నాయి. దీని తరువాత సావర్ణి మనువు కాలం వస్తుంది.

మన ఈ సృష్టిలో 11 కోట్ల, 76 లక్షల, 40 వేల సౌర సంవత్సరాలు గడచిపోయినాయి. ఈ సత్యాన్ని ఈనాటి (కాస్మోలాజీ) కూడ ఒప్పుకుంటుంది. 18వ మహాయుగంలోని సత్యయుగం యొక్క 17 లక్షల, 18 వేల సంవత్సరాలు- త్రేతాయుగము యొక్క 12 లక్షల, 96 వేల సౌర సంవత్సరాలు- ద్వాపరయుగం యొక్క 8 లక్షల, 64 వేల సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రస్తుతం కలియుగంలో సంధికాలం నడుస్తూఉన్నది. సంకల్పంలో మనం "కలియుగే కలిప్రథమచరణే" అని చెప్పుకుంటున్నాము. అంటే ఇప్పటికి కలియుగంలో 5 వేల, 107 సంవత్సరాలు నడిచిపోయి 8వ సంవత్సరంలో ఉన్నామన్నమాట.

దీని తర్వాత సంకల్పంలో స్థలాన్ని గురించి వస్తుంది. మనం జంబూ ద్వీపంలో నివసిస్తున్నాం. ఈ ద్వీపం భూమికి మధ్య భాగంలో ఉన్న ఉప్పుసముద్రానికి ఉత్తర దిక్కున వలయాకారంగా ఉన్నది. ఉప్పుసముద్రానికి దక్షిణాన సముద్రం, దధిసముద్రం, ఇక్షుసముద్రం, మద్యసముద్రం.

పైన చెప్పబడిన సముద్రాలమధ్య ఆరు ద్వీపాలున్నాయి. క్షౌర-క్షీర సముద్రాల మధ్యన "శాకద్వీపం" ఉంది. క్షీర-దధి సముద్రాల మధ్యన "శాల్మలిద్వీపం" ఉంది. ఘృతసముద్రం మధ్యలో "కౌశ" ద్వీపం ఉంది. ఘృత-ఇక్షు సముద్రాల మధ్య "కౌంచ" ద్వీపం ఉంది. ఇక్షు-మద్య సముద్రాల మధ్య "గోమేదక్" ద్వీపం ఉంది. మద్య- తియ్యటి నీటి సముద్రాల మధ్య "పుష్కర" ద్వీపం ఉంది.

మనం నివసిస్తున్న జంబూ ద్వీపంలో 9 ఖండాలున్నాయి. (1) భారతవర్షము (2) కిన్నరవర్షము (3) హరితవర్షము (4) కురువర్షము (5) హిరణ్యమయ(వర్షము) (6) రమ్యక వర్షము (7) భద్రాశ్వవర్షము (8) కేంద్రబాల (వర్షము) (9) ఇలావృత్త అని వాటికి పేర్లు. మనం భారతవర్షంలో ఉన్నాము. దీనిలో మరల 9 ఖండాలున్నాయి.

(1) ఐంద్ర ఖండం (2) కశేరు ఖండం (3) తామ్రపర్ణ ఖండం (4) గభస్తిమత ఖండం (5) భరత ఖండం (6) నాగ ఖండం (7) సౌమ్య ఖండం (8) వరుణ ఖండం (9) గంధర్వ ఖండం -అని వాటికి పేర్లు. మనం భరత ఖండంలో నివసిస్తున్నాం. సంవత్సరాలు 60 ఉంటాయి. గోళాలు 2 ఉంటాయి. (1) ఉత్తర గోళం (2) దక్షిణ గోళం. ఉత్తరపు దిక్కున ఉన్నది ఉత్తర గోళం. దక్షిణపు దిక్కున ఉన్నది దక్షిణ గోళం. ఆయనములు రెండు. (1) ఉత్తరాయనం (2) దక్షిణాయనం. సూర్యుడు మకర రాశిలో ఉన్నప్పుడు ఉత్తరాయనం, సూర్యుడు కర్కాటక రాశిలో ఉన్నప్పుడు దక్షిణాయనం. 12 నెలలలో రెండేసి నెలల చొప్పున 6 ఋతువులు వస్తాయి. మీన-మేష రాసులు సూర్యునికి భోగకాలము. అది వసంత ఋతువు. వృషభ-మిథున రాసులు గ్రీష్మఋతువు. కర్కాటక-సింహ రాలుసు వర్షఋతువు. కన్య-తులరాసులు శరదృతువు. వృశ్చిక-ధను రాసులు హేమంత ఋతువు. మకర-కుంభ రాసులు శిశిరఋతువు.

ఈ కారణంగానే కర్మకాండలో దిన, ముహూర్తం, గోత్రం, నామం తీసికోవడం జరుగుతుంది. దానివల్ల బ్రహ్మాండంలోని శక్తి నిర్దిష్ట దిశవైపు పయనించి తన లక్ష్యాన్ని చేరుకుని ఫలితాన్ని అందిస్తుంది. ప్రత్యేకమైన ముహూర్తాలలో రకరకాల కర్మకాండలు జరిపించే పద్ధతి ఉంది. కారణమేమంటే ఆయా ముహూర్తాలలో బ్రహ్మాండంలోని శక్తి అదే రూపంలో లభిస్తుంది. వీటిని పొందే నిమిత్తం సంకల్పం చెప్పుకోవడం తప్పనిసరి. సంకల్పం ఎంత బలంగా, స్పష్టంగా చెప్పుకుంటే మన కార్యం కూడ అంత ప్రతిభావంతంగా ఉంటుంది. అందువల్ల మన సంకల్పం శ్రేష్ఠమైనదిగా ఉండాలి. ఇదే సంకల్ప మంత్రంలోని మర్మం.

★★★

**జీవితం మీద ప్రేమ ఉంటే, ఒక్కక్షణం కూడ వ్యర్థం చేయకూడదు.**

# మంత్ర మూలం గురోర్వాక్యం-మోక్ష మూలం గురుకృపా

గురువు, గోవిందుడు ఇద్దరువచ్చి ఎదురుగా నిలబడితే ముందుగా ఎవరికి నమస్కరించాలి? దీనికి కబీరుదాసు సమాధానం. "అదే పరిస్థితి నాకే గనగ ఎదురైతే నేను మొట్టమొదట గురువు పాదాలకే నమస్కరిస్తాను. గురువు ద్వారానే గోవిందుని పరిచయమైంది. గురు నామస్మరణ లేకుండ ఎవరికీ ఏదీ ప్రాప్తించదు." అటువంటి గురువుకు తనను తాను అర్పించుకునే పర్వదినం గురుపౌర్ణమి.

గురువు కుమ్మరి వానివలె శిష్యుని తీర్చిదిద్దుతాడు. కుమ్మరి వాడు కుండను తయారు చేసేటప్పుడు తన చేతులతో నునుపు చేస్తూ ఉంటాడు. అదేవిధంగా గురువు శిష్యుని తీర్చిదిద్దేపనిలో ఆతని కుసంస్కారాలను తొలగించి, సుసంస్కారాలను ప్రవేశ పెడతాడు. ఒకరకంగా గురువు నూతన జీవితాన్నే ప్రసాదిస్తాడు.

ఎవరికైనా సమాజంతో కాని, కుటుంబ సభ్యులతో కాని సంబంధ బాంధవ్యాలు శారీరిక, మానసిక, భావనాపరంగా మాత్రమే ముడివడి ఉంటాయి. కాని గురువుతో మాత్రం ఆత్మికసంబంధం జోడింపబడుతుంది. 'గురువు' అంటే మానవీయ చైతన్య రహస్యాన్ని తెలిసిన వాడని అర్థం. అవసరమైతే తన శిష్యుని ప్రారబ్ధాన్ని కూడ సరిదిద్దగల సమర్థుడు. సాధకులంతా గురువులు కాలేరు.

శ్రీరామ కృష్ణ పరమహంస మాటల్లో- "సామాన్య గురువు తన బోధలతో చెవులకు విందు చేస్తాడు. కాని సద్గురువు నూతన జీవాన్ని పోస్తాడు." అలాంటి గురువు యొక్క స్పర్శ, దృష్టి, దయ ఉంటే చాలు శిష్యుడు మహా వృక్షమవుతాడు. అటువంటి గురువు లభించినపుడు అనేకమంది వివేకానందులు(గురు రామకృష్ణ పరమహంస) దయానందులు(గురు విరజానందుడు) ఏకనాథులు (గురు జనార్దనసంత్) నివృత్తి నాథులు(గురు గహినీనాథ్) సంత్ జ్ఞానేశ్వరులు(గురు నివృత్తినాథ్) కీనారాములు(గురు కాలూరామ్) యోగి అనిర్వాణులు(గురు స్వామి నిరామానంద్) ఆది శంకరాచార్యులు(గురు గోవిందపాదులు) త్రైలింగ స్వాములు(గురు భారతీయ స్వామి) చైతన్య ప్రభువులు(గురు ఈశ్వరపురీ) ఉద్భవించి సంస్కృతీ రక్షకులౌతారు. గురువు హృదయం ప్రేమతో నిండిన మృదువైన పాత్ర. కాని ఆయన చేతిలో కఠినమైన సమ్మెట ఉంటుంది. దానితో శిష్యుని అహంకారాన్ని చూర్ణం చేసివేస్తాడు.

గురువు అజ్ఞానంలోపడి ఉన్నవారిని మేల్కొలుపుతాడు. గురువు గ్రుడ్డివారి మధ్యలో కన్నులున్న వ్యక్తి "పరమాత్ముడు కనిపించని చోట పరమాత్ముడు. సద్గురువు ఎల్లప్పుడు మనలను వెన్నంటి ఉంటాడు. అతడుకూడ మనలాగే రక్త మాంసాలున్న వ్యక్తి" అయినప్పటికీ మనకు తెలియని విషయాలను తెలిసినవాడు. తెలియపరచేవాడు. గురువు మన భవిష్యత్తును ఎరిగినవాడు. మన కోర్కెలన్నింటికి ద్వారము వంటివాడు. గురువు కిటికీవంటివాడు. దాని ద్వార ఇంటిలో నుండే దూరంలో ఉన్న పరమాత్ముని దర్శించవచ్చు.

సద్గురువును దర్శించగలిగిన వాడు మిక్కిలి అదృష్టవంతుడు. ఒకవేళ దర్శించలేకపోయినప్పటికీ గురువుయొక్క శక్తి ప్రవాహంలో మునిగి తేలినవాడు కూడ అధ్యాత్మచేతనతో అదృష్టవంతుడే అవుతాడు. గురువుగారి ఆలోచనలకు కట్టుబడి ఉన్నవాడు గురువు అనుగ్రహానికి పాత్రుడవుతాడు. వీటన్నింటికీ కావలసింది ఒక్కటే. గురువుపై శ్రద్ధతో పాత్రతను పెంచుకోవడం.

పరమపూజ్య గురుదేవులు, మాతా భగవతీదేవి నేడు స్థూల రూపంలో మనమధ్య లేరు. కాని గురుసత్తా మరింత వేగంతో సూక్ష్మరూపంలో మన మధ్య ప్రవహిస్తూనే ఉంది. ఆ ప్రవాహంతో కలసి పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీక్ష తీసికొనిన వారు వేలాదిమంది ఉండవచ్చు. కాని తనను తాను గురుసత్తాకు అర్పించుకోవడమే అసలైన దీక్ష అని గుర్తించగలగాలి. మన అహంకారాన్ని పూర్తిగా సమర్పించి శూన్యహృదయంతో గురువును సేవించాలి. అటువంటి వారు వందల సంఖ్యలో ఉన్నాచాలు. వారే నిజమైన శిష్యులు అనిపించుకుంటారు.

పరమపూజ్య గురుదేవుల 80 సంవత్సరాల జీవితంలోను, వందనీయ మాతాజీ భగవతీదేవి 70 సంవత్సరాల జీవితంలోను కొద్దిపాటి సాహచర్యం కలిగి ఉన్నా వారికి స్నేహగంగలో ఓలలాడే

**జీవితంలోని ప్రతీక్షణం - ఉజ్వలభవిష్యత్తుకు యోగ్యకణం.**

అదృష్టం లభించిఉంటుంది. అపారమైన ప్రేమను అందుకుని ఉంటారు. ఆ ప్రేమ ప్రవాహంలో జ్ఞాన నౌకపై కూర్చుండి ధైర్యంగా పయనించి ఉంటారు. తరించి ఉంటారు. భయపడిపోయి సందిగ్ధావస్థలో ఉన్నవారు అలాగే మిగిలిపోతారు. గురుసత్తాను ప్రత్యక్షంగా చూడనివారు కూడ వారి వారసులు గానో, వీలునామా ద్వారానో, తాకట్టు పెట్టబడిన సొమ్ములాగానో ఏదో విధంగా గురుకృపకు పాత్రులవుతారు. పూజ్యగురుదేవులు వ్రాసిన సాహిత్యం, చేసిన ప్రవచనాలు ఒకరకంగా శక్తి పాతం వలె మన మధ్యన ప్రవహిస్తున్నాయి. ప్రఖరప్రజ్ఞ-సజలశ్రద్ధల ద్వార దూరదర్శిత, వివేక శీలతలు మహా శక్తిపాతమై ప్రవహిస్తున్నాయి.

లక్షలు కాదు. కోట్లాది జనమానసాన్ని ప్రేరేపించి జీవనదిశనే మార్చివేయగల సంఘటనలు ఈ భూమిమీద అప్పుడప్పుడు సంభవిస్తూ ఉంటాయి. "సంభవామి యుగే యుగే" అని గీతాచార్యుడు పలికిన పలుకులకర్థం ఇదే. ఆ కార్యం ఈ యుగంలో ఈ ఋషి జంటద్వార ప్రారంభం చేయబడింది. సఫలత పొందుతూ ఉంది. అసంభవాన్ని సంభవం చేసే ప్రయత్నం జరుగుతోంది. ముందు సమయాన్ని గుర్తించాలి. తరువాత సద్గురువును గుర్తించాలి. వారిని అనుసరించాలి. ఇక కాలమే తన పని తాను చేసుకుపోతూ ఉంటుంది.

గాయత్రీ పరివార్ యుగనిర్మాణ మిషన్ శాంతికుంజ్‌లో నూతన చరిత్రను సృష్టించింది. పరమపూజ్య గురుదేవులు 1926లో అఖండ దీపాన్ని వెలిగించారు. దానిని కాపాడే బాధ్యత మాతాజీ చేపట్టారు. తన స్నేహ మమకారంతో తన ప్రాణజ్యోతినే అఖండ జ్యోతిలో విలీనం చేశారు. తదుపరి కార్యాన్ని తరువాతి తరాల వారికి అప్పగించారు. ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా తట్టుకుని అఖండ దీపం వెలుగుతూనే ఉంది. దానికి కారణం సమర్పణ భావమేఅనక తప్పదు.

గురుపౌర్ణమి నాడు ఈ గురుత్వ భావాన్ని స్మరించుకోవాలి. శ్రద్ధలో పరిపక్వత, సమర్పణలో పూర్ణత్వం కోసం ప్రయత్నించాలి. శాస్త్రాలు గ్రంథాలు విషయ జ్ఞానాన్ని మాత్రమే అందిస్తాయి. కాని పూజ్య గురుదేవుల జీవనగమనంలోని గురుసత్తా యొక్క ప్రభావం ఏ కొంత మనపై ప్రసరించినా గురుచరణాలపై భక్తి కలిగితీరుతుంది. గురుసత్తా మన శరీరాలలో ప్రవేశించి సూక్ష్మ కారణరూపాలతో ప్రతిక్షణం మనకు మార్గదర్శనం చేస్తూ ఉంటుందని మనం నమ్మితీరాలి. ఆ నమ్మకంతోనే మన కర్తవ్యాన్ని మనం నిర్వహించగలుగుతాం. "గురు గీత"లో వ్రాయబడిన "మంత్రమూలం గురుకృపా" అన్న వాక్యాలను ప్రతిక్షణం మననం చేసికోవడం మన కర్తవ్యం.

★★★

## సహవాసఫలం

*ఓ రైతు పొలం అడవికి సమీపంగా ఉండేది. ఆ అరణ్యంలో చాలా పక్షులుండేవి. రైతు పొలంలో విత్తనాలు విత్తి ఇంటికి వెళ్లగానే పక్షులు గుంపులు గుంపులుగా పొలంమీద వాలేవి. మట్టిని పెళ్లగించి, లోపల ఉన్న ధాన్యాన్ని తినేవి. పాపం, రైతు పిట్టలను తోలి తోలి విసుగుచెందాడు. అతను నాటిన విత్తనాలను పక్షులు తినేయడంతో, మళ్లీ పొలం దున్ని, విత్తనాలు విత్తవలసి వచ్చేది. పిట్టల బెడదతో రైతు బాగా విసిగిపోయాడు.*

*ఈసారి రైతు ఓ పెద్ద వలతెచ్చి, పొలంమీద పరచాడు. పిట్టలు గుంపులు గుంపులుగా పొలంమీద వాలాయి. వలలో చిక్కుకొని పోయాయి. పాపం, వాటితో పాటు ఓసారసపక్షి కూడా వలలో చిక్కుకొని పోయింది.*

*రైతు వలలో తగుల్కొన్న పక్షులను ఒక్కటొక్కటిగా పట్టుకోసాగాడు. అప్పుడు ఆ సారసపక్షి దీనంగా అతన్ని ఇలా వేడుకొంది– 'అయ్యా! నన్ను కరుణించండి. నేను మీకు ఎలాంటి హాని తలపెట్టలేదు. నేను కోడినీ కాను, కొంగనూ కాను. విత్తనాలు తినే పక్షిని అసలే కాను. నేను సారసపక్షిని. పంటలకు కీడుచేసే పురుగులను తినే పక్షిని. నన్ను వదిలి వెయ్యండి.'*

*రైతు అసలే కోపంగా ఉన్నాడు. పెట్రేగిపోతూ ఇలా అన్నాడు– 'నీమాట నిజమే కావొచ్చు. కాని నా పొలంలోని విత్తనాలను తినేసే పక్షులతో పాటు నీవు కూడా పట్టుపడ్డావు. నీవూ వాళ్ల స్నేహితుడివే. వీళ్లకు కలిగే శాస్తే నీకూ కలగాలి. తప్పదు మరి.'*

*నీవు ఎలాంటివాళ్ల స్నేహం చేస్తావో, నీకూ అలాంటి పేరే వస్తుంది. చెడ్డవాళ్లతో కలసి తిరిగితే, చెడ్డపనులు చేయకున్నా నీకు చెడ్డపేరు వస్తుంది. తగిన శిక్షకూడా పడుతుంది. చెరుపు చేసే పక్షులతో చేరినందువల్ల సారసపక్షి కూడా వలలో చిక్కుకోవలసి వచ్చింది.*

**గడిచిపోయిన సమయాన్ని, నోరుజారిన విషయాన్ని - తిరిగి తీసికోలేము.**

# మానవుని పశువుగామార్చే దుర్గుణాలు రెండు

మానవుడు పశువుగా మారుతున్నాడంటే ప్రముఖ కారణాలు రెండు. (1) నిషా (2) కోరిక. ఈ రెండింటిద్వారానే మానవుడు చాల సునాయాసంగా పశుత్వానికి దగ్గరౌతున్నాడు. ఎందుకంటే నిషా మనిషిని అజ్ఞానిని చేస్తే కోరిక గ్రుడ్డివానిని చేస్తుంది. ఈ రెండు దుర్గుణాలు పశుత్వానికి సంబంధించినవే. నైతికత వికసించాలంటే క్రింది నుండి ఉన్నతత్వానికి ప్రయాణించాలి. క్రిందినుండి పైకి పోవడమంటే కష్టతరమైన పని. కాని పైనుండి క్రిందికి పడిపోవడం చాల సులభం. దానికి పై దుర్గుణాలు రెండూ సహకరిస్తాయి. మానవుడు వాటి బారిన పడకుండా తన్నుతాను కాపాడుకోవాలి.

'నిషా, కోరిక' ఈ రెండూ మనలో ఏ మూలనోదాగిఉన్న పశుత్వాన్ని బయటకులాగిపడేస్తాయి. దానిఫలితంగా లోలోపల దాగిఉన్న అసంతృప్తి, కోరికలు విజృంభిస్తాయి. కలుషభూయిష్టమైన కోర్కెలవైపు పరుగులుతీస్తాయి. సాధారణసమయాలలో మనం వాటిజోలికిపోము. కాని ఏదైనా మనస్సునుబాధించే పరిస్థితి ఎదురైనప్పుడు మనస్సుకు ఓదార్పునిచ్చేసాకుతో పశువాంఛలను ఆశ్రయిస్తుంటాం. మత్తుకు బానిసలమవుతాం. కొంతకాలానికి మనస్సు స్థిమితపడితే వెనుదిరిగిరాగలుగుతాం. కాని మరల మరల అలాంటి పరిస్థితులు ఎదురైతే అటువైపుకేమొగ్గుచూపిస్తాం. ఫలితంగా దానికి పూర్తిగా బానిసలమవుతాం. ఇక తిరిగిరావడమన్నది చాల కష్టమౌతుంది.

మత్తులో కూరుకుపోయినవ్యక్తి కోర్కెలుతీర్చుకోకుండా జీవించలేడు. మత్తువీడిన తరువాత కొంత పశ్చాత్తాపపడినా దాలిగుంటలో పిల్లిమోస్తరు సాయంత్రం కాగానే యథాతథంగా తయారౌతాడు. ఇక ఆతని హృదయంలో మానవుడుండడు. మత్తువాసనలే పనిచేస్తూఉంటాయి. వాటికి ప్రాణాలవిలువలు, సామాజికవిలువలు, ఆరోగ్యవిలువలు ఏవీ గుర్తుకురావు.

సరిగ్గా కోర్కెల పరిస్థితికూడ ఇదే. కాముకత్వంతో కన్నులు మూసుకుపోయినవ్యక్తికి ఏ బంధుత్వాలు గుర్తుకురావు. ఆతని కళ్లకు తనకు కావలసిన బంధుత్వం మాత్రమే కనిపిస్తూఉంటుంది. కోర్కెలు కుక్కతోకవంటివి. వాటిని సరిచేయడం సాధ్యం కానిపని అవుతుంది. కుక్క ఎముకను నములుతుంది. ఎముక తాకిడికి దవడనుండి రక్తం వస్తే అది ఎముక నుండి లభించే రక్తమే అని భ్రమపడుతుంది. ఆ భ్రమలో తనరక్తాన్ని తానే త్రాగుతూ ఉంటుంది. అదేవిధంగా కాముకుడు కోర్కెలు తీర్చుకునే మోహంలో పడి తనకు జరిగే హానిని గుర్తించలేడు. కోర్కెల వలయంలో చిక్కి చివరకు ప్రాణాలమీదకు తెచ్చుకుంటాడు. కనుక నిషా-కోర్కెలు రెండు కూడ మోసకారులే ఎంతటి నిజాయితీ పరుడుకూడ వీటిదగ్గర మోసపోయే ప్రమాదముంది. ఆధునిక సమాజంలో నేడు ఇది ప్రత్యక్ష సత్యం. ఈనాడు వీటిని తప్పుగానే భావించడంలేదు. దేనికీ విలువలేదు. అసలు విలువలను కొలిచే కొలమానమేలేదు. సమాజ విలువలు ఎంతగా క్షీణించిపోయాయంటే మంచికి, చెడుకు భేదమే లేకుండాపోయింది. ప్రజలదృష్టిలో ఏదీ తప్పుకాదు. అన్నింటినీ సమర్థించి చెప్పగల తెలివితేటలు పెరిగిపోతున్నాయి. ఇటువంటి చదువుకున్న మూర్ఖులకు నచ్చచెప్పడం దుస్సాధ్యమైపోతోంది. ప్రతిదానికీ వితండవాదం చెయ్యడం ఒక జబ్బుగా మారిపోయింది. రోగగ్రస్థ సమాజంలో అస్వస్థతకు వైద్యంచేసే డాక్టరు లభించడమే కష్టంమైపోతోంది.

ఈ రెండే ఎదుగుతున్న యువతకు అధికసంఖ్యలో తన వలలోనికి లాగివేస్తున్నాయి. జీవితమంటే ఏమిటో తెలియని వయస్సులోనే గుడ్డిగా కోర్కెలవెంట పరుగులుతీస్తున్నారు. ఈ గ్రుడ్డి పరుగు ఎంతవరకు తీసికొనిపోతుందో తెలియడం లేదు. మన నీతి-నిజాయితీలను మరుగున పడవేస్తుంది నిషా, కోర్కెలు పతనంవైపు లాగికొనిపోతాయి. అందువల్లనే రెండింటికీ హద్దులు నిర్ణయించారు పెద్దలు. ప్రస్తుత పరిస్థితిలో హద్దులన్నీ చెదిరిపోయాయి. హద్దుల్లేని సమాజం దుష్పరిణామాలను ఎదుర్కొంటోంది. ఎప్పడైనా, ఎక్కడైనా చరిత్ర, శీలం, మర్యాద, అనుశాసనం అనేవి వ్యక్తిగతమే కాకుండ సామాజిక మూల్యాలను నిర్ధారిస్తాయి. ఇవే సామాజిక సంపద. ఈ రెండింటి ప్రభావంవల్ల జరిగే పరిణామం చాల ప్రమాదకరమైంది. మన రక్తంతోనే మనం హోలీ ఆడుకుంటున్నాం. ఈ హోలీని ఆపేదెవరు? ఎట్లా? ఎప్పుడు? కావలసిన షడ్యంత్రాన్ని రచించే సమర్థత ఎవరికుంది?

ఈనాడు సమాజం, వ్యక్తి కూడ మానసికంగా భ్రష్టుపట్టిపోయారు. అనారోగ్యపు మనస్సుతో అభివృద్ధికరమైన పనులు సాధ్యంకావు. ఉన్నతమైన ప్రక్రియలు చేపట్టాలి. సంకల్ప శుద్ధితో ముందుకుసాగాలి. మెల్ల మెల్లగా ఉద్యమాన్ని తీవ్రతరం చెయ్యాలి. జ్ఞానం, స్వాధ్యాయం, సేవ, విశ్వాసం, దయ, ప్రేమ మొదలైన వాటిని ప్రజలకందించాలి. దానిద్వారానే నాశకారకమైన అలవాట్లు బలహీనపడతాయి. "సత్యయుగంలో ఎవరూ జబ్బుపడేవారుకాదు. దొంగతనాలుండేవికావు. ఏవిధమైన హింసజరిగేదికాదు. హత్యలు జరిగేవికావు. వ్యభిచారం ఉండేదికాదు. నూటికో కోటికో ఒక దొంగతనం జరిగితే చాల విచిత్రంగా చూచేవారు" అని చెపుతుంటారు. దానికి కారణం సామాజికమూల్యాలను ప్రతివ్యక్తీ గౌరవించేవాడు. ఇప్పుడు దానికి పూర్తి వ్యతిరేకంగా నడుస్తోంది.

**ప్రతీ ఒక్కరోజు ఒక జీవనం - ప్రతీ ఒక్కక్షణం మహిమాన్వితం - సమయం విలువ తెలుసుకో.**

నిషా జ్ఞానాన్ని మరిపించే విషం అయితే కోర్కెలు పశుత్వానికి దగ్గరచేసే విషం. సమాజంలో జాగృతిని కలిగిస్తే మత్తును వదిలించడం అంతకష్టమేమీకాదు. జాగృతి పెరిగిన కొద్దీ సహాయం ఇబ్బడి ముబ్బడిగా లభిస్తుంది. మత్తునుండి బయటపడ్డవ్యక్తి అంతరాత్మను ధిక్కరించి మరల దానిచేతికి చిక్కలేడు. ఏ కారణాల వల్ల అతడు మత్తుకు బానిస అయ్యాడో గ్రహించి, సవరించినట్లైతే తొందరగా వెనక్కుతిరిగి రాగలుతాడు. మంచిసాహిత్యాన్ని అందిచాలి. నిత్యం స్వాధ్యాయం చేయించాలి. సత్సంగాలలో కూర్చుండబెట్టాలి. అప్పుడే అంతరాత్మసాక్షిగా మారిపోతాడు.

కష్టాలలో ఉన్నవ్యక్తి వాటిని మరచిపోవడానికి సుఖాలను వెతుక్కుంటూపోతాడు. అతనికి సులభంగా కనిపించేది వ్యభిచారమే. ఇంద్రియాలను తృప్తిపరచేక్షణిక సుఖంకోసం దేనిని పోగొట్టుకుంటాడో దాన్ని తిరిగి జీవితంలో సంపాదించుకోలేడు. అటువంటివారికోసం సమాజంలో 'థెరపీ సెంటర్స్' లేదా 'స్పిరిచ్‌వల్ కౌన్సిలింగ్ సెంటర్స్'ను స్థాపించాలి. అక్కడ వారిభావనలను మార్చివేసే ప్రయత్నం జరగాలి. అక్కడే అణచివేయబడిన కోర్కెల పంజానుండి విడిపించబడతాడు. అప్పుడే ప్రజలు ఈ పాపకూపం నుండి విముక్తి పొందుతారు.

ఇటువంటి జాగృతి కలగాలంటే కేవలం ఉపన్యాసాల వల్ల ఫలితంరాదు. అది ఒక ఉద్యమంగా కొనసాగాలి. ఆచరణలో పెట్టగలగాలి. దృఢమైన సంకల్పబలంతో భగీరథ ప్రయత్నం చేయాలి. అప్పుడే సమాజంలో ఈ రెండు విషాలకు విరుగుడు లభిస్తుంది. ఇవి తొలగిపోతే చాలు- సమాజంలో ఉన్న చిన్న చిన్న దోషాలు, పెద్ద పెద్ద దోషాలు వాటంతటవే ప్రక్కకు తప్పుకుంటాయి. శ్రేష్ఠ సమాజస్థాపన జరిగితీరుతుంది.

★★★

## పక్షినేర్పిన పాఠం

*ఓ ఊరిదగ్గర పొలంలో సారసపక్షుల జంట నివసిస్తూ ఉండేది. ఆడ సారసపక్షి గుడ్లుపెట్టింది. కొంత కాలానికి గుడ్లలోనుంచి పిల్లలు బయటికి వచ్చాయి. వాటికి రెక్కలు వచ్చి, అవి ఎగరటానికి ముందే పంటకోతకు వచ్చింది. సారసపక్షులకు దిగులు చుట్టుకొన్నది. రైతు పంటను కోయటానికి ముందే, పిల్లలతో పాటు మరో సురక్షితమైన చోటుకి ఎగిరివెళ్లాలి. కాని పిల్లలు ఎగరలేవే? అప్పుడు సారసపక్షి పిల్లలతో ఇలా అంది- 'మేం లేనప్పుడు ఎవరైనా పొలం వద్ద ఏమైనా మాట్లాడుకొంటే విని మాకు చెప్పండి.'*

*ఓ రోజు సారసపక్షి మేత తీసుకొని సాయంకాలం గూడు చేరుకొంది. అప్పుడు పిల్లలు ఇలా అన్నాయి- 'ఈ రోజు రైతువచ్చాడు. పొలం చుట్టూ తిరిగాడు. ఒకటి, రెండు చోట్ల నిలబడి పొలంవైపు చాలాసేపు చూసాడు. చేను కోతకు వచ్చింది. ఇక కొయ్యాల్సిందే. ఈ రోజు వెళ్లి ఊళ్లోని వాళ్లతో నా చేను కోయమని చెప్తాను.'*

*'మీరేమీ భయపడకండి. రైతు ఇప్పుడిప్పుడే చేను కొయ్యడు. ఇంకా కొన్నిరోజులు మనం ఇక్కడే హాయిగా ఉండొచ్చు' -అని పక్షి పిల్లలతో చెప్పింది.*

*కొద్దిరోజులు గడిచాయి. ఓ రోజు సారసపక్షి సాయంకాలం గూడు చేరుకొంది. అప్పుడు పిల్లలు బితుకు బితుకుమంటూ ఇలా చెప్పాయి- మనం వెంటనే ఈ చేను వదిలివెళ్లాలి. ఈ రోజు రైతు మళ్లీవచ్చాడు. ఊళ్లోని రైతులు చాలా స్వార్థపరులు. నా చేను కొయ్యటానికి ఇంతవరకు రాలేదు. నేను నా అన్నతమ్ముల్ని పిలిపించి వాళ్లతో పంట కోయిస్తాను.*

*సారసపక్షి హాయిగా, నిశ్చింతగా కూర్చొని పిల్లలతో ఇలా చెప్పింది.- 'ఇప్పుడిప్పుడే రైతు పంట కోయించడు. నాలుగైదు రోజుల్లో మీరు ఎంచక్కా ఎగరగలరు. ఇప్పుడిప్పుడే మనం పొలం విడిచి మరో చోటికి పోనక్కర్లేదు.'*

*ఇలా మరి కొన్ని రోజులు గడిచిపోయ్యాయి. సారసపక్షి పిల్లలు బాగా ఎగరసాగాయి. వాటికి భయం లేకుండాపోయింది. ఓ సాయంకాలం అవి సారసపక్షితో ఇలా అన్నాయి- 'ఈ రైతు మమ్మల్ని ఉత్తుత్తినే భయపెడ్తున్నాడు. ఇతడు పైరు కోసినట్లే. ఈ రోజు కూడా వచ్చాడు. అన్నాడు కదా- 'నా అన్నతమ్ములు నా మాట వినడంలేదు .ఏదో ఓ నెపంతో తప్పించుకొంటున్నారు. పైరు బాగా ఎండిపోయి గింజలు నేలరాలిపోతున్నాయి. రేపు పొద్దు పొడవగానే నేనే వచ్చి కోత మొదలెడ్తాను.'*

*అప్పుడు సారసపక్షి భయపడింది. - 'అరరే! వెంటనే బయలు దేరండి. ఇంకా చీకటిపడలేదు. మరో చోటికివెళ్లి తలదాచుకుందాం. రైతు రేపు తప్పకుండా పంట కోస్తాడు.' అని అంది.*

*పిల్లలు ఆదుర్దాగా అడిగారు- 'ఎందుకు వెళ్లాలి? రైతు రేపు పంట కోస్తాడన్న నమ్మకం ఏంటి?'*

*సారసపక్షి ఇలా బదులు చెప్పింది? -'రైతు గ్రామస్తులను, సోదరులను నమ్ముకొన్నంత కాలం పంట కోస్తాడన్న నమ్మకం కలుగలేదు. తనపని తాను చేయకుండా, ఇతరులు చేసి పెడ్తారని అనుకున్నంత కాలం ఎవరి పనులు జరగవు. కాని ఎవరంతట వారు, తమ పనులు చేసుకోవాలని నిర్ణయించుకొన్నప్పుడు, అవి చకచకా సాగిపోతాయి. రైతు తానే రేపు పంట కోస్తానని అన్నప్పుడు, ఆ పని తప్పకుండా జరిగితీరుతుంది?'*

*సారసపక్షులు పిల్లలతో ఆ క్షణమే మరో సురక్షితమైనచోటికి ఎగిరిపోయాయి.*

**స్వార్థానికి అనురాగం - సంఘర్షణానికి ద్వేషం జన్మదాతలు.**

వార్తలు

# రాష్ట్రంలో గాయత్రి యజ్ఞాలు

## గాయత్రీ చేతనా కేంద్రంలో గణేశ నవరాత్రి

హైదరాబాదులోని గాయత్రీ చేతనా కేంద్రంలో గణేశ నవరాత్రి సందర్భంగా తొమ్మిది రోజులపాటు క్రాంతిధర్మీ సాహిత్య సామూహిక స్వాధ్యాయ కార్యక్రమం జరిగింది. సెప్టెంబరు 3న శ్రీ సురేశ్ పద్మజ దంపతులు గణేశ ప్రతిష్ఠ జరిపారు. శ్రీమతి అనసూయమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కార్యకర్తలు సహకారాన్ని అందించారు. సెప్టెంబరు 14న నిమజ్జనం జరిగింది. మాతాజీ జయంతి సందర్భముగా సామూహిక జపం జరిగింది.

ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి గాయత్రి పరివార్, బోరబండ గాయత్రి పరివార్, బేగంపేట గాయత్రి పరివార్, దిల్‌సుఖ్‌నగర్ గాయత్రి పరివార్, తార్నాక గాయత్రి పరివార్, బేగంబజార్ గాయత్రి పరివార్, వివిధ రోజులలో గాయత్రి చేతన కేంద్రంలో రోజు 4 నుండి 5-30 వరకు అధ్యయన కార్యక్రమం జరిగింది.

5-8-08న అనాధచరణాలయం మహేంద్ర హిల్స్, హైదరాబాదు నందు శ్రీమతి వజ్రరాణి (డి.ఇ.ఓ) నిర్వహిస్తున్న అనాధశరణాలయంలో శ్రీమతి ఎ.శోభ గారు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. 50 మంది పాల్గొన్నారు.

శ్రీ పి.ఎన్.సురేశ్‌కుమార్ యదరసపల్లి గ్రామంలో 30-8-08న పంచకుండీయ యజ్ఞాన్ని నిర్వహించారు.

16-8-08న జంధ్యాల పౌర్ణమినాడు గాయత్రీ చేతనాకేంద్రం హైదరాబాదులో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. విశ్వగాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుండి 8-30 నిమిషాలకు దశవిధ స్నానాలు - గోపంచామృతాలు (పేడ, మూత్రం, పాలు, పెరుగు, నెయ్యి), తేనె, పసుపు, దర్భలు, మట్టితో మంత్రోక్తంగా నిర్వహించారు. తదనంతరం జంధ్యాలు మార్చుకున్నారు. త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్, శ్రీమతి మారెళ్ల విజయావిశ్వనాథ్, శ్రీ రఘు నిర్వహించారు. భోజనానంతరం 3 గంటలనుండి 5 గంటలవరకు "యుగశక్తి గాయత్రి" ఆగష్టు మాసపత్రికపై సత్సంగం జరిగింది. గాయత్రీమాతకు హారతినిచ్చి కన్నులపండువుగా దీపయజ్ఞం నిర్వహించారు. రాఖీపండుగను పురస్కరించుకుని ఆబాల వృద్ధులవరకు వయోభేదాలు, లింగభేదాలు మరచి, మానవహారంగా నిలబడి స్నేహసౌహార్ద్రాలను పుణికిపుచ్చుకున్నారు. జయ జయ నాదాలతో విడిపోయి భోజన ప్రసాదం స్వీకరించి గృహాలకు చేరుకున్నారు. దాదాపు 60-70 మంది పరిజనులు ఉత్సాహంతో పాల్గొన్నారు.

21-8-08 శుక్రవారంనాడు గాయత్రీ చేతనాకేంద్రం హైదరాబాదులో సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించబడింది. దాదాపు 40 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మిని పూజించి ధన్యులయ్యారు. సమాజంలో తరతమభేదాలు లేకుండ స్త్రీలను సమైక్యపరచే ఈ వ్రతాన్ని పురస్కరించుకుని మహిళామండలి స్థాపన జరిగింది. శ్రీమతి మహేశ్వరి అధ్యక్షురాలుకాగా, శ్రీమతి నాగకుమారి, శ్రీమతి విజయావిశ్వనాథ్ తదితరులు కార్యదర్శి వర్గంగా ప్రకటించడం జరిగింది.

24-8-08 నాడు గాయత్రీ చేతనాకేంద్రం హైదరాబాదులో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం గం॥ 6-30 ని॥ల నుండి గం॥ 7-30 ని॥ల వరకు ధ్యానం నడిచింది. తదనంతరం త్రికుండీయ గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభమయింది. యజ్ఞంతో పాటే హరేరామ-హరేకృష్ణ భజన గాయత్రీ మందిరంలో మొదలైంది. గం॥ 7-30 ని॥ల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. 3 గంటల నుండి 5 గంటల వరకు శ్రీ మారెళ్ల కామరాజు గారి ఆధ్వర్యంలో సామూహిక గీతాపారాయణ జరిగింది. గం॥ 5-30 ని॥ల నుండి హారతి, నాదయోగం యథాతథంగా జరిగింది. తరువాత దీపయజ్ఞంతో చి॥ సుకన్య ప్రథమ జన్మదిన సంస్కారం నిర్వహించడమైంది. ఉదయం నుండి సాయంత్రందాక 100 మంది భక్తులు పాల్గొన్నారు. అందరికీ శ్రీమతి సుబ్బులు భోజన ప్రసాదం అందించారు.

## ఒంగోలులో గాయత్రీ తేజం

ఒంగోలులో శ్రీ మలసాని వెంకటేశ్వర్లు, శ్రీమతి మలసాని శ్యామలాదేవి ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞాలు నిరంతరం నిర్విరామంగా కొనసాగుతున్నాయి.

17-8-08న ఒంగోలు దాసరి ఝాన్సీలక్ష్మి గారి ఇంట్లో పంచకుండముల గాయత్రి మహా యజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 8 జన్మదిన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. 68 మంది ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.

**స్వాధ్యాయం మానవునికి మార్గదర్శకుడు - నాయకుడు - మిత్రుడు.**

18-8-08న బాపుజీ గోశాలయందు పంచకుండముల గాయత్రి మహా యజ్ఞం నిర్వహించబడింది. 49 మంది పాల్గొన్నారు.

21-8-08న కందుకూరు ఉమామహేశ్వర గ్రానైట్స్‌లో పంచకుండముల గాయత్రి మహా యజ్ఞం నిర్వహించబడింది. 59 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 3 జన్మదిన సంస్కారాలు, 4 వివాహదిన సంస్కారాలు నిర్వహించారు.

22-8-08న కొణిజేడు గ్రామం, ప్రకాశం జిల్లా తాటిపర్తి వెంకటేశ్వర రెడ్డిగారి ఇంట్లో పంచకుండముల గాయత్రి మహా యజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములో ఒక జన్మదిన సంస్కారం, ఒక వివాహదిన సంస్కారం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో 70 మంది పాల్గొన్నారు.

24-8-08న కృష్ణాష్టమి సందర్భంలో నవకుండముల గాయత్రి మహా యజ్ఞం ఒంగోలు బాపుజీ గోశాలయందు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 4 జన్మదిన సంస్కారాలు 2 వివాహదిన సంస్కారాలు నిర్వహించబడ్డాయి. 123 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాయత్రి శక్తి పీఠం, ఒంగోలు వారు ఆగస్టు నెలలో నిర్వహించిన కార్యక్రమాలు-

| | |
|---|---|
| నవ కుండముల గాయత్రి మహా యజ్ఞం | - 1 |
| పంచ కుండముల గాయత్రి మహా యజ్ఞం | - 2 |
| జన్మదిన సంస్కారాలు | - 12 |
| వివాహదిన సంస్కారాలు | - 4 |

ఈ కార్యక్రమాలను శ్రీమతి కె.సీతామహలక్ష్మి, శ్రీమతి పి. వరలక్ష్మి నిర్వహించారు.

కార్యకర్తలకు అభినందనలు.

## జగిత్యాలలో

9-8-08న ధరూర్ క్యాంప్‌లో శ్రీ శక్తిగణేశ్ మందిరంలో త్రికుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. సుమారు 70 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

16-8-08 శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్థానిక భక్త మార్కండేయ దేవాలయములో నూతన యజ్ఞోపవీతధారణ, రక్షా బంధన్ కార్యక్రమాలు, పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. సుమారు 100 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలు శ్రీ ఆడెపు గంగారామ్ నిర్వహించారు. ఏడకంటి లక్ష్మీనారాయణ, వేముల రాంరెడ్డి గార్లు సహకరించారు.

## విజయనగరం జిల్లాలో

18-7-08న రావాడ గ్రామం (జియ్యమ్మ వలస మండలం)లో గురుపౌర్ణమి సందర్భంగా గాయత్రీ శక్తి పీఠంలో పంచకుండముల గాయత్రి మహాయజ్ఞం జరిగింది. ఈ కార్యక్రమాలు శ్రీ సుదర్శన బ్రహ్మ అగ్నిహోత్రి గారు మరియు స్థానిక గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జరిగాయి.

జియ్యమ్మ వలస గ్రామం ఆగష్టు 3వ తేదీన ఉదయం 108 కలశాలతో కలశయాత్ర తదనంతరం పంచకుండముల గాయత్రీ యజ్ఞం నిర్వహించబడింది. సాయంత్రం 2400 దీపాలతో దీప మహాయజ్ఞం జరిగింది. ఈ కార్యక్రమాలలో 16 మందికి అక్షరాభ్యాసం, ముగ్గురికి జన్మదిన సంస్కారం జరిగింది.

ఈ కార్యక్రమాలు శాంతికుంజ్ హరిద్వార్ మరియు స్థానిక గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జరిగాయి.

## నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

శ్రీమతి సుబ్బరావమ్మ, శ్రీ జి.సుబ్బయ్య చేయించిన పంచకుండీ యజ్ఞాల వివరాలు.

4-8-08న కొండపి గ్రామం, జగదీశ్వరి గారి ఇంట్లో 29 మంది గాయత్రీ మంత్ర దీక్ష తీసుకున్నారు.

16-8-08న శానంపూడి గ్రామం, కాట్రగడ్డ అనూరాధ, సుబ్బారావు గారి ఇంట్లో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం జరిగింది. పుష్పకుమారి, పావని, శివానిలకు జన్మదిన సంస్కారం నిర్వహించారు.

26-8-08న నాగులుప్పడు గ్రామం, వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది.

28-8-08న నాగులుప్పడు గ్రామం, గాయత్రి ప్రజ్ఞాపీఠం నందు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 45 మంది భక్తులు ఈ కార్యక్రమమంలో పాల్గొన్నారు.

## వెల్దుర్తి (కర్నూలు జిల్లా)

24-8-08న వెల్దుర్తి గ్రామంలోని శ్రీ బ్రహ్మగుండేశ్వర క్షేత్రం నందు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ కె.బాలకృష్ణ ఆచారి, వారి ధర్మపత్ని శ్రీమతి సరోజ, శ్రీ ఎస్.చంద్రశేఖరరెడ్డి నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**అశ్లీల సాహిత్యం అందరికీ ఆగర్భశత్రువు.**

## ప్రొ॥ శ్రీరామకృష్ణ గారి అమెరికా యాత్రా వివరాలు

డా॥ ప్రణవ పాండ్యాజీ అఖిల విశ్వగాయత్రీ పరివార్ - హెడ్ గారి ఆదేశానుసారం ప్రొ॥ శ్రీరామకృష్ణ 27-8-08 వరకు అమెరికా పర్యటన చేసివచ్చారు.

మొట్టమొదట డా॥ ప్రణవపాండ్యా గారి ఆధ్వర్యంలో న్యూజెర్సిలో 31-6-08 నుండి 3-8-08 వరకు యూత్‌క్యాంప్ పాల్గొన్నారు. యూనివర్శిటి ఆఫ్ కన్నెక్టికట్‌లో మూడురోజులు "అంతర్ జాగృతి" ( ) పై జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్నారు. తరువాత ఉలాంగ్‌ఐలండ్‌లో మూడురోజుల కార్యక్రమం "ఆధ్యాత్మిక విజ్ఞానం" ( )లో పాల్గొన్నారు. "గాయత్రీ జ్ఞానకేంద్రం" స్కూల్లో ప్రసంగాంచారు.

అమెరికాలో వీరి ప్రవచనాలు :

(1) ఆధ్యాత్మిక విజ్ఞానం (2) గాయత్రి మంత్రం ద్వారా మానవుని భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక జీవనానికి ప్రాణశక్తిని ఏవిధంగా పొందాలి? (3) ఆధ్యాత్మికతలో వైజ్ఞానికత (4) గాయత్రీ విజ్ఞానం - (స్థూల, సూక్ష్మ, కారణ) మూడు శరీరాలపై దాని ప్రభావం. అంతే కాక ఇంకా వీరు చెప్పిన ప్రవచనాలు హిందీ, ఇంగ్లీషులలో లభిస్తాయి.

## కమ్మవారిపల్లి (గూడూరు దగ్గర)లో పంచకుండీ గాయత్రి యజ్ఞం

4-8-08, 5-8-08 రెండురోజులు కమ్మవారిపల్లి రామాలయంనందు వినాయచవితి సందర్భమున పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం, స్థానిక గాయత్రి పరివార్ కార్యకర్త శీనయ్యగారి ఆధ్వర్యంలో నంబూరు నుండి శ్రీ బ్రహ్మాజి ఈ యజ్ఞం నిర్వహించారు. సుమారు 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేశవారి పాలెంలో

6-9-08 స్వర్ణ మండలం (చీరాల) కేశవారి పాలెం రామాలయంనందు శ్రీ పుల్లయ్య ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం శ్రీ మణికుమార్ శ్రీ బ్రహ్మాజీ గారు (బ్రహ్మారెడ్డి) నిర్వహించారు. సుమారు నూర్గురు భక్తులు ఈ కార్యమ్రంలో పాల్గొన్నారు.

## ఎద్దుమైలారంలో (మెదక్ జిల్లా)

7-9-08 ఆదివారం ఎద్దుమైలారం లోని ఆర్డినెన్సు ఫ్యాక్టరిలో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ హీర్‌సింగ్, శ్రీమతి అనసూయమ్మ ఆధ్వర్యంలో జరిగింది. శ్రీ రాజేంద్ర సింహ యాదవ్, శ్రీ బాపిరాజు యజ్ఞము నిర్వహించారు.

## ఏకైక రాజనీతి ఆధ్యాత్మికత

*భారతదేశానికి ఏకైక రాజనీతి ఆధ్యాత్మికత. సనాతన ధర్మమే ఏకైక ఆధారభూతమైన స్వరాజ్యం. ఇప్పుడు భారతదేశం పునర్జాగరణ యొక్క మొట్టమొదటి మెట్టుపై ఉంది. దేశాన్ని అజ్ఞానాంధకారం నుండి వెలికిదీసి జ్ఞానోపదేశం చేయగల అంతఃప్రవాహం 1905లోనే ప్రారంభమయింది. మూర్ఖత్వం మరుగున పడిననాడు సత్యం బయటకు వస్తుంది. సత్యగుణం వెల్లివిరుస్తుంది. అప్పుడు సశక్తమైన ఉద్యమం అంకురిస్తుంది. పరమేశ్వరుడు మనకు తగిన మార్గదర్శనం చేస్తాడనీ, తగిన పరిస్థితులను కల్గిస్తాడని నాకు పరిపూర్ణవిశ్వాసం.*

*-శ్రీ అరవిందో*

## వాసలి గ్రామంలో

20-8-08 వాసలి గ్రామం (ఆత్మకూరు మండలం, నెల్లూరు జిల్లా) రామాలయం నందు సదానంద స్వామి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహా యజ్ఞమును మాతాజీ, బ్రహ్మాజీ, రామచంద్రయ్య గారు నిర్వహించారు. 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

-గాయత్రి శక్తి పీఠం, కాకివాయి.

## కొల్లాపురంలో గాయత్రి పంచకుండీ యజ్ఞం

22-8-08 ఇల్లెందు మండలం కొల్లాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయమందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీమతి మచ్చా అనసూర్యమ్మ గారి ప్రోత్సాహంతో, ఇల్లెందు గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఎన్.నవీన, ఎన్.నవ్య నిర్వహించారు. సుమారు 100 మంది యజ్ఞంలో పాల్గొన్నారు.

## బీహార్ వరదబాధితులకు శాంతికుంజ్ సహాయం

బీహారు రాష్ట్రంలో సంభవించిన వరద పీడితులను ఆదుకోవటానికి శాంతికుంజ్, యుగనిర్మాణ మిషన్ తన వంతు బాధ్యత చేపట్టింది. శ్రీ గౌరిశంకర్ శర్మ నేతృత్వంలో వందమంది వాలంటీర్లు మూడు ట్రక్కుల సామాగ్రితో సహార్స, పూర్ణిమ ప్రాంతంలోని ప్రాంతీయ కార్యకర్తలతో రిలీఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదరణీయ డాక్టరు ప్రణవ పాండ్యాజీ, శ్రద్ధేయ శైలదీదీజీ వీరికి ప్రేరణ ఇచ్చి ఉత్సాహంతో సాగనంపారు.

గుర్తుంచుకోతగినవి రెండు - ఒకటి కర్తవ్యం, రెండు మరణం.

## అందరికీ ఆహ్వానం - మౌన సాధనాశిబిరం

8-11-08, 9-1-08 రెండు రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో మౌన సాధనా శిబిరం నిర్వహింపబడుతోంది. ఆసక్తి గల పరిజనులు పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి ( 0863 2534440) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 7-11-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

## అందరికీ ఆహ్వానం - సంజీవనీ సాధనాశిబిరం

22-11-08 నుండి 26-1-08 వరకు 5 రోజులు గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరులో 'సంజీవనీ సాధనా శిబిరం' నిర్వహింపబడుతోంది. ఆసక్తి గల పరిజనులు పాల్గొని ప్రయోజనం పొందగలరు. శ్రీ కోట సుబ్బారావు, శ్రీ వేణుగోపాలరెడ్డి ( 0863 2534440) గార్లను సంప్రదించి ముందుగా అనుమతి పొందగలరు.

**గమనిక :** రాదలచిన వారు 21-11-08న రాత్రికే నారాకోడూరుకు చేరుకోవాల్సి ఉంటుంది.

## శాంతికుంజ్ - హరిద్వార్‌లో

గాయత్రీ తీర్థం శాంతికుంజ్-హరిద్వార్‌లో 1-9-08 నుండి 9-9-08 వరకు 9 రోజుల సంజీవనీ సాధనా శిబిరం తెలుగులో నిర్వహింపబడింది. శిబిరంలో 115 మంది పరిజనులు పాల్గొనగా, వారిలో 16 మంది యుగశిల్పి శిబిరానికి నెలరోజుల నిమిత్తం ఉండిపోయారు.

శ్రీ అశ్విని సుబ్బారావు, శ్రీ పరమానంద ద్వివేదీ, శ్రీ ఉమేశ్ శర్మ శిబిరాన్ని పర్యవేక్షించారు. శ్రీ బ్రిజ్‌మోహన్ గౌడ్ "సమయదానమే యుగధర్మం" అన్న విషయంపై అమోఘమైన ప్రవచనం చేశారు. దానికి స్పందించి 21 మంది పూర్తి సమయదాతలుగా రావడానికి తమ సంసిద్ధతను తెలియచేయడం విశేషవిషయం. వారి పేర్లు క్రింద ఇవ్వబడినవి.

శ్రీమతి ప్రశాంతి హిందీ ప్రవచనాలను తెలుగులోనికి అనువదించి వివరించారు. శ్రీ గౌరీశంకర శర్మ కార్యకర్తల బాధ్యతల గురించి వివరిస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రవచనం చేశారు. శ్రీ ఉత్తమ్, ఫూల్‌సింగ్ తదితరులు మధురమైన సంగీత లహరిలో శ్రోతలను ఓలలాడించారు. పాల్గొన్న పరిజనులందరికీ డా॥ ప్రణవ పండ్యాజీ, శ్రీమతి శైలాదీదీల ఆదరపూర్వక ఆశీస్సులు లభించాయి.

**సంసిద్ధతను తెలిపినవారి వివరాలు :**

1. కొంపెల్ల సత్యనారాయణ, ఫోన్ : 9347028483, 27243938
2. కె.విజ్ఞ రాజ్‌సింగ్ ఠాకూర్, ఫోన్ : 9247183306
3. మడమచ్చి సుధాకర్, ఫోన్ : 9908428700, 0863-2280062
4. నావులూరి అంజిరెడ్డి, ఫోన్ : 0863-2280025
5. వై.కృష్ణారావు, కాకినాడ. ఫోన్ : 9391165954
6. పి.జి.హరిశంకర్, మెదక్. ఫోన్ : 9951239636
7. టి.కృష్ణమూర్తి, ఫోన్ : 9490682082, 040-23815233
8. శివరామకృష్ణయ్య, ఫోన్ : 9703281061
9. కె.సుబ్బరామయ్య, ఫోన్ : 9441484897, 08518-226712
10. కృష్ణయాదవ్, కొవ్వూరు. ఫోన్ : 9390464368
11. యన్.శ్రీనివాస్, శ్రీకాకుళం. ఫోన్ : 9346224727
12. గాయత్రి, అమలాపురం. ఫోన్ : 9000257712, 08856
13. కె.ఉమాదేవి, ఫోన్ : 9441484897
14. కె.రామలక్ష్మి, ఫోన్ : 9347028483, 040-27243938
15. కె.కృష్ణకుమారి, గుంటూరు. ఫోన్ : 9290107986
16. జి.వీరరాఘవమ్మ, ఫోన్ : 08648-254324
17. సామ్రాజ్యం, గుంటూరు. ఫోన్ : 08648-254121
18. మరుపాకల లక్ష్మి, ఫోన్ : 08594-24688
19. కోటిక జయరాయలక్ష్మి, ఫోన్ : 998996477
20. పినుగొండ రాజేశ్వరి, ఫోన్ : 08594-246275

★★★

**ఉత్తమ సాహిత్యానికి వారసుల్ని చేసిన తల్లిదండ్రులు ధన్యులు.**